అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 01-3-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 60 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 14 పేజీలు వెల : 6.50

ధరణి సమస్యల పరిష్కారానికి

మార్గదర్శకాలు

మార్చి 1 నుంచి 9 వరకు రెవెన్యూ సదస్సులు

- కలెక్టర్లకు కీలక బాధ్యతలు అప్పగింత
- 17 మాడ్యూల్స్‌లో ఉన్న 2,45,036 దరఖాస్తులు
- 20 లక్షల ఎకరాల భూ వివాదాలకు పరిష్కారం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో ధరణి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు గురువారం భూ పరిపాలనా శాఖ ముఖ్య కమిషనర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 1 నుంచి మార్చి 9 వరకు ధరణి సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. తహశీల్దార్, ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్లు, కలెక్టర్ల సమక్షంలో రెవెన్యూ కమిటీలు 9 రోజుల్లో పెండింగ్ అప్లికేషన్లను క్లియర్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కరెక్షన్ చేసిన దరఖాస్తుల వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరచాలని సూచించింది. ధరణిని అడ్డం పెట్టుకొని ఆక్రమించిన ప్రభుత్వ భూముల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆధార్ నెంబర్ మిస్ మ్యాచ్, రైతుల పేర్లు తప్పుగా నమోదై ఆగిపోయిన అప్లికేషన్లు, ఫొటో మిస్ మ్యాచ్‌లను సత్వరమే పరిష్కరించనుంది. దరఖాస్తుదారునికి ఫోన్, వాట్సాప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా సమాచారం చేరవేయాలని ఆదేశాల్లో పేర్కొంది. అప్లికేషన్లను క్లియర్ చేసే ముందు ప్రభుత్వ రికార్డులో వాటి వివరాలను తప్పనిసరిగా చెక్ చేయాలని ప్రభుత్వం సూచించింది. మార్చి 9 తర్వాత తిరస్కరణకు గురయిన దరఖాస్తులపై సమీక్ష నిర్వహించి అన్ని జిల్లా కలెక్టర్లు ...3లో



మెగా డీఎస్సీ

11,062 పోస్టులతో నోటిఫికేషన్.. హైదరాబాద్‌లో అత్యధికం, పెద్దపల్లిలో అత్యల్పం

విడుదల చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

- ఆన్‌లైన్‌లో 11 కేంద్రాల్లో రాతపరీక్షలు
- 4 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- తుది గడువు ఏప్రిల్ 3
- గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ చేయొద్దు
- అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మెగా నోటిఫికేషన్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతోపాటు విద్యాశాఖ అధికారులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తదితరులు పాల్గొన్నారు. 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గతేడాది సెప్టెంబర్ ఆరో తేదీన డీఎస్సీ నోటిఫికేషన్‌ను గత ప్రభుత్వం విడుదల చేయగా, 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. కాగా ప్రస్తుత ప్రభుత్వం పాత డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేసిన సంగతి విదితమే. గత ప్రభుత్వం ప్రకటించిన 5,089 పోస్టులకు అదనంగా 4,957 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి అనుమతి ఇస్తూ ఆర్థిక శాఖ గతనెల 26న ఉత్తర్వులు జారీ చేసింది. స్పెషల్ ఎడ్యుకేషన్‌లో 796 సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ), 220 స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) కలిపి మొత్తం 1,016 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ గతనెల 26న అనుమతినిచ్చింది. దీంతో 11,062 ఉపాధ్యాయ పోస్టులతో రాష్ట్ర ప్రభుత్వం మెగాడీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇందులో హైదరాబాద్‌లో అత్యధికంగా 878 పోస్టులున్నాయి. ఇక అత్యల్పంగా పెద్దపల్లిలో 93 పోస్టులున్నాయి. అయితే సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మహిళలకు సమాంతర రిజర్వేషన్ల విధానాన్ని అమలు చేస్తున్నారు. జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్సీటీఈ) మార్గదర్శకాల ప్రకారం ఎస్జీటీ పోస్టులకు డీఎడ్ అభ్యర్థులే అర్హులు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులకే బీఎడ్ అభ్యర్థులు ...3లో

ఉపాధ్యాయ పోస్టుల వివరాలు

కేటగిరీ	పోస్టులు
స్కూల్ అసిస్టెంట్	2,629
ఎస్జీటీ	6,508
పండితులు	727
పీఈటీలు	182
మొత్తం	10,046
స్పెషల్ ఎడ్యుకేషన్	
స్కూల్ అసిస్టెంట్	220
ఎస్జీటీ	796
మొత్తం	1,016
మొత్తం పోస్టులు	11,062

ఇక సోలార్ వెలుగులు

పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనకు

కేంద్ర క్యాబినెట్ ఆమోదం



- కోటి కుటుంబాలకు ప్రతినెలా 300 యూనిట్ల కరెంటు ఉచితం
- రూ.75,021 కోట్లు కేటాయింపు
- మూడు సెమీ కండక్టర్స్ యూనిట్ల ఏర్పాటు
- ఖరీఫ్ సీజన్ ఎరువుల సబ్సిడీకి ఆమోదం 13లో

హిమాచల్‌లో ఆరుగురిపై వేటు

క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై చర్య



వివరాలు 13లో..

కేరళ లోకాయుక్త బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

- ప్రభుత్వ విజయంగా అభివర్ణించిన మంత్రి, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి



వివరాలు 13లో..

మల్కాజిగిరిలో తేల్చుకుందామా..?

నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా.. మీరు సీఎం పదవికి రాజీనామా చేయండి..

- ఇద్దరం ఎంపీ సీటుకు పోటీ చేద్దాం :సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్
- ఎన్డీఎస్ఏ ఇచ్చింది రాజకీయ ప్రేరేపిత నివేదిక అంటూ విమర్శ
- రేవంత్‌కు పదవులన్నీ పేమెంట్ కోటాలో వచ్చాయంటూ ఘాటు వ్యాఖ్యలు
- పలు అంశాలపై పాత్రికేయులతో ఇష్టాగోష్టి
- మంత్రి ఉత్తమ్‌కు బ్యారేజీకి, రిజర్వాయర్‌కు తేడా తెలియదంటూ ఎద్దేవా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'అక్కడా, ఇక్కడా కాదు.. మీరు మొన్నటి వరకూ ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరిలోనే తేల్చుకుందాం. నేను నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. మీరు కూడా మీ ఎమ్మెల్యే పదవికి, సీఎం పదవికి రాజీనామా చేయండి. ఆ సీటు నుంచి ఇద్దరం లోక్‌సభకు పోటీ చేద్దాం.. ఎవరు గెలుస్తారో చూద్దాం...' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఒక్క ఎంపీ ...6లో

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా

మీడియా అకాడమీ చైర్మెన్ కె శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

13లో..

ఎన్నికల కోడ్ రాకముందే మిగితా గ్యారంటీల అమలు

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులుగా డాక్టర్ చిన్నారెడ్డి బాధ్యతల స్వీకరణ

3లో..

సోషల్ మీడియా విప్లవం

- భారత్‌ను చుట్టుముట్టిన సామాజిక మాధ్యమాలు
- ఏ రంగమైనా వాటిదే హవా

వివరాలు 3లో

రైతులు ఆందోళన చేశారని..

పాస్‌పోర్ట్, వీసాలు రద్దు

- హర్యానా ప్రభుత్వ నిర్వాకం
- ఖానౌరీ సరిహద్దు వద్ద యువ రైతు శుభకరణ్ సింగ్‌కు రైతు నాయకుల నివాళి
- ఎట్టకేలకు యువ రైతు మృతిపై హత్య కేసు నమోదు
- 17వ రోజుకు రైతుల ఆందోళన

వివరాలు 13లో



నిమిషం నిబంధన ప్రాణం తీసింది!

సాత్నాల ప్రాజెక్టులో దూకి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

క్షమించు నాన్న అంటూ సూసైడ్ నోట్..

- ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం మాంగుర్ల గ్రామంలో



నవతెలంగాణ- జైనథ్

ఇంటర్ పరీక్షల్లో ప్రభుత్వం విధించిన నిమిషం నిబంధన ఓ విద్యార్థి ప్రాణం తీసింది. సమయానికి వెళ్లి పరీక్ష రాయలేకపోయాననే మనస్తాపంతో సాత్నాల ప్రాజెక్టులో దూకి ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం మాంగుర్ల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జైనథ్ మండలం మాంగుర్లకు చెందిన టేకం రాములు, పంచపూల దంపతుల కుమారుడు శివకుమార్(17) జిల్లా ...13లో


ఈ-కేవైసీ గందరగోళం

ముగిసిన గడువు

- పూర్తికాని రేషన్‌కార్డు, ఆధార్ అనుసంధాన ప్రక్రియ
- అసలే పరీక్షల సీజన్
- విద్యార్థులకు నష్టం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు అనుసంధాన ప్రక్రియ గందరగోళంలో పడింది. ఈ ప్రక్రియ సెప్టెంబర్ 5, 2023న ప్రారంభమైంది. ఫిబ్రవరి 29తో గడువు ముగిసింది. అయితే ఇప్పటి వరకు కేవైసీ చేయించుకోలేని వారి పరిస్థితి ఆందోళనకరంగా మారింది. అయితే కేంద్ర ప్రభుత్వం కేవైసీ గడువును పొడిగిస్తుందా? లేదా? అనే విషయాన్ని ఇంకా తేల్చలేదని ...3లో



జ్ఞాన్‌వాపిలో పూజకు అనుమతించిన రిటైర్డ్ జడ్జికి పదవి

తీర్పునిచ్చిన నెలలోపే ఇదంతా

యూపీలోని ఒక యూనివర్సిటీకి లోక్‌పాల్‌గా నియామకం

న్యూఢిల్లీ : అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి మార్గం సుగమం చేస్తూ తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) రంజన్ గొగోయ్.. తన పదవీ విరమణానంతరం రాజ్యసభ ఎంపీ అయ్యారు. పదవీ విరమణ దగ్గర పడుతున్న తరుణంలో సున్నితమైన అయోధ్య-బాబ్రీ మసీదు విషయంలో ఒక వర్గానికి అనుకూలంగా, ఒక పార్టీకి బలం చేకూరేలా తీర్పునిచ్చారనీ, అందుకు ప్రతిఫలంగానే ఆయనకు రాజ్యసభ సీటు వరించిందని ఆ మధ్య వాదనలు వినిపించాయి. ఇప్పుడు వారణాసిలోని జ్ఞాన్‌వాపి మసీదు విషయంలోనూ ఇదే సీన్ రిపీట్ అయినట్టు కనిపిస్తున్నది. మసీదు బేస్‌మెంట్‌ను హిందువులకు పూజల కోసం తన ఉద్యోగ జీవితంలో చివరి రోజున అప్పగించిన నెలలోపే.. రిటైర్డ్ జడ్జి అజయ కృష్ణ విశ్వేషా లక్నోలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయానికి అంబుడ్స్‌మెన్‌గా నియమితులయ్యారు. విశ్వేషా జనవరి 31న వారణాసి జిల్లా న్యాయమూర్తిగా పదవీ విరమణ చేశారు.

ఫిబ్రవరి 27న.. డాక్టర్ శకుంతలా మిశ్రా నేషనల్ రిహాబిలిటేషన్ యూనివర్సిటీ (ఇది యూపీ ...13లో

బయటపడని బ్లాక్‌మనీ

నలుపు నలుపే కానీ తెలుపు కాదు...!

● జీడీపీలో దాని వాటా 20 శాతానికి పైనే ● డిజిటల్ లావాదేవీలతో పెరిగిన నేరాలు ● కోట్లాది రూపాయల ప్రజాధనం లూటీ ●అదంతా మళ్లీ చీకటి వ్యాపారంలోకే

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఉచితాలు, నగదు బదిలీలు, నల్లధనాన్ని చెలామణిలోకి తీసుకురావడం పైనే అందరూ దృష్టి సారిస్తున్నారు. నల్లధనాన్ని వెలికితీసి, దాని కారకుల భరతం పడతామని పెద్ద నోట్ల రద్దు సమయంలో ఎన్డీఏ ప్రభుత్వం బీరాలు పలికింది. పెద్ద నోట్ల రద్దుకు ముందు నల్లధనంపై రెండు శ్వేతపత్రాలు విడుదలయ్యాయి. వాటిలో ఒకటి ప్రపంచబ్యాంక్ విడుదల చేసింది కాగా రెండోది నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్ఐపీఎఫ్‌పీ) విడుదల చేసింది.



న్యూఢిల్లీ : 1999-2007 మధ్య భారతదేశంలో ఏ మేరకు నల్లధనం ఉన్నదనే దానిపై ప్రపంచబ్యాంక్ 2010లో అంచనా వేసింది. పెద్ద నోట్ల రద్దుకు ముందు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నల్లధనంపై ఓ శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. నల్లధనం అంటే కేవలం నగదు మాత్రమే కాదని, స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, ఇతర ఆస్తుల విలువను కూడా పరిగణనలోకి తీసుకోవాలని తెలిపింది.

ప్రపంచబ్యాంక్ ఏం చెప్పింది?

ప్రపంచబ్యాంక్ శ్వేతపత్రం ప్రకారం భారత్‌లో 2009-10లో రూ.964 కోట్ల ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. బహిర్గతం చేయని ఆదాయం రూ.8,101 కోట్లు ఉంది. 2010-11లో రూ.775 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకోగా బహిర్గతం చేయని ఆదాయం రూ.10,649 కోట్లు ఉంది. 2011-12లో రూ.906 కోట్ల విలువైన ఆస్తులు స్వాధీనమయ్యాయి. బహిర్గతం చేయని ఆదాయాన్ని రూ.14,017 కోట్లుగా తేల్చారు. 2012-13లో రూ.575 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకోగా బహిర్గతం చేయని ఆదాయం రూ.10,292 కోట్లు. 2013-14లో

స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ రూ.808 కోట్లు. బహిర్గతం చేయని ఆదాయం రూ.10,792 కోట్లు. 2014-15లో రూ.762 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకోగా బహిర్గతం చేయని ఆదాయం రూ.10,288 కోట్లు. 2015-16లో (2015 నవంబర్ వరకూ) రూ.470 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకోగా బహిర్గతం చేయని ఆదాయం రూ.6,167 కోట్లు. పెద్ద నోట్ల రద్దు లావాదేవీల ఖర్చు రూ.1.28 లక్షల కోట్లు అని సెంటర్ ఫర్ మానిటరింగ్ ది ఇండియన్ ఎకానమీ 2015 నవంబరులో తెలిపింది. ఇక జీడీపీలో నల్లధనం 1999లో 23.2 శాతం, 2000లో 23.1 శాతం, 2001లో 22.8 శాతం, 2002లో 22.6 శాతం, 2003లో 22.3 శాతం, 2004లో 22.0 శాతం, 2005లో 21.7 శాతం, 2006లో 21.2 శాతం, 2007లో 20.7 శాతంగా ఉన్నదని ప్రపంచబ్యాంక్ తెలిపింది.

రూ. 2000 నోట్ల విడుదలతో...

పెద్ద నోట్ల రద్దు తర్వాత దానిపై చాలా చర్చ జరిగింది. పెద్ద నోట్లను రద్దు చేసిన వెంటనే మోడీ ప్రభుత్వం రూ.2000 నోట్లను విడుదల చేసింది. నల్లధనాన్ని తెలుపుగా మార్చుకోవడానికి ఈ చర్య బాగా ఉపయోగపడింది. అది 2019 సార్వత్రిక ఎన్నికల్లో సైతం ఉపయోగపడింది. దీనివల్ల అన్ని పార్టీలు లబ్ది పొందాయి. బహుశా దీనిని గుర్తించినందునే ఎన్నికల బాండ్లను విడుదల చేశారు.

రూ.2000 నోట్లను ప్రవేశపెట్టడం వల్ల నగదు లావాదేవీలు డిజిటల్‌కు మారాయని ఆర్‌బీఐ చెప్పుకొచ్చింది. అయితే డిజిటల్ లావాదేవీల కారణంగా నగదు చెలామణి నిజంగా నిలిచిపోయిందా? దీనికి చాలా మంది 'లేదు' అనే సమాధానమే ఇచ్చారు.

ఆర్థిక శాఖ మౌనం

నోట్లపై నెంబర్లు ఉండడం, కరెన్సీని ఆర్‌బీఐ విడుదల చేయడం వల్ల గతంలో నల్లధనాన్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నాలు జరిగాయి. కానీ ఇప్పుడు ఆ పని చేయడం అసంభవం. భారత ఆర్థిక వ్యవస్థపై ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇటీవల విడుదల చేసిన శ్వేతపత్రం సైతం ఈ విషయంపై మౌనం వహించింది. దీనికి ప్రభుత్వంతో సంబంధం లేదన్న అభిప్రాయాన్ని కలిగించింది. ఇలాంటి పరిస్థితుల్లో గతిశక్తి, వికసిత్ భారత్ వంటి కార్యక్రమాల ద్వారా దేశ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఎలా ఆశించగలం? ఐఎంఎఫ్, ఓఈసీడీ, ఏడీబీ, ప్రపంచబ్యాంక్ వంటి అంతర్జాతీయ రుణ రేటింగ్ సంస్థల ఆశావహ అంచనాలతో దేశంలోని నల్లధనమంతా చెలామణిలోకి వస్తుందని కలలు కంటున్నాము. ఆ ఆశాభావంతోనే ఉందాం. అంతా మంచే జరగాలని కోరుకుందాం.

డిజిటల్ లావాదేవీలతో ఏం జరిగింది?

గడచిన దశాబ్ద కాలంలో వివిధ రాష్ట్రాల్లో శాసనసభలకు జరిగిన ఎన్నికల్లో నగదు పంపిణీ విచ్చలవిడిగా జరిగింది. మద్యం సరఫరా, బహుమతుల పందేరం సంగతి సరేసరి. రూ.2000 నోట్లలో 98 శాతం తిరిగి బ్యాంకులకు చేరాయని, అవి ఇప్పుడు చెలామణిలో లేవని ఆర్‌బీఐ తెలిపింది. ఈ అంతరాన్ని రూ.500 నోట్లు పూడ్చగలిగాయా అన్నది అనుమానమే. కానీ ఒక విషయం మాత్రం సుస్పష్టం. డిజిటల్ లావాదేవీల పుణ్యమా అని యాచకుల నుంచి బ్యాంకర్ల వరకూ చాలా మంది క్యూఆర్ కోడ్ వాలెట్ ద్వారా లావాదేవీలు జరుపుతున్నారు. అయితే పేటీయం వాలెట్, పేటీయం పేమెంట్ బ్యాంక్ దివాలా తీశాయని ఇటీవలే ప్రకటించారు. డిపాజిట్‌దారులందరికీ ఒక ఆర్‌బీఐ నోటిఫైడ్ బ్యాంక్ ద్వారా రక్షణ కల్పించడం ఊరట ఇచ్చింది.

ఉనికిలోనే ఉంది నల్లధనానికి సంబంధించిన తాజా గణాంకాలు ఎవరికీ తెలియవు. దాని ఉనికిని మాత్రం కాదనలేము. అది ఇప్పటికీ ఓటర్లను ప్రభావితం చేస్తూనే ఉంది. దాదాపు అన్ని రాజకీయ పార్టీల వద్ద నల్లధనం ఉంది. అయితే అనేక ఆర్థిక నేరాల్లో లభించినట్లుగా దీనికి ఆధారాలు మాత్రం దొరకవు.

తెలుపు నుంచి మళ్లీ నలుపుగా...

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన శ్వేతపత్రంలోనూ, ప్రపంచబ్యాంక్ విడుదల చేసిన వార్షిక నివేదికల్లోనూ గణాంకాలు ఒకేలా ఉన్నాయి. అయితే 2016 తర్వాత నల్లధనానికి సంబంధించి ఆర్థిక మంత్రిత్వ శాఖ ఎలాంటి నివేదికలను విడుదల చేయలేదు. రూ.100, రూ.2000 నోట్ల మధ్య ఉన్న భారీ తేడాను పరిగణనలోకి తీసుకొని ప్రజల డిమాండ్ మేరకు 2017 ఆగస్ట్ 25న రూ.200 నోట్లను ప్రవేశపెట్టారు. డిజిటల్ యుగంలో సైబర్ నేరాల సంఖ్య కూడా బాగా పెరిగిపోయింది.

నేరగాళ్ల వలలో చిక్కిన వారు కోట్లాది రూపాయలు పోగొట్టుకున్నారు. వారంతా న్యాయం కోసం చకోర పక్షుల్లా ఎదురు చూపులు చూస్తున్నారు. నేరాలు జరిగిన తీరు, తంతులా సాగుతున్న విచారణలు చూస్తుంటే బాధితుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి. ప్రజలను లూటీ చేసి సంపాదించిన కోట్లాది రూపాయల సొమ్ము ఇప్పుడు ఎక్కడుంది? ఆ డబ్బు దొడ్డిదారిన రంగు మార్చుకొని తెలుపు నుండి మళ్లీ నలుపుగా మారిపోయింది.

ఎట్టకేలకు 'సందేశ్‌ఖలి' నిందితుడు షేక్ షాజహాన్ అరెస్టు

- బేడీలు కూడా వేయని బెంగాల్ పోలీసులు
- 10 రోజుల కస్టడీ విధించిన కోర్టు
- గ్రామస్తుల సంబరాలు



కోల్‌కతా : అన్నివైపుల నుంచి విమర్శలు రావడంతో సందేశ్‌ఖలి కేసులో ప్రధాన నిందితుడు, తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు షేక్ షాజహాన్‌ను బెంగాల్ పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలో మినాఖాహ బ్లాక్‌లో గురువారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్న పోలీసులు బసిర్‌హత్ కోర్టులో హాజరుపరచగా, ది రోజుల పోలీసు కస్టడీకి కోర్టు అప్పగించింది. సందేశ్‌ఖలీలో హింసకు కారకుడైన ఈ ఘరానా నాయకుణ్ణి ఇన్ని రోజులు కాపాడుకొచ్చిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కంటి తుడుపు చర్యగా పార్టీ నుంచి ఆరేండ్లపాటు సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ సస్పెన్షన్‌ను చాలా మంది ఇప్పటికే ఎగతాళి చేయనారంభించారు. ఈ కేసును ప్రభుత్వం తన కనుసన్నల్లోని సీఐడీ దర్యాప్తునకు అప్పగించింది. సందేశ్‌ఖలి మహిళలపై లైంగికదాడి, దహనం, దోపిడీ, హత్యలు, భూములను అక్రమించుకోవడం వంటి తీవ్ర అభియోగాలతో 10కి పైగా కేసుల్లో నిందితుడిగా ఉన్నప్పటికీ షాజహాన్ జోలికి పోవడానికి పోలీసులు సంకోచించారు. కారణం అతనికి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ దన్నుగా నిలవడమే. ప్రజా ఉద్యమాల నుంచి ఒత్తిడి, కోర్టు చీవాట్లు వీటన్నిటి నేపథ్యంలో ప్రభుత్వం అతడిని అరెస్టు చేయక తప్పలేదు. ఇందుకు 2 నెలల సమయం పట్టింది. గురువారం కోర్టుకు తీసుకొచ్చిన సమయంలో పోలీసులు అతనికి ఎలాంటి సంకెళ్లు వేయలేదు. కనీసం పోలీసులు అతన్ని పట్టుకోనూ లేదు. దర్జాగా కోర్టు హాల్లోకి షాజహాన్ నడుచుకుంటూ వెళ్లాడు. షాజహాన్, కోబ్రా బృందంగా పిలవబడే సుమారు 70 మంది అతని మద్దతుదారులు తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, తమ భూములు బలవంతంగా అక్రమించుకున్నారని సందేశ్‌ఖలిలో మహిళలు కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. షాజహాన్‌పై నేరాభియోగాల తీవ్రతను తగ్గించి చూపేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. గురువారం మీడియా సమావేశంలో శాంతి భద్రతల ఏడీజీ సుప్రతిమ్ సర్కార్ మాట్లాడుతూ షాజహాన్‌పై ప్రస్తుతానికి కేవలం రెండు కేసులు మాత్రమే నమోదై ఉన్నాయని అన్నారు మిగిలిన కేసులన్నీ ఫిర్యాదు దశలోనే ఉన్నాయని తెలిపారు.కాగా, షాజహాన్ అరెస్టు వార్తతో సందేశ్‌ఖలిలో గ్రామస్తులు సంబరాల్లో మునిగిపోయారు. మహిళలు వివిధ రంగులతో హోలీ ఆడగా, పురుషులు నృత్యాలు, చిన్నారులు బాణా సంచా కాల్చడం వంటి పనులతో తమ ఆనందం వ్యక్తం చేశారు. అయితే టీఎంసీ ప్రభుత్వం మాత్రం శాంతిభద్రతల పేరుతో సందేశ్‌ఖలి గ్రామంలో 144 సెక్షన్ విధించింది.

బీజేపీపై రాహుల్‌ది అలుపెరగని పోరు

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి





వాయనాడ్ : రాహుల్ గాంధీ మళ్లీ వాయనాడ్ నుంచి పోటీ చేసే అవకాశం ఉన్నదని సూచనప్రాయంగా తెలుస్తోంది. కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) రాజకీయ ప్రచార కార్యక్రమం (సమరాగ్ని) బహిరంగ ర్యాలీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం అనుసరించిన నిరంకుశ, అవినీతిమయ విధానాలు... దేశవ్యాప్తంగా వామపక్ష భావజాలాన్ని కలుషితం చేశాయన్నారు. దేశాన్ని రక్షించడానికి రాహుల్ కంకణం కట్టుకున్నారని, అందుకే బీజేపీకి వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేస్తున్నారని తెలిపారు.. కేరళలో తన నియోజకవర్గం (వాయనాడ్) గురించి రాహుల్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బీజేపీకి వ్యతిరేకంగా జాతీయ స్థాయి పోరుకు నాంది పలకబోతుందని చెప్పారు. కాంగ్రెస్ నాయకుడు సచిన్ పైలట్ మాట్లాడుతూ.. దేశ రాజకీయాలకు బీజేపీ వల్ల అస్తిత్వ ముప్పును ఎదుర్కొంటున్నాయని వివరించారు. లౌకిక పార్టీలు ముందుకు రావాలని కోరారు. తమ ప్రాంతీయ విభేదాలను , సన్నిహిత శ్రేణులను సమన్వయపర్చుకుని ముందుకెళ్లాల్సిన అవసరం ఉన్నదన్నారు. "కేంద్రంలో అధికారంలోకి వచ్చేందుకు జరిగే ఎన్నికలు కావు. ఫాసిజం నుంచి భారతదేశాన్ని విముక్తి చేయడానికి ఇది ఒక అస్తిత్వ యుద్ధం," అని పైలట్ అన్నారు. దేశ రాజ్యాంగంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు ఎలాంటి పాత్ర లేదని ఆయన అన్నారు. దళితులకు, మైనారిటీలకు బీజేపీ వ్యతిరేకమని కాంగ్రెస్ నేత జిగ్నేష్ మేవానీ అన్నారు. కార్యక్రమంలో కేరళ ఇన్‌చార్జీగా ఉన్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపా దాస్‌మున్షీ, ఎంపీ శశి థరూర్, యూడీఎఫ్ కన్వీనర్ ఎం.ఎం. హసన్, సీనియర్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాల, కోడికున్నిల్ సురేష్ ,జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు పాలోడు రవి తదితరులున్నారు.

గురుకుల జూనియర్ పోస్టుల ఫలితాలు..

జాబితా విడుదల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సంక్షేమ గురుకులాల్లో జూనియర్ లెక్చరర్ ఉద్యోగ రాత పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలు గురుకుల నియామక బోర్డు గురువారం విడుదల చేసింది.డిగ్రీ కళాశాలల్లో 793 అధ్యాపకుల ఉద్యోగ రాత పరీక్ష ఫలితాలను బుధవారం విడుదల చేసిన అధికారులు..తాజాగా జేఎల్ పోస్టులకు ఎంపికైన వారి ప్రాథమిక జాబితాలను సబ్జెక్టుల వారీగా వెబ్‌సైట్ https//treirb.cgg.gov.in/home లో అందుబాటులో ఉంచారు. జేఎల్ రాత పరీక్షలు గతేడాది ఆగస్టు 3 నుంచి 23 వరకు నిర్వహించిన విషయం తెలిసిందే. వికలాంగుల కేటగిరీ ఫలితాలు సైతం త్వరలోనే ప్రకటించనున్నారు.

సోషల్ మీడియా విప్లవం

భారత్‌ను చుట్టుముట్టిన సామాజిక మాధ్యమాలు

- ఏ రంగమైనా వాటిదే హవా
- ఆంక్షలతో కట్టడి చేస్తున్న మోడీ సర్కారు
- టెక్ నిపుణులు, విశ్లేషకుల ఆందోళన

భారత్‌లో సోషల్ మీడియా ప్రభావం గురించి ప్రత్యేకంగా చెప్పకోనక్కర్లేదు. ఏ రంగంలోనైనా ఈ సామాజిక మాధ్యమ విప్లవం అనేక మార్పులను తీసుకొచ్చింది. ఇందుకు రాజకీయ రంగమూ అతీతం కాదు. భారత్‌లోని పలు రాజకీయ పార్టీలు సోషల్ మీడియాను ప్రచారానికి ఒక వేదికంగా, ఒక సాధనంగా వినియోగించుకుంటున్నాయి. ప్రస్తుతం, రాజకీయ రంగాన్ని సోషల్ మీడియా శాసిస్తున్నది. కేంద్రం, రాష్ట్రాల్లో ప్రభుత్వాలనే మార్చే శక్తి దీనికి ఉన్నదని రాజకీయ విశ్లేషకులు, టెక్ నిపుణులు అంటున్నారు.



న్యూఢిల్లీ : ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఎక్స్(గతంలో ట్విట్టర్) వంటివి ప్రధాన సామాజిక మాధ్యమాలుగా చలామణిలో ఉన్నాయి. మార్క్ జుకర్‌బర్గ్ 2005లో ఫేస్‌బుక్‌ను ప్రారంభించారు. అది ఇప్పుడు అమెరికా వంటి ఒక్క దేశానికే కాదు.. భారత్, రష్యా వంటి ఇతర దేశాల్లోనూ రాజకీయాల్లో పెను మార్పులకు దారి తీసింది. అప్పటి నుంచి "సోషల్ నెట్‌వర్క్‌లు" చాలా సర్వవ్యాప్తి చెందాయి. అవి లేకుండా జీవితాన్ని ఊహించటం అనేది అసాధ్యంగా మారిందని టెక్ నిపుణులు అంటున్నారు.

జార్ఖండ్‌లోని రాంచీ సమీపంలో సరళ (పేరు మార్చబడింది) అనే 15 ఏండ్ల అమ్మాయి నిరుపేద అయినప్పటికీ ఆమె స్మార్ట్‌ఫోన్‌ను కలిగి ఉన్నది. తన సోషల్ మీడియా ఖాతాలో ఫాలోవర్లను చూపిస్తూ మురిసిపోయింది. ఆమె సోషల్ మీడియాలో రోజుకు నాలుగు గంటలు గడుపుతుంది. సోషల్ మీడియాలో గిరిజన నృత్యాలతో ఫేమస్ అయిన సదరు బాలిక.. తాను ప్రముఖ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనిని కలుసుకుంటానని నమ్మకాన్ని వ్యక్తం చేసింది. బాలిక తండ్రి స్వంతంగా చిన్న దాబాను నడుపుతున్నాడు.

వినియోగదారుల సంఖ్య ఇలా

సోషల్ మీడియా విప్లవం భారత్‌ను పూర్తిగా చుట్టుముట్టింది. ఫేస్‌బుక్‌కు 32 కోట్ల మంది వినియోగదారులు, ఫేస్‌బుక్ మెసెంజర్‌కు 14 కోట్ల మంది యూజర్లు ఉన్నారు. ఫేస్‌బుక్ కొనుగోలు చేసిన ఇన్‌స్టాగ్రామ్‌కు 33 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. ఫేస్‌బుక్ కొనుగోలు చేసిన మరొక యాప్ వాట్సాప్‌కు 40 కోట్ల మందికి పైగా యూజర్లు ఉన్నారు. సాపేక్షంగా తెలియని టెలిగ్రామ్‌కు కూడా దాదాపు 24 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. లింక్డ్‌ఇన్‌లో దాదాపు 15 కోట్ల మంది యూజర్లు, యూట్యూబ్ 50 కోట్ల కంటే ఎక్కువ మంది వినియోగదారులను కలిగి ఉన్నాయి. టెక్నాలజీ టైకూన్ ఎలోన్ మస్క్ కంపెనీని చేజిక్కించుకున్న తర్వాత ఇప్పుడు ఎక్స్ అని పిలువబడే ట్విట్టర్, కేవలం ఐదు కోట్ల మంది వినియోగదారులను కలిగి ఉన్నది. కానీ భారత్‌లో ప్రభావవంతమైన వ్యక్తులు దీనిని ఉపయోగిస్తున్నందున.. సామాజిక, రాజకీయ చర్చలపై దాని ప్రభావం అపారమైనదని రాజకీయ విశ్లేషకులు, టెక్ నిపుణులు అంటున్నారు.

రాజకీయంగా లబ్ది పొందుతున్న బీజేపీ

సోషల్ మీడియా శక్తిని మొదట్లోనే గుర్తించి, దానిని సద్వినియోగం చేసుకోవటంలో అత్యంత విజయవంతమైన భారతీయుడు బహుశా ప్రధాని మోడీయేనని చెప్తున్నారు. 2002 గుజరాత్ అల్లర్ల నుంచి అతను ప్రధాన స్రవంతి మీడియాతో అంతగా సంబంధాలను కలిగి లేడు. అయితే, మోడల్ గుజరాత్ అంటూ సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారాన్ని చేసుకొని సఫలీకృతుడయ్యాడనీ, బీజేపీ ఐటీ విభాగం కూడా కల్పిత, సత్య దూరమైన కంటెంట్‌ను సామాజిక మాధ్యమాల్లో విరివిగా ప్రచారం చేస్తున్నదని విశ్లేషకులు అంటున్నారు. ప్రజలకు ప్రత్యక్షంగా చేసిందేమీ లేకపోయినా.. ఇలాంటి వార్తలతో కావాల్సినంత ప్రచారాన్ని చేసుకొని మోడీ, బీజేపీ రాజకీయంగా చాలా లబ్దిని పొందుతున్నదని చెప్తున్నారు.

స్మార్ట్‌ఫోన్‌లోనే గడుపుతున్న భారతీయుడు

వివిధ ఏజెన్సీలు నిర్వహించిన సర్వేల శ్రేణి ప్రకారం.. సగటున ఒక భారతీయుడు తన ఇష్టపడే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ను ఉపయోగించి తన స్మార్ట్‌ఫోన్‌లో ప్రతిరోజూ 150 నుండి 200 నిమిషాల మధ్య గడుపుతున్నట్టు వెల్లడైంది. ప్రపంచంలోని అన్ని ప్రధాన దేశాలలో మొబైల్ డేటా వినియోగ ఖర్చులు.. భారతదేశంలో అత్యంత చౌకగా ఉండేందుకు ఇది సహాయపడుతుంది. ఇది ఆయా టెలికాం సంస్థలకు లాభాలను గుమ్మరిస్తున్నదని నిపుణులు అంటున్నారు. రాజకీయ నాయకులు తమ ఇమేజ్‌ను పెంచుకోవటానికి, సాధారణ వ్యక్తులు తాము ఫేమస్ కావటానికి, తమ వీడియోల ద్వారా యూట్యూబ్ వంటి వేదికల మీద డబ్బును సంపాదించుకోవటానికి సోషల్ మీడియా ప్రచారాస్త్రంగా, ఆదాయ వనరుగా మారిందని విశ్లేషకులు చెప్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో వివిధ రంగాలకు చెందిన విలువైన కంటెంట్‌లను పెడుతూ ఎంతో మంది ప్రజలు 'సోషల్ మీడియా ఇన్‌ఫ్ల్యుయెన్సర్‌లు'గా మారిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు.

ప్రచారాలకు వేదిక

ప్లాట్‌ఫారమ్‌లు అన్నీ ఒకదానితో ఒకటి అనుసంధానించబడి ఉన్నాయి. ఉదాహరణకు.. ఒక రాజకీయ పార్టీ నాయకుడు అసహ్యంగా ఏదైనా చెబితే దానిని ట్రోల్ చేయటం, ప్రత్యర్థి పార్టీలు తమకు అనుకూలంగా మార్చుకోవటం వంటివి చేస్తున్నాయి. మరికొన్ని వీడియోలకు సినిమాల్లో హిట్ అయిన పాటలను జోడించి.. సదరు నాయకుడికి కావాల్సినంత ఎలివేషన్‌ను తీసుకురావటానికి సామాజిక మాధ్యమాలు వేదికయ్యాయి. సామాజిక మాధ్యమాల ద్వారానే రాజకీయ నాయకుల చర్యలు ప్రజలను వేగంగా చేరుకుంటున్నాయి. భారత్‌లో తరచుగా ఉపయోగించే 70 కోట్లకు పైగా స్మార్ట్‌ఫోన్ల ద్వారా ఈ సోషల్ మీడియా ఎక్కువగా నడుస్తున్నదని టెక్ నిపుణులు చెప్తున్నారు.



గోప్యతపై ఆందోళన

అయితే, సోషల్ మీడియా విప్లవం ఇంతగా ఉన్నప్పటికీ.. దాని గోప్యత విషయంలో ఇప్పటికీ అనేక అనుమానాలున్నాయని టెక్ నిపుణులు అంటున్నారు. అమెరికా ప్రెసిడెంట్ ఎన్నికల్లో ఫేస్‌బుక్‌పై వచ్చిన ఆరోపణలను వారు గుర్తుకు చేస్తున్నారు. ఇక భారత్‌లో మోడీ ప్రభుత్వం.. తనకు నచ్చని కంటెంట్ వస్తే యూట్యూబ్, ట్విట్టర్ వంటి సంస్థలపై పెట్టిన ఆంక్షలను సైతం విశ్లేషకులు నెమరు వేస్తున్నారు. మోడీ సర్కారు తీరుతో సోషల్ మీడియాలోనూ స్వేచ్ఛ కరువైందనీ, పౌర సమాజం ఈ విషయంలో ఆలోచించాలని వారు సూచిస్తున్నారు.

స్వచ్ఛత కలిగిన రాతలు లక్ష్మీదేవమ్మ రచనలు

నవతెలంగాణ సంపాదకులు సుధాభాస్కర్

- జీవితం- ఉద్యమం పుస్తకావిష్కరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఐద్వా సీనియర్ నాయకురాలు లక్ష్మీదేవమ్మ రచనలు స్వచ్ఛమైన రాతలని నవతెలంగాణ సంపాదకులు సుధాభాస్కర్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో లక్ష్మీదేవమ్మ రచించిన జీవితం–ఉద్యమం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కమ్యూనిస్టు ఉద్యమాన్ని నమ్ముకుని ఊగిసలాటకు గురికాకుండా నికరంగా నిలబడ్డ వారిలో ఆమె ఒకరని చెప్పారు. లక్ష్మీదేవమ్మ రెండు తరాలకు మధ్య వారధి లాంటి వారనీ, అలాంటి వారిని కాపాడుకోవాల్సిన అవసరముందని తెలిపారు. ఐద్వా సీనియర్ నాయకురాలు టి.జ్యోతి మాట్లాడుతూ లక్ష్మీదేవమ్మ రాసిన పుస్తకం చాలా బాగుందని కొనియాడారు. ఆ పుస్తకంలో తన జీవితంలో చూసిన సమస్యలను, నిజ జీవితాన్ని ఆవిష్కరించారని తెలిపారు. ప్రతి మనిషి జీవితంలో సమస్యలున్నప్పటికీ వాటిని ఎలా అధిగమించి లక్ష్యం వైపు వెళ్లారనే విషయాలను రాశారని తెలిపారు. ఈ తరానికి స్ఫూర్తినిచ్చే పుస్తకమన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఏపీ నాయకురాండ్లు కె.స్వరూపారాణి, విశాలక్ష్మి, సుధ తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యల పరిష్కారానికి మార్గదర్శకాలు

(మొదటి పేజీ తరువాయి)

సీసీఎల్‌ఏకు రిపోర్ట్ సమర్పించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. మెగా రెవెన్యూ సదస్సు ద్వారా 17 రకాల మాడ్యూల్స్‌లో పెండింగ్‌లో ఉన్న 2,45,036 దరఖాస్తులను క్లియర్ చేయనున్నారు. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 30 లక్షల ఎకరాల భూ వివాదాలకు పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ వర్గాలు భావిస్తున్నాయి.

ధరణి ముఖ్యాంశాలు

1). మార్చి 1 నుంచి 9 వరకు రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు

2). దరఖాస్తుల పరిశీలనకు తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో 2నుంచి 3 బందాలు పని చేస్తాయి.

3). పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను రెవెన్యూ బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలను తహశీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న రెవెన్యూ సిబ్బందికి అందిస్తారు.

4). చిన్న చిన్న సమస్యలను తహసిల్దార్, ఆర్డీవో స్థాయిలోనే పరిష్కరించనున్నారు.

5). అసైన్మెంట్, ఇతర ముఖ్య భూ వివాదాలకు సంబంధించి మాత్రం తహసిల్దార్ ధృవీకరించిన తర్వాత, సమస్యను బట్టి, ఆర్డీవో, కలెక్టర్, అనంతరం సీసీఎల్‌కు బదిలీ చేస్తారు. తుది నిర్ణయం సీసీఎల్ తీసుకోనుంది.

6). మార్చి 1 నుంచి 9 వరకు జరగనున్న ప్రత్యేక రెవెన్యూ సదస్సుల అనంతరం ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగించనున్నారు. భూ సమస్యల పరిష్కారానికి ఎంఆర్‌వో నుంచి కలెక్టర్ వరకు కాల పరిమితిని విధించారు.

7), తహశీల్దార్ 7 రోజులు, ఆర్డీవో 3 రోజులు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) 3 రోజులు, కలెక్టర్ 7 రోజుల్లో తమ వద్దకు వచ్చే భూ సమస్యలను పరిష్కరించాలని సీసీఎల్ ఆదేశాలు జారీ చేసింది.

తహసిల్దార్ స్థాయిలో పరిష్కరించే సమస్యలు.

1. టీఎం 14 - ఆధార్‌లో తప్పులు, ఆధార్ లేక పోవడంపై ఫిర్యాదులు
2. టీఎం 10 - జీపీఏ, ఎస్‌పీఏ, ఎగ్జిక్యూటెడ్ జీపీఏ కోసం దరఖాస్తు
3. టీఎం4 - అసైన్డ్ భూములతో సహా వారసత్వం కోసం దరఖాస్తు
4. టీఎం 32- ఖాతా విలీనం దరఖాస్తు

ఆర్డీవో స్థాయిలో పరిష్కరించే సమస్యలు

1. టీఎం 7 - పాస్‌బుక్ లేకుండా నాలా కోసం దరఖాస్తు
2.టీఎం 16 - సేకరించిన భూములకు సంబంధించిన ఫిర్యాదులు
3. టీఎం 20 - ఎస్ఆర్‌ఐ పోర్టల్ వివాదాలు
4. టీఎం 22 - సంస్థ కోసం పట్టాపాస్ బుక్ జారీ
5. టీఎం 26 - కోర్టు కేసుల సమాచారం
6). టీఎం 33 - పాస్‌బుక్ డేటా సవరణ కోసం దరఖాస్తు

పరిధి సవరణ (ప్రాథమిక విలువ రూ. 5 లక్షల వరకు)

కలెక్టర్ స్థాయిలో పరిష్కరించే సమస్యలు

1. టీఎం 3 - మ్యూటేషన్ కోసం ధరఖాస్తు
2. టీఎం 4 - అసైన్డ్ భూములతో సహా వారసత్వం కోసం దరఖాస్తు
3. టీఎం 15 - నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చడానికి సంబంధించిన ఫిర్యాదు
4. టీఎం 23-సెమీ అర్బన్ ల్యాండ్ కోసం దరఖాస్తు
5. టీఎం 24 -కోర్టు కేసుల కోసం దరఖాస్తు
6. టీఎం 31 - "ఇల్లు/ఇంటి స్థలం" కోసం నాలా మార్పిడి

(భూమి బదిలీ, పేరు మార్పు, మిస్సింగ్ సర్వే నెం మొదలగు సవరణలు)

7. టీఎం 33-పాస్‌బుక్ డేటా కరెక్షన్ కోసం దరఖాస్తు(పేరు మార్పు మొదలగునవి)

పరిధి సవరణ (ప్రాథమిక విలువ రూ.5 లక్షల నుంచి రూ. 50 లక్షల కంటే ఎక్కువ)

సీసీఎల్‌ఏ స్థాయిలో పరిష్కరించే సమస్యలు

1. టీఎం 33-పాస్‌బుక్ డేటా కరెక్షన్ కోసం దరఖాస్తు

. ఏ). అన్ని రకాల పట్టాపాస్ బుక్ బదిలీ

బి). భూమి రకం దిద్దుబాటు (భూమి స్వభావం, వర్గీకరణ, ఆనందం మరియు భూమిని స్వాధీనం చేసుకునే విధానం సవరణలు)

సి. పరిధి సవరణ (ప్రాథమిక విలువ రూ.50 లక్షల కంటే ఎక్కువ)

డి. సర్వే నెంబర్, సబ్ డివిజన్ మిస్సింగ్ (రూ.50 కంటే ఎక్కువ ప్రాథమిక విలువ).

రాష్ట్రంలో మెట్రో కోచ్ ఫ్యాక్టరీ పెట్టండి

- అవసరమైన సహకారం అందిస్తాం : బీఈఎంఎల్ సీఎండీ శంతను రాయ్‌తో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

'రాష్ట్రంలో మెట్రో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పెట్టండి.. అవసరమైన భూమి, ఇతర వనరులు, సహకారం ప్రభుత్వ పక్షాన అందిస్తాం'అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం సచివాలయంలో బీఈఎంఎల్ (భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్) కంపెనీ సీఎండీ శంతను రాయ్ బృందంతో ఆయన సమావేశమయ్యారు. బీఈఎంఎల్ కంపెనీ బేస్ ఎక్కడ, ఏ యే రంగాల్లో పెట్టుబడులు, ఉత్పత్తులు సృష్టిస్తున్నదనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. మెట్రో రైల్ కోచ్‌లు, రక్షణ, మైన్స్ వంటి రంగాల్లో తమ కంపెనీ పని చేస్తుందని శంతను రాయ్ ఈ సందర్భంగా వివరించారు. బెంగళూరు కేంద్రంగా తమ కంపెనీ పని చేస్తుందనీ, రక్షణ రంగానికి సంబంధించి కేరళ రాష్ట్రంలోని పాలక్కడ్‌లో, సింగరేణిలో ఎర్త్ మూవర్స్ రంగాల్లో పనిచేస్తున్నట్టు వివరించారు. తమ కంపెనీ హైదరాబాద్‌లో ప్రాంతీయ కార్యాలయం ఉన్నట్టు తెలిపారు. ఇక్కడ మెట్రో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్న క్రమంలో తాము రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని వివరించారు. మెట్రో కోచ్ ఫ్యాక్టరీల తయారీలో ఇతర కంపెనీలకు బీఈఎంఎల్‌కు ఉన్న తేడా ఏంటి? ధరలు, నాణ్యత వంటి అంశాల్లో ఉన్న ప్రత్యేకత ఏంటో కంపెనీ లెటర్‌పై వివరించాలని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా కోరారు. హైదరాబాద్ సిటీతో పాటు రాష్ట్రంలోని వాతావరణం, వనరులను పరిశీలించండి, త్వరలో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఒక సమావేశం ఏర్పాటు చేసి మెట్రో రంగానికి సంబంధించి బీఈఎంఎల్ ఆసక్తులను సమగ్రంగా చర్చిద్దామని భట్టి తెలిపారు. సమావేశంలో డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఈఎంఎల్ కంపెనీ మెట్రో కోచ్ నమూనాను కంపెనీ బృందం డిప్యూటీ సీఎం కు అందజేసింది.

ఎన్నికల కోడ్ రాకముందే మిగితా గ్యారంటీల అమలు : డాక్టర్ చిన్నారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంటు ఎన్నికల కోడ్ రాకముందే రాష్ట్రంలో తమ పార్టీ ఇచ్చిన గ్యారంటీల్లో మిగిలిన రెండింటినీ అమలు చేస్తామని డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు. గురువారం హైదరాబాద్ లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ఆయన ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. ప్రజావాణిలో 4.90 లక్షల అర్జీలు వచ్చాయనీ, వాటిలో 4 లక్షల సమస్యలను పరిష్కరించేందుకు ఇప్పటికే చర్యలు తీసుకున్నామని వివరించారు.

ఈ-కేవైసీ గందరగోళం

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు చెబుతున్నారు. రేషన్‌కార్డు యాజమానితోపాటు కుటుంబ సభ్యులందరూ రేషన్ డీలర్ల వద్ద ఈ కేవైసీ చేసుకోవాలని గతేడాది కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. రేషన్ సరకులు పక్కదారి పట్టకూడదనే ఉద్దేశంతో, కేవలం కార్డులో పేర్లు ఉన్న లబ్ధిదారులకే బియ్యం అందాలని రాష్ట్రంలో రేషన్‌కార్డుల వెరిఫికేషన్ ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే రేషన్ కార్డ్ కేవైసీని ప్రభుత్వం చేపట్టింది. 'ఈ పాస్ యంత్రం' ద్వారా ప్రతీ లబ్ధిదారుడు కేవైసీ చేసుకోవాలని గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలిపింది. ఫిబ్రవరి 29తో కేంద్రం విధించిన గడువు ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం గడువు పొడిగించాలని కోరుతుందా? లేదా? అనేది చూడాలి. ప్రతి ఒక్కరూ ఈ–కేవైసీ చేయించుకోకపోతే సదరు సభ్యుడి కోటా రేషన్ కట్ అయినట్టే. దీంతో రాష్ట్రంలో రేషన్‌కార్డుదారులు తీవ్ర ఆందోళనకు గురి అవుతున్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా విద్యార్థులకు నష్టం జరగనుంది. తమ పిల్లలు నష్టపోయే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆవేదనకు గురి అవుతున్నారు. అసలే పరీక్షల సీజన్ నడుస్తున్నది. లక్షలాది మంది విద్యార్థులు ఎక్కడెక్కడో హాస్టళ్లల్లో చదువుతున్నారు. పరీక్షల సమయంలో అక్కడి నుంచి వచ్చి ఈ కేవైసీ చేసుకోవడం సాధ్యం కావట్లేదని చెబుతున్నారు. ఇప్పటికే ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ నెలలో పదవ తరగతి పరీక్షలు ఉన్నాయి. ఈ సమయంలో విద్యార్థులు వచ్చి ఈ కేవైసీ చేయించుకోవడం ఇబ్బందిగా మారింది. రాష్ట్రంలో మొత్తంగా రేషన్‌కార్డుదారులు 90 లక్షల మంది ఉన్నారు. అందులో కుటుంబ సభ్యులు 2.90 కోట్ల మంది ఉన్నారు. ఇప్పటికే 85శాతం మంది ఈ కేవైసీ చేయించుకున్నారు. మిగిలిన వారిలో అత్యధికంగా విద్యార్థులు, విదేశాల్లో ఉన్న వారు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. మరికొంత మంది చనిపోయారు. ప్రభుత్వ హాస్టళ్లల్లో చదువుకుంటున్న పిల్లలు నిరుపేద కుటుంబాలకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. వారంతా దసరా, సంక్రాంతి పండుగులకు వచ్చి రేషన్‌కార్డు ఈ కేవైసీకి ప్రయత్నించినా, చాలా చోట్ల నెట్‌వర్క్ సమస్య తలెత్తింది. కొన్ని సార్లు రేషన్‌దుకాణాలు బంద్ ఉన్నాయి. ప్రతినెల 15 తేదీలోపు మాత్రమే రేషన్‌దుకాణాలు తెరచి ఉంటాయి. ఆ సమయంలో విద్యార్థులు ఇంటికి వచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందని చెబుతున్నారు.

బాసర ఐఐటీలో స్వయంగా అధికారులు వచ్చి ఈ కేవైసీ చేయించారు. ప్రతి ఒక్కరి దగ్గర ఆధార్ ధ్రువీకరణ, వేలిముద్రలు, కంటిపాప గుర్తులు తీసుకున్నారు. ఇది మంచి పరిణామమే కానీ అన్ని విద్యా సంస్థల్లో అటువంటి ప్రయత్నం జరగలేదు. ఆ కార్డులో పేర్లు ఉన్న కుటుంబ సభ్యులందరూ సమీపంలోని రేషన్ దుకాణానికి వెళ్లి 'ఈ పాస్' మిషన్‌లో మళ్లీ వేలిముద్రలు వేయాలి. వేలిముద్ర తీసిన తర్వాత అతని ఆధార్ కార్డు నంబర్‌తో పాటు రేషన్ కార్డు నంబర్ డిస్‌ప్లే అవుతుంది. ఆ తర్వాత గ్రీన్‌లైట్ వచ్చి కేవైసీ అప్ డేట్ పూర్తవుతుంది. రెడ్ లైట్ ఆన్‌లో ఉంటే, రేషన్‌కార్డ్ కేవైసీ ఇంకా చేసుకోలేదనేది తెలిసిపోతుంది. కేంద్రం ఇప్పటికైనా ఈ కేవైసీ గడువును పొడిగిస్తే పేదలకు మేలు జరుగుతుందనీ, లేకపోతే తమ పిల్లల రేషన్ కట్ అవుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

మెగా డీఎస్సీ

(మొదటి పేజీ తరువాయి)

దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

జూన్ లేదా జులైలో డీఎస్సీ రాతపరీక్షలు

మెగా డీఎస్సీ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో ఈనెల నాలుగో తేదీ నుంచి ప్రారంభం కానుంది. వాటి సమర్పణకు వచ్చేనెల మూడో తేదీ వరకు గడువున్నది. ఈనెల నాలుగు నుంచి వచ్చేనెల రెండో తేదీ వరకు దరఖాస్తు ఫీజు చెల్లించేందుకు అవకాశమున్నది. దరఖాస్తు ఫీజు రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుంది. గతంలో దరఖాస్తు చేసిన అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. అయితే డీఎస్సీకి దరఖాస్తు చేసే అభ్యర్థుల వయోపరిమితిని ప్రభుత్వం సడలించింది. కనిష్ట వయోపరిమితి 18 నుంచి గరిష్ట వయోపరిమితి 46 ఏండ్ల వరకు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేయొచ్చని సూచించింది. ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేండ్లు, మాజీ సైనికులకు మూడేండ్లు, ఎస్సీ,ఎస్టీ,బీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి ఐదేండ్లు, వికలాంగులకు పదేండ్లపాటు సడలింపునిస్తున్నట్టు ప్రకటించింది. ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీఆర్టీ)ను నిర్వహించాలని నిర్ణయించింది. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, సంగారెడ్డి కేంద్రాల్లో రాతపరీక్షలను నిర్వహిస్తామని వెల్లడించింది. అభ్యర్థులు ప్రాధాన్యతల వారీగా పరీక్షా కేంద్రాలను ఎంచుకోవాలని సూచించింది. రాతపరీక్షల నిర్వహణ తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేసింది. విద్యార్హతలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్, సిలబస్, కేటగిరీల వారీగా పోస్టుల వివరాలు సమాచార బులెటిన్‌లో ఉంటాయని వివరించింది. ఇతర వివరాలకు https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం జూన్ లేదా జులైలో డీఎస్సీ రాతపరీక్షలను నిర్వహించే అవకాశమున్నది. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కోడ్ ముగిసిన తర్వాతే రాతపరీక్షలను నిర్వహించాలని విద్యాశాఖ భావిస్తున్నట్టు తెలిసింది.



జిల్లాల వారీగా ఉపాధ్యాయ పోస్టులు

జిల్లా	ఎస్ఏ	ఎల్‌పీ	పీఈటీ	ఎస్జీటీ	స్పెషల్ ఎస్ఏ	స్పెషల్ ఎస్జీటీ	మొత్తం
1. ఆదిలాబాద్	74	14	2	209	6	19	324
2. భద్రాద్రి కొత్తగూడెం	129	10	1	268	8	31	447
3. హన్మకొండ	73	5	7	81	4	17	187
4. హైదరాబాద్	158	113	31	537	6	33	878
5. జగిత్యాల	99	39	8	161	5	22	334
6. జనగామ	50	21	7	118	5	20	221
7. జయశంకర్	41	20	7	152	4	13	237
8. జోగులాంబ గద్వాల	35	28	8	80	4	17	172
9. కామారెడ్డి	121	15	5	318	11	36	506
10. కరీంనగర్	86	18	7	114	5	15	245
11. ఖమ్మం	176	18	10	334	8	29	575
12. కొమురంభీం ఆసిఫాబాద్	62	25	2	234	3	15	341
13. మహబూబాబాద్	71	19	2	264	5	20	381
14. మహబూబ్‌నగర్	38	24	8	146	7	20	243
15. మంచిర్యాల	70	16	3	176	5	18	288
16. మెదక్	92	30	1	156	9	22	310
17. మేడ్చల్ మల్కాజిగిరి	26	8	1	51	3	20	109
18. ములుగు	33	16	1	125	3	14	192
19. నాగర్ కర్నూల్	70	18	2	141	13	41	285
20. నల్లగొండ	128	28	6	383	13	47	605
21. నారాయణపేట	73	23	1	161	5	16	279
22. నిర్మల్	70	4	4	236	5	23	342
23. నిజామాబాద్	124	23	9	403	11	31	601
24. పెద్దపల్లి	49	5	1	21	5	12	93
25. రాజన్న సిరిసిల్ల	56	12	4	67	3	9	8151
26. రంగారెడ్డి	61	30	6	226	10	46	379
27. సంగారెడ్డి	92	24	6	385	9	35	551
28. సిద్దిపేట	77	24	6	167	8	27	311
29. సూర్యాపేట	86	23	5	224	11	37	386
30. వికారాబాద్	102	23	5	195	6	28	359
31. వనపర్తి	57	9	6	56	5	19	152
32. వరంగల్	66	21	6	182	5	21	301
33. యాదాద్రి భువనగిరి	84	21	2	137	10	23	277
మొత్తం	2,629	727	182	6,508	220	796	11,062

మేడిగడ్డపై విచారణకు కమిటీ

- చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వం
- త్వరలో సభ్యుల నియామకం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీ పగుళ్లు, పిల్లర్ల కుంగుబాటుపై ఎన్‌డిఎస్‌ఏ కమిటీ ఏర్పాటైంది. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు సీడబ్ల్యూసీ, జీఆర్ఎంబీ మాజీ చైర్మెన్‌గా పనిచేసిన చంద్రశేఖర్ అయ్యర్ చైర్మెన్‌గా జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డిఎస్‌ఏ) కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు శుక్రవారం ఉత్తర్వులు వెలువడే అవకాశముంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఈమేరకు ఆమోదం తెలిపారు. మరో నలుగురు సభ్యులను ఒకటి, రెండు రోజుల్లో నియమించనున్నారు.

సంపాదకీయం

పాలస్తీనా విముక్తికి చైనా మద్దతు!

ఏం చేసినా మనసా-వాచా -కర్మణా ఉండాలని పెద్దలు ఎప్పుడో చెప్పారు. భారతీయ విలువలు, వలువల గురించి నిత్యం వల్లిస్తూ ఎదుటివారికి బోధలు చేసే వారంతా అలా ఉన్నారా అని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. పాలస్తీనా దేశం ఏర్పాటు, అరబ్బుల సర్వసత్తాక హక్కు గురించి మాట్లాడుతున్నవారు ఆచరణలో ఏం చేస్తున్నారన్నదే ముఖ్యం. మొక్కుబడిగా మద్దతు తెలుపుతూనే అక్కడ మారణకాండకు పాల్పడుతున్న ఇజ్రాయిల్ గొప్పతనం, దానితో స్నేహం గురించి కబుర్లు చెప్పే విశ్వగురువు అమెరికా సంతుష్టీకరణ, ముస్లిం వ్యతిరేక వైఖరి గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. గాజాలో యూదు మూకలు జరుపుతున్న మారణకాండ గురించి హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే) విచారణ జరుపుతున్నది. అదే కోర్టులో తూర్పు జెరూసలెంతో సహా ఆక్రమిత పాలస్తీనా ప్రాంతాలలో ఇజ్రాయిల్ విధానాలు, ఆచరణతో తలెత్తిన చట్టపరమైన పర్యవసానాల గురించి కూడా మరో కేసు విచారణ జరుగుతున్నది.దానిలో పాలస్తీనా యోధులకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ కమ్యూనిస్టు చైనా అంటే ఏమిటో ప్రపంచానికి, విముక్తి పోరాటాలలో నిమగ్నమైన వారికి ఇస్తున్న మద్దతు, వైఖరి గురించి చేసిన వాదన ఎంతో ముఖ్యమైనది.

> " తమ విముక్తి, స్వయం పాలనా హక్కు కోసం వలసవాదం, ఆక్రమణ,దాడులు,పెత్తందారీ తనాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటంతో సహా విదేశీ శక్తుల మీద పౌరులు జరిపే పోరాటాలను ఉగ్రవాద చర్యలుగా పరిగణించకూడదని, దీర్ఘకాలంగా దురాక్రమణకు గురైనవారు జరుపుతున్న పోరాటాలకు చట్టబద్ధమైన పునాది కూడా ఉందని " తన వైఖరిని ఈ సందర్భంగా చైనా వెల్లడించింది.అయితే సాయుధ పోరాటాన్ని సమర్థించటం అంటే ఆ సందర్భాల్లో ఉగ్రవాద చర్యలకు పాల్పడిన వారిని సమర్థించటం కాదన్నది గమనించాలి. అది హమాస్‌కూ వర్తిస్తుంది.

సామ్రాజ్యవాదుల దురాక్రమణకు, వలస పాలనలో మగ్గిన చైనా, ఇతర దేశాల వారికి అదే పరిస్థితిలో ఉన్న వారి గురించి తెలిసినంతగా మరొకరికి అర్థం కాదు. స్వాతంత్ర్య,విముక్తి పోరాటాలకు దూరంగా, మన దేశంలో సామ్రాజ్యవాదుల బూట్లు నాకిన వారు, ప్రేమ లేఖలు రాసి, చరిత్ర చెత్తబుట్టలో ఉన్న జయచంద్రుడు, మీర్ జాఫర్‌ల సరసన చేరిన కాషాయ దళ వారసుల గురించి పక్కన పెడదాం. అంతర్జాతీయ న్యాయస్థానంలో పాలస్తీనియన్లకు చైనా మద్దతు ప్రకటనతో సహజంగానే ఇజ్రాయిల్ మండిపడింది. అక్టోబరు ఏడున తమ దేశంపై హమాస్ చేసిన దాడికి చైనా మద్దతు ఉన్నట్లుగా తాము పరిగణిస్తామని చెప్పుకుంది.యుద్ధ నీతి ప్రకారం పౌరుల



మీద పనిగట్టుకొని దాడులు చేయరాదని, హమాస్ తమ పౌరుల మీద అలాంటి దాడికే పాల్పడిందని ఆరోపించింది. ఆ చర్యను తప్పుపడుతున్న ఇజ్రాయిల్ గడచిన ఏడున్నర దశాబ్దాలుగా ఆక్రమిత పాలస్తీనాలో జరుపుతున్న దుర్మార్గాలను, తాజాగా హమాస్ అణచివేత పేరుతో మారణకాండ, విధ్వంసాన్ని ఏ విధంగా సమర్థించు కుంటుంది? విముక్తికోసం పోరాడుతున్న వారిని ఉగ్రవాదులుగా చిత్రించటం ఈ రోజు కొత్తగా జరుగుతున్నదికాదు, పాల స్తీనా యోధుడు యాసర్ అరాఫత్‌నే ఉగ్రవాదిగా పరిగణించిన వారు హమాస్‌కు ఆ ముద్రవేయటంలో ఆశ్చర్యం ఏముంది.

పాలస్తీనా ప్రాంతాల ఆక్రమణ క్రమంలో 57 సంవత్సరాల క్రితం 1967జూన్‌లో ఇజ్రాయిల్ జరిపిన ఆరు రోజుల యుద్ధం గురించి చైనా తరపు న్యాయవాది మాట్లాడుతూ 1973లో ఐరాస సాధారణ అసెంబ్లీ ఆమోదించిన 3,070 తీర్మానం ప్రకారం వలసవాదులు, విదేశీ పెత్తనం, విదేశీ అణచివేతకు గురైన ప్రాంతాల వారు విముక్తి కోసం సాయుధ పోరాటంతో సహా అందుబాటులో ఉన్న అన్ని సాధనాలను వినియోగించే హక్కును కలిగి ఉన్నారన్న అంశాన్ని కోర్టు ముందు ఉంచారు. ఆ మేరకు తమ విముక్తి కోసం పాలస్తీనా పౌరులకు సాయుధ పోరాటం జరిపే హక్కు ఉన్నదని చైనా స్పష్టం చేసింది. ఇప్పటికే న్యాయం చాలా ఆలస్యమైందని,దాన్ని కాదన కూడదని పేర్కొన్నది. అదీ కమ్యూనిస్టు చైనా ప్రత్యేకత.

అంతే కాదు " తమ విముక్తి, స్వయం పాలనా హక్కు కోసం వలసవాదం, ఆక్రమణ,దాడులు,పెత్తందారీ తనాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటంతో సహా విదేశీ శక్తుల మీద పౌరులు జరిపే పోరాటాలను ఉగ్రవాద చర్యలుగా పరిగణించకూడదని, దీర్ఘకాలంగా దురా క్రమణకు గురైనవారు జరుపుతున్న పోరాటాలకు చట్టబద్ధమైన పునాది కూడా ఉందని" తన వైఖరిని ఈ సందర్భంగా చైనా వెల్లడించింది.అయితే సాయుధ పోరాటాన్ని సమర్థించటం అంటే ఆ సందర్భాల్లో ఉగ్రవాద చర్యలకు పాల్పడిన వారిని సమర్థించటం కాదన్నది గమనించాలి.అది హమాస్‌కూ వర్తిస్తుంది. జరిగిన పొరపాట్లను తప్పుపట్టటం వేరు, ఆ పేరుతో మొత్తంగా ఉగ్రవాదులుగా చిత్రించటం తగని పని. ఆక్రమిత ప్రాంతాల నుంచి ఇజ్రాయిల్‌ను వెళ్లగొట్టి తమ స్వతంత్ర దేశ ఏర్పాటుకు పాలస్తీనీయన్లు చేస్తున్న పోరాటాన్ని ఎలాంటి శషభిషలు లేకుండా సంపూర్ణంగా చైనా సమర్థించటం విముక్తి పోరాటాలకు వేగుచుక్క వంటిది. ఈ పరిణామం విముక్తి పోరాటాల్లో ఉన్న వారందరికీ ఎంతో ఉత్తేజం, ధైర్యాన్ని ఇస్తుందని వేరే చెప్పనవసరం లేదు.

బౌద్ధారామాల్నే కాదు బౌద్ధ సాహిత్యాన్ని కూడా మార్చారు

> ఎలాగైతే ఒక వస్తువుకు ఉన్న ఆకృతి,ఉపయోగాలను బట్టి, వేరు వేరు పేర్లతో పిలవబడుతుందో.. అలాగే, బుద్ధుడి అనుయాయులు ఆయనను అనేక పేర్లతో పిలుచుకున్నారు. లంకావతార్ సూత్రంలో కొందరు ఆయనను 'తథాగతుడు' అని పిలిస్తే, మరి కొందరు 'స్వయంభూ నాయక్' అని, 'వినాయక్' అనీ, 'పరిణాయక్' అనీ, బుద్ధుడు, రుషీ, వృషమ్, బ్రాహ్మణ, విష్ణు, ఈశ్వర్, ప్రధాన కపిల్, భూతాంత్, రామ్, వ్యాస్, శుక్ర్, ఇంద్ర్, బలి, వరుణ, వంటి అనేక పేర్లతో పిలుచుకునేవారు. అనిరోధానుప్పాదం, శూన్యత, సత్యం, ధర్మధాతు, నిర్వాణ్-అని కూడా అన్నారు.



డాక్టర్ దేవరాజు మహారాజు

బౌద్ధం బాగా బలంగా ఉన్న దేశాలలో రాముణ్ణి, రావణుణ్ణీ ఇప్పటికీ బౌద్ధులుగానే పరిగణిస్తారు. వేల సంవత్సరాలుగా అక్కడ ప్రచారంలో ఉన్న సాహిత్య ప్రభావం అక్కడి ప్రజల మీద ఉంది. ఎలాగైతే ఇక్కడ మన భారతదేశంలో బ్రాహ్మణ వాదులు వారి దృష్టికోణంలోంచి వేదాలు, పురాణాలు రాసి ప్రచారం చేశారో అలాగే-వీరు ధ్వంసం చేయక ముందున్న బౌద్ధ జీవన మూలాలు, జాతక కథలు యధాతధంగా ఆయా దేశాలలో కొనసాగుతున్నాయి. ఇతర దేశాలలో మనువాదుల ప్రభావం లేదు కాబట్టి, మార్పులకు లోనుకాని మూల రచనలే అక్కడ కొనసాగుతున్నాయి-


బౌద్ధుల 'వైపుల్య సూత్రా'లలో లంకావతార అనే ఒక పేరు తటస్థపడుతుంది. అందులో బుద్ధుడు బౌద్ధరాజు రావణుడికి ఉపదేశం ఇస్తాడు. అలాగే దశరథ జాతక కథ అనేది మరొకటి ఉంది. ఈ రెండు కథలను జోడించి, సీతాపహరణం రావణుడితో చేయించి బ్రాహ్మణవాదులు ఒక కొత్త కథకు రూపకల్పన చేశారని పరిశీలకులు చెపుతున్నారు. ఐదవ శతాబ్దంలో బుద్ధ ఘోషుడు ఈ సీతాపహరణాన్ని తన రచనలో వ్యతిరేకించాడని కూడా చెపుతారు. విష్ణువు, ఈశ్వరుడు, వ్యాసుడు, ఇంద్రుడు, బలి, వరుణుడు వంటి పేర్లన్నీ ఇప్పటికీ బ్రాహ్మణ సమాజంలో చలామణిలో ఉన్నాయి. అయితే ఈ పదాలు ఎక్కడివి? అని ప్రశ్నించుకుంటే-ఇవన్నీ పాలి, ప్రాకృత భాషల సమ్మేళనంతో మహాయానంలో ఏర్పడ్డవి. సంస్కృతం ఒక భాషగా అప్పటికి పూర్తిగా రూపుదిద్దుకోని సమయంలో బ్రాహ్మణవాదులు పాలి, ప్రాకృత భాషా పదాల మిశ్రమాన్ని తమ సంస్కృత భాషలోకి స్వీకరించి వ్యవహారంలోకి తెచ్చారు. బౌద్ధ సాహిత్యంలోంచి కాపీకొట్టి తెచ్చుకున్నవీ పదాలు-అని గుర్తుపట్టకుండా సంస్కృతాన్ని కేవలం తమ జాతివారి మధ్యలోనే ఉండే విధంగా కట్టుదిట్టం చేసుకున్నారు. సంస్కృతం అందరూ చదవడానికి వీలు కల్పించలేదు. పైగా, రహస్యంగా చదువుకున్న వారికి కఠినమైన శిక్షలు అమలు పరిచారు. కథాంశంలోనూ, భాషలోనూ జరిగిన కల్తీని ఇతరులు పసికట్టకూడదన్న ఉద్దేశంతో వారు, వారి సంస్కృత భాషని సామాన్యులకు అందనీయలేదు. అందువల్ల, సంస్కృతం-బౌద్ధ హైబ్రిడ్ సంస్కృత(BHS)గా నిలిచిపోయింది. వారి సంస్కృత భాషా, వారి సంస్కృత గ్రంథాలు బహుజనులెవరూ చదవకుండా జాగ్రత్త వహించడానికి ఉన్న అనేక కారణాలలో ఇది ఒకటి పైగా ప్రధానమైంది.

దేశం ముస్లింల పాలనలో ఉన్నప్పుడు బ్రాహ్మణార్యులు బౌద్ధ సాహిత్యాన్ని మార్చి తమ బౌద్ధ హైబ్రిడ్ సంస్కృత (BHS) భాషలో అమోఘంగా తిరగరాసుకున్నారు. పాలి, ప్రాకృతాలు ముడి భాషలైతే అందులోంచి సంస్కరించబడిందే సంస్కృతం-అని భారతీయ పరిశోధకులు తేల్చి చెప్పారు. తమ పొట్ట కూటి కోసం బోధిసత్వుడి పేర్లు మార్చి, మార్చి హిందూ దేవీ దేవతలకు ఆపాదించుకుని, తమకు లెక్కలేనంతమంది హిందూ దేవతలున్నారని ఒక భ్రమ కల్పించారు. అలాగే శ్రమన సమాజాన్ని వేరు వేరు పేర్లతో పిలిచి, సమాజాన్ని విభజించి, తమ ఆధిపత్యం చెక్కు చెదరకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. బౌద్ధుల ప్రభావం, ఆలోచనా ధోరణి సమాజంలో బలంగా ఉన్నందు వల్లనే కక్షగట్టి, బౌద్ధ విశ్వవిద్యాలయాలను బ్రాహ్మణార్యులు తగలబెట్టారు. ఒక్కోసారి విదేశీ ముస్లిం చొరబాటుదారుల సహాయం తీసుకున్నారు. చొరబాటుదారులకు కావల్సింది బంగారం, వెండి, ధనరాసులు మాత్రమే! అవి ఆయా విశ్వవిద్యాలయ భవనాల్లో దండిగా ఉన్నాయని తప్పుడు సమాచార మిచ్చి, వారిని ఉసిగొల్పి, నాశనం చేయించింది. ఇక్కడి బ్రాహ్మణార్యులే-ఇవన్నీ మహా మహా చరిత్రకారులు ఆధారాలతో రుజువు పరిచిన విషయాలు. ఆ రోజుల్లో దేశంలో చిన్న చిన్న రాజ్యాలు ఎన్నో ఉండేవి. ఎన్నెన్నో రాజవంశాలూ ఉండేవి. బ్రాహ్మణార్యుల ప్రభావానికి లోనైన రాజవంశాలు వీరిని సలహాదారులుగా, గురువులుగా గౌరవించేవారు. అలా చేయని రాజవంశాల వారిని వీరు 'శూద్రుల'ని వెలివేసేవారు.

25. మాయాదేవి సుత్తంలో

మహాయాన్ 'వైపుల్య సుత్తం'లో భగవాన్ బుద్ధుడికి అనేకానేక పేర్లున్నాయి "లలిత్ విస్తార్" అనే గ్రంథంలో బుద్ధుడికి ఒక పెద్ద పేర్ల పట్టికే ఉంది. అలాగే "మహావస్తు"-అనే గ్రంథంలో పేర్ల జాబితా మరింత పెరిగి వంద దాటింది. ఎలాగైతే ఒక వస్తువుకు ఉన్న ఆకృతి, ఉపయోగాలను బట్టి, వేరు వేరు పేర్లతో పిలవబడుతుందో.. అలాగే, బుద్ధుడి అనుయాయులు ఆయనను అనేక పేర్లతో పిలుచుకున్నారు. లంకావతార్ సూత్రంలో కొందరు ఆయనను 'తథాగతుడు' అని పిలిస్తే, మరి కొందరు 'స్వయంభూ నాయక్' అని, 'వినాయక్' అనీ, 'పరిణాయక్' అనీ, బుద్ధుడు, రుషీ, వృషమ్, బ్రాహ్మణ, విష్ణు, ఈశ్వర్, ప్రధాన కపిల్, భూతాంత్, రామ్, వ్యాస్, శుక్ర్, ఇంద్ర్, బలి, వరుణ, వంటి అనేక పేర్లతో పిలుచుకునేవారు. అనిరోధానుప్పాదం, శూన్యత, సత్యం, ధర్మధాతు, నిర్వాణ్-అని కూడా అన్నారు.

బుద్ధుణ్ణి దశావతారాలలో తొమ్మిదో అవతారంగా చేర్చుకుని, ఆయన గురించి వాస్తవాలు దాచేసి, బ్రాహ్మణార్యులు అబద్ధాలు ప్రచారం చేశారు. అవి ఇలా ఉన్నాయి. బుద్ధుడు ఒక రోగిని చూశాడు. ఒక వృద్ధుణ్ణి చూశాడు. తర్వాత చనిపోయిన వ్యక్తిని (శవాన్ని) చూశాడు. ఆయన మనసు వికలమై ఇల్లు వదిలేసి అడవిలో ఓ చెట్టు కింద కూర్చుని ధ్యానం చేశాడు. జ్ఞానోదయమైంది. ఆయన ధ్యాన ముద్రలో ఉండగా నాగ



బుద్ధుని జీవితం ఎంత బుద్ధిపరమైందో అంత హృదయపరమైంది కూడా. కరుణను బోధించేదే-సద్ధమ్మం! ప్రజ్ఞ శీలం బౌద్ధానికి ఆధారాలు. శత్రువు మనల్ని దెబ్బతీయాలని ఎప్పుడూ ఎదురు చూస్తుంటాడు. అలాంటప్పుడు మనం ఎదురు దాడికి దిగకుండా- శత్రువు మనల్ని పీడించకుండా, బలం పెంచుకోవాలన్నది బుద్ధుడి ఆలోచన!

ముచిళిందుడనే నాగుపాము వచ్చి, పడగవిప్పి ఆయనకు నీడ నిచ్చింది-వంటి కల్పనలు ప్రచారం చేసి జనాన్ని నమ్మించారు. నాగుపాము అనేది కల్పన. అక్కడ వాస్తవమేమంటే నాగజాతి ఆదివాసులు బుద్ధుని బోధనలకు ఆకర్షితులయ్యారు. ఆయన వెన్నంటే రక్షణగా ఉండేవారు. ఒకప్పుడు ఆ జాతి వారు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతమే ఇప్పటి నాగపూర్ (బౌద్ధానికీ నాగపూర్‌కు సంబంధం ఉంది కాబట్టే, డా.బి.ఆర్. అంబేద్కర్ ఆరు లక్షల మందితో 1956 అక్టోబర్ 14న అక్కడ ధమ్మ దీక్ష తీసుకున్నారు.)

బుద్ధావతారానికి ముందున్న ఎనిమిది అవతారాలలో అభూత కల్పనలున్నట్టే, బుద్ధుడి నిజజీవితాన్ని కూడా కల్పనలతో నింపేశారు. తేడా ఏమిటంటే మిగతా అవతారాలన్నీ కల్పితాల ఆధారంగా, భ్రమల ఆధారంగా సృష్టించుకున్నవి. బుద్ధుడు-ఒక చారిత్రక పురుషుడు. ఈ నేల మీద వాస్తవంగా తిరిగిన ఒక మహానుభావుడు. అయితే ఆయన వాస్తవ జీవితాన్ని కూడా మిగతా అవతారాలవలే కల్పనలతో ప్రచారం చేశారు. ఇది చాలా సున్నితమైన అంశం. అర్థం చేసుకోవడానికి అవగాహన కొంచెం పెంచుకోవాల్సి ఉంటుంది.

వైదిక ధర్మాన్ని విశ్వసించే మునులు, రుషులు చేసే తపస్సుకు, బుద్ధుడు చేసిన ధ్యానానికీ చాలా తేడా ఉంది. వైదికులు చేసే తపస్సు దైవాన్ని తలపోస్తూ చేసేది. దైవాన్ని విశ్వసించని బుద్ధుడు చేసింది తనలోని తాను చేసిన ప్రయాణం! సమాజ హితం కోరి చేసిన తీవ్రమైన ఆలోచన. మనిషి జీవితంలో నైతికత ప్రాధాన్యత గురించిన అంతర్మథనం-ఈ లోకంలోని దు:ఖాన్ని పోగొట్టడమెలాగా? అని తీవ్రంగా మదన పడడం-జాగ్రత్తగా అవలోకిస్తే గానీ, రెండు ధర్మాల మధ్య తేడా ఏమిటో బోధపడదు.

మనిషికి మనిషికి ఉండే సంబంధం హిందూధర్మంలో కృత్రిమమైంది. ధనవంతుడిగా ఉన్నప్పటి సంబంధాలు, పేదవాడైనప్పటి సంబంధాలకు తేడా ఉంది.ఆరోగ్యంగా ఉన్నప్పుడు అనారోగ్యంగా ఉన్నప్పుడు సంబంధాలు వేరు వేరుగా ఉంటున్నాయి. బౌద్ధం దాన్ని ఒప్పుకోదు. ప్రజ్ఞ-శీలం-కరుణను పెంచాలే గాని అహంకారాన్ని కాదు. సమస్త మానవుల్నే కాదు, సమస్త జీవరాసుల్ని ప్రేమించాలన్నాడు-బుద్ధుడు. శీలానికి సంబంధించి బుద్ధుడి మూల సూత్రాలు అయిదు ఉన్నాయి. 1.ప్రాణహానికి సంబంధించింది 2.అపహరణకు సంబంధించింది 3.లైంగికనీతికి సంబంధించింది 4.అసత్యానికి సంబంధించింది 5.తాగుడుకు సంబంధించింది. బుద్ధుని జీవితం ఎంత బుద్ధిపరమైందో అంత హృదయపరమైంది కూడా. కరుణను బోధించేదే-సద్ధమ్మం! ప్రజ్ఞ శీలం బౌద్ధానికి ఆధారాలు. శత్రువు మనల్ని దెబ్బతీయాలని ఎప్పుడూ ఎదురు చూస్తుంటాడు. అలాంటప్పుడు మనం ఎదురుదాడికి దిగకుండా-శత్రువు మనల్ని పీడించకుండా, బలం పెంచుకోవాలన్నది బుద్ధుడి ఆలోచన!

హిందూ ధర్మం అసమానతలపై ఆధారపడి ఉంటే, బౌద్ధ ధమ్మం సమానత్వంపై ఆధారపడి ఉంది. ప్రపంచాన్ని మానవీయ సమాజంగా తీర్చిదిద్దగలిగేది బౌద్ధమే. నిశితంగా గమనిస్తే భారత రాజ్యాంగంలో బౌద్ధం ఉంది. కార్యకారణ సంబంధాన్ని బుద్ధుడు గుర్తించాడంటే, ప్రపంచ వైజ్ఞానిక పరిశోధనల్లో బౌద్ధం ఉంది. అశోకచక్రం, సారనాథ్ స్థూపం ఈ దేశపు చిహ్నాలయ్యాయి. రాష్ట్రపతి భవన్, దర్బార్‌హాలులో నిలువెత్తు బుద్ధ విగ్రహముంది. ఆ విగ్రహం పాదాలు-కొద్ది దూరంలో కిందనున్న ఇండియా గేట్ పైభాగానికి సమానంగా ఉంటాయి. ఇవన్నీ గుర్తుచేయడ మెందుకంటే, (బుద్ధుడు)-బౌద్ధం జన జీవనంలో ఎంతబలంగా అంతర్లీనమై పోయిందో ఆలోచిస్తారని! ఇతర ధర్మాలూ, మతాలు ప్రారంభించినవారు, తాము దేవతలమనో, దేవదూతలమనో చెప్పుకున్నారు. కేవలం బుద్ధుడే 'అలా చెప్పుకోలేదు. కనీసం తన వారసుణ్ణి కూడా ప్రకటించలేదు. ధమ్మమే వారసుణ్ణి ఎన్నుకుంటుందని అన్నాడు. తను చెప్పిన విషయాలు కూడా నిశితంగా పరిశీలించి, ఆలోచించి, అర్థం చేసుకోవాలన్నాడు. ఏదీ గుడ్డిగా నమ్మగూడదన్నాడు తను చెప్పిందైనా-

బుద్ధుణ్ణి 'భగవాన్' అని ఎందుకు పిలుచుకుంటారూ? అనే అనుమానం చాలామందికి వస్తుంది. భగవాన్ అంటే ఇక్కడ బ్రాహ్మణార్యుల భగవాన్ కాదు. బౌద్ధ ధమ్మ ప్రకారం భగవాన్ అంటే పరిపూర్ణతను సాధించిన వాడు (The Perfect Man) అని అర్థం. ఆ పదాన్ని కూడా కాపీ కొట్టి వైదిక ప్రచారకులు వాడుకున్నారు. ఉనికిలో లేని ఒక శూన్యాన్ని దేవుడిగా భావించి, పిలుచుకున్నారు. సర్వంతర్యామి, జగద్రక్షకుడు లాంటి అర్థాలు చెప్పి, కొన్ని శతాబ్దాలుగా జనాన్ని నమ్మిస్తూ వస్తున్నారు. కనపడని 'దేవుణ్ణి' బ్రాహ్మణార్యులు భగవాన్ అంటే-ఒకప్పుడు ఈ నేల మీద జీవించిన ఒక మహామానవుణ్ణి బౌద్ధులు భగవాన్-పరిపూర్ణతను సాధించినవాడా! అని గౌరవించుకుంటున్నారు. ఆ తేడాను మనం గమనించాలి!

- కేంద్ర సాహిత్య అకాడమీ విజేత, జీవశాస్త్రవేత్త.

> బుద్ధావతారానికి ముందున్న ఎనిమిది అవతారాలలో అభూత కల్పనలున్నట్టే, బుద్ధుడి నిజ జీవితాన్ని కూడా కల్పనలతో నింపేశారు. తేడా ఏమిటంటే మిగతా అవతారాలన్నీ కల్పితాల ఆధారంగా, భ్రమల ఆధారంగా సృష్టించుకున్నవి. బుద్ధుడు- ఒక చారిత్రక పురుషుడు. ఈ నేల మీద వాస్తవంగా తిరిగిన ఒక మహానుభావుడు. అయితే ఆయన వాస్తవ జీవితాన్ని కూడా మిగతా ఆవతారాలవలే కల్పనలతో ప్రచారం చేశారు. ఇది చాలా సున్నితమైన అంశం. అర్థం చేసుకోవడానికి అవగాహన కొంచెం పెంచుకోవాల్సి ఉంటుంది.



ఎర్రజెండాలై లేవండి

మట్టిని బువ్వగా
మలిచిన అన్నదాతపై
మోడీ రాజ్యం ముప్పేట దాడి చేస్తోంది
లాఠీ దెబ్బలు, తూటాల వర్షం కురిపిస్తోంది
ఇదేనమూనా రామరాజ్యం

శ్రమకు ఫలితం యేదని
కర్షకులు ఉద్యమిస్తే
వాళ్ల కన్నీళ్ళని చూడలేని
ఈ కబోది రాజ్యం
ముమ్మాటికీ కాషాయ ఉన్మాద రాజ్యమే

కార్పొరేట్ పాద సేవలో తరిస్తూ
ఏ గడ్డి కరిచైనా మళ్లీ గెలవాలనుకుంటుంది
రైతుకు భరోసా, పంటకు మద్దతు ధర
ఇవ్వకుండా మరణ శాసనాన్ని లిఖిస్తోంది

నల్ల చట్టాలను వెలికితీసి
రైతు బతుకుకి ఉరితాళ్లు పేనుతుంది
ఇదే రామరాజ్యమైతే
ఆ రాజ్యం మనకొద్దు
ఆ ప్రభువులు అసలే వొద్దు
రైతు రాజ్యం కావాలి

రైతును ఉగ్రవాదిగా చూసి
దేశద్రోహిగా చూపెడుతున్న పాలనపై
కాసింత కాంద్రించి ఉమ్మేయండి
కసిగా పౌరుషాన్ని చూపండి

న్యాయమడిగితే
కసాయి తనాన్ని చూపెడుతూ
మట్టి బతుకును ఛిద్రం చేస్తున్న
ఆ కసాయి గుండెను
నాగలి కొనతో చీల్చి చెండాదాలి

రైతును బతికించడం కోసం
ఆత్మ గౌరవాన్ని నిలపడం కోసం
ఎర్రజెండాలై లేవండి
ప్రజా కంఠకులను తరమండి

- మామిండ్ల రమేష్ రాజా,
7893230218

కార్మిక ఉద్యమ ధృవతార సరోజ్

మేరు నగధీరుడు, కార్మిక ఉద్యమ ధృవతార, ఒక జంఝామారుతం,ఏఐఐఇఏ (అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం)ను సమున్నత శిఖరాలకు తీసుకువెళ్ళిన మార్గదర్శి సరోజ్ చౌదరి బీమా ఉద్యోగులకే గాక,మొత్తం కార్మిక వర్గానికి స్ఫూర్తి ప్రధాత.ఆయన ఒక ధృవతార, హిమాలయ శిఖర సమానుడు, విజ్ఞానఖని, మేధావి, చరిత్రకారుడు, సామాజికవేత్త, పోరాటాల రూపశిల్పి.రాజకీయాలలో, ఆర్థికశాస్త్రంలో, చరిత్ర, కళలు, సాహిత్యం, భూగర్భశాస్త్రం వంటి శాస్త్రాల అవగాహనలో ఆయన ఘనాపాఠీ.అన్నాపవలవో బ్యాలట్ నృత్యాలపైనా, షేక్సిపియర్ సాహిత్యంపైనా, సత్యజిత్‌రే సినిమాల పైనా, పాశ్చాత్య ఆధునిక సంగీత కచేరిలపైనా, సంగీత పరికరాలపైనా ఇలా ఎలాంటి విషయం పైనైనా ఆయన పరిజ్ఞానం అసాధారణం.

సరోజ్ చౌదరి బంగ్లాదేశ్‌లో 1మార్చి1927లో జన్మించారు.1946లో హిందుస్తాన్ కో-ఆపరేటివ్ ఇన్సూరెన్స్ కంపెనీలో క్లర్క్‌గా చేరారు.నళినిరంజన్ సర్కార్ బీమా కంపెనీ యాజమాన్యానికి వ్యతిరేకంగా బీమా ఉద్యోగులు చేపట్టిన 2 గంటల ధర్నాలో ప్రసంగించడం వలన సరోజ్ వాక్పటిమ మొట్టమొదటిసారిగా ప్రపంచానికి తెలిసింది.అప్పటికే బీమా ఉద్యోగులను సంఘటితం చేసే కృషిలో ఉన్న సునీల్ మైత్రా, ఇతర బీమా నాయకులు సరోజ్‌లో 'లీడర్' ను చూడగలిగారు. అలా మొదలైన ఆయన ప్రస్థానం అప్రతిహతంగా సాగింది. 1959లో ఏఐఐఇఏ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సరోజ్ 1988 వరకు ఆ బాధ్యతలో కొనసాగారు. ఆయన దార్శనికత, కార్మికవర్గ తాత్విక చింతన అజరామరం.దోపిడీలేని ప్రపంచం సాధించబడాలని ఆయన పరితపించారు.


"ఎక్కడ పీడనలేని సమాజం ఆవిష్కరించబడుతుందో
ఎక్కడ స్త్రీ పురుషులు సమానంగా చూడబడతారో
ఎక్కడ చిన్న పిల్లలు బిచ్చమెత్తే దుస్థితిలో ఉండక, పూలవలే వికసిస్తారో
ఎక్కడ స్త్రీలు తమ శరీరాలను అమ్ముకునే దౌర్భాగ్యం ఉండదో
ఎక్కడ గులాబీ రేకులపై పడిన తొలి కిరణాల వెలుగు తళుక్కుమంటుందో
అలాంటి సమాజాన్ని ఏఐఐఇఏ కోరుకుంటోంది" అని ప్రకటించిన సృజనశీలి సరోజ్. కార్మికవర్గ విముక్తికి సోషలిజం స్థాపనే శరణ్యమని స్ఫూర్తివంతంగా ప్రకటించిన ధీశాలి. చనిపోయే నాటికి సీఐటీయూ అఖిల భారత కోశాధికారిగా ఉన్నారాయన.



పి.సతీష్
9441797900

మేరు నగధీరుడైనా,సోదర కార్మికులతో కలసి వినయ పూర్వకంగా ముచ్చటించేతత్వం, అసమానుడైనా సమిష్టి నిర్ణయాలకు కట్టుబడే వైజం, సహచర నాయకులలో క్యాడర్లలో స్ఫూర్తిని నింపేతత్వం సరోజ్ వ్యవహారశైలికి అద్దం పడుతుంది.హిందుస్తానీ సంగీతమైనా, రవీంద్రుని సంగీతమైనా అది ఆయనకు సుపరిచితం. సంగీతాన్ని,నాటకాలను ఆస్వాదించడం మాత్రమే కాదు, వాటిలో తప్పొప్పులు సైతం చెప్పగల దిట్ట సరోజ్. ఏ భాష సాహిత్యమైనా, ఏ సంస్కృతి అయినా ఆయనకు పరిచయం చేయాల్సిన అవసరం లేదు.కలకత్తాలో ఆనాటి ఈస్టన్ జోనల్ లైబ్రరీలో ఉన్న అనేక సాహిత్య గ్రంథాలను,ప్రబంధాలను సరోజ్ అవుపాసన పట్టేసారు. సరోజ్ ఆ లైబ్రరీలో చదవని పుస్తకం లేదట.ఫాసిస్టు వ్యతిరేక సాహిత్యాన్ని దేనిని ఆయన వదలకుండా చదివేవారు.

మాటకుమాట బదులివ్వడంలో సరోజ్‌కు సాటిలేరు.1974 వేతన సవరణ ఒప్పందం ఖరారైన తర్వాత యాజమాన్యం ఆయనతోఎప్పుడూ ఏఐఐఇఏ ఎందుకు విజయాలు సాధిస్తుందని అడిగారట.దీనికి ఆయన తడుముకోకుండా 'మేము మీకంటే కొంచెం తక్కువ అసమర్థులం' అన్నారు.. ఆనాటి ఎల్ఐసి ఛైర్మన్ ఎంఆర్.బీడే ఒకసారి ఏఐఐఇఏతో చర్చల సందర్భంగా నేను మీ వాదనలను అంగీకరించటం లేదు అన్నారు. దానికి బదులిస్తూ సరోజ్ 'మా వాదనలు మిమ్ములను ఒప్పించలేవు, మా శక్తి తప్పక మిమ్ములను ఒప్పిస్తుంది' అన్నారు.అనేక అంశాలపై ఆయన రాసిన శీర్షికలు, చేసిన ప్రసంగాలు నేటికి మనకు ఆదర్శంగా నిలుస్తాయి. ఫిబ్రవరి,1995 ఇన్సూరెన్స్ వర్కర్‌లో సరోజ్ మత్స్యకారుల సమస్యలపై ఒక వ్యాసం రాసారు. మత్స్యకారుల జీవితాలను బహుళజాతి కంపెనీల ట్రాలర్లు ఏ రకంగా చిదిమేస్తున్నాయో సోదాహరణంగా వివరించారు. ఆయన నాడు ప్రస్తావించిన సమస్యలు నేడు ఏపీలోని గంగవరం తదితర పోర్టుల కింద బతుకులీడ్చే మత్స్యకారుల సమస్యలకు అద్దం పట్టడం విశేషం.



ఆయన దీర్ఘదర్శి. ఉద్యోగులను సౌఖ్యం ఏ విధంగా ప్రభావితం చేస్తుందో కొన్ని దశాబ్దాల కిందటే వెల్లడించారు "మధ్య తరగతి ప్రజా నీకంలో తమకు తెలియకుండానే సౌఖ్యం అనేది ఒక అతిథిలా వచ్చి స్వార్థ చింతనకు దారితీస్తుందని" ఆయన అంటారు.నిర్లిప్తత ఎలాంటి ఉద్యమాన్నైనా నాశనం చేస్తుందని,ఉద్యమం ముందుకు సాగితేనే ఉద్యోగులకు మనుగడ ఉంటుందని సరోజ్ అనేవారు.

1998లో హైదరాబాద్‌లో జరిగిన ఏఐఐఇఏ సమావేశాల్లో (సరోజ్ చివరి ప్రసంగం) సోషలిజానికి కాలం చెల్లిందంటూ పుస్తకం రాసిన ఫుకుయమను ఆయన నిశితంగా విమర్శిస్తూ సోషలిజం అజేయమని ప్రకటించారు.మనుషుల మెదళ్లను మొద్దుబరుస్తున్న టీవీ మాధ్యమాన్ని, వినిమయదారీ సంస్కృతిని ఆయన తూర్పారపట్టారు.కేవలం లైంగిక వాంఛలు తీర్చుకోవడం మనిషి లక్ష్యం కారాదని,మెరుగైన సమాజ రూపకల్పనకై ప్రతిఒక్కరూ ఉద్యమించాలన్నారు.విశ్వకవి ఠాగూర్‌ను ఉటంకిస్తూ మనిషిపై విశ్వాసం కోల్పోవడం పాపమన్నారు.ఇది సరోజ్ దార్శనికతకు నిదర్శనం. ప్రభుత్వరంగంలో ఎల్ఐసి, జిఐసి సంస్థలను పరి రక్షించాలని అహర్నిశలూ కృషి చేసిన ఆయన ప్రజలను, పాలసీదారులను భాగస్వాములను చేయాలని పరితపించారు. ఏఐఐఇఏ సమావేశాలు మధురైలో జరిగినప్పుడు ఆయన పాలసీ దారులకు విశిష్ట సేవలందించాలని సమావేశ ప్రతినిధులకు పిలుపునిచ్చారు.గ్రామీణ ప్రాంతానికి చెందిన పాలసీదారులకు సత్వర సేవలందించడంలో ప్రాముఖ్యం ఇవ్వాలని ఆయన ఉద్యోగులను కోరారు. ఎప్పుడు ప్రజలు,పాలసీదారులు ఎల్ఐసిని తమ సొంతఆస్తిగా భావిస్తారో, అప్పుడు వారు తప్పక మన పోరాటాలకు మద్దతిస్తారని ఆయన అన్నారు.

యూనియన్ నాయకత్వం అంటే మొరటుగా వ్యవహరించేవారని నానుడి ప్రచారంలోనున్న కాలంలో ఆయన ఆ భావనకు భిన్నంగా వ్యవహరించారు.సమాజాన్ని, మారుతున్న పరిస్థితులను నిరంతరం అధ్యయనం చేసే సరోజ్ యువ కామ్రేడ్లను నిరంతరం అధ్యయనం చేయమంటూ ప్రోత్సహించేవారు.మానవ పరిణామక్రమాన్ని గతి తార్కికంగా అధ్యయనం చేసిన సరోజ్ సోషలిస్టు సూత్రాల హేతుబద్ధతను,శాస్త్రీయతను వివరించేవారు.సోషలిజం స్థాపన ఆచరణ సాధ్యమే అన్న ఆయన విశ్వాసం తిరుగులేనిది.నేడు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అనేక పరిణామాలు ఆయన విశ్వాసాన్ని ముందుకు తీసుకెళ్లేలా ఉన్నాయి.ఆయన వర్గస్పృహ అజరామరం.వర్గ పోరాటాల విశిష్టతను వివరిస్తూ ఆయన చెప్పిన మాటలు మన చెవులలో నేటికి మారుమోగుతూనే ఉంటాయి.

"వర్గాలుగా చీలిపోయిన సమాజంలో ఏ ఒక్క హక్కు సదుపాయం యాజమాన్యం దయతో ఇచ్చింది కాదు.ఇప్పుడు మనం అనుభవిస్తున్న ప్రతిదానికి నిరంతరం పోరాటం చేశాం.అవి కొనసాగుతాయన్న భ్రమలు మనకుండకూడదు. మనం పోరాడుతున్నంత కాలం మాత్రమే వాటిని రక్షించుకోగలం." ఏఐఐఇఏను వర్గపోరాట సంస్థగా రూపాంతరం చేయడానికి అహర్నిశలూ కృషిచేసిన సరోజ్ 17జూన్1999న మృతి చెందారు. భౌతికంగాఆయన దూరమైనా, ఆయన భావజాలం బీమా ఉద్యోగులను, అశేష కార్మికవర్గాన్ని ముందుకు నడిపిస్తూనే ఉంది. సరోజ్ ఆకాంక్షించిన దోపిడీ రహిత సమాజ స్థాపనకై నడుం బిగించడమే బీమా ఉద్యోగులు ఆయనకిచ్చే నిజమైన నివాళి.

(నేడు సరోజ్ 97వ జయంతి)

> ఏఐఐఇఏను వర్గపోరాట సంస్థగా రూపాంతరం చేయడానికి అహర్నిశలూ కృషిచేసిన సరోజ్ 17జూన్ 1999న మృతిచెందారు. భౌతికంగా ఆయన దూరమైనా,ఆయన భావజాలం బీమా ఉద్యోగులను, అశేష కార్మికవర్గాన్ని ముందుకు నడిపిస్తూనే ఉంది. సరోజ్ ఆకాంక్షించిన దోపిడీ రహిత సమాజ స్థాపనకై నడుం బిగించడమే బీమా ఉద్యోగులు ఆయనకిచ్చే నిజమైన నివాళి.

బిజినెస్

ఎన్నికల వేళ జీడీపీకి రెక్కలు..!

- క్యూ3లో 8.4 శాతం వృద్ధి
- ఆర్‌బిఐ అంచనాలకు మించిన లెక్కలు



నవతెలంగాణ- బిజినెస్ డెస్క్

మరికొన్ని రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు అనుహ్యాంగా జిడిపి అమాంతం పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) ఏకంగా 8.4 శాతం పెరిగినట్లు కేంద్ర గణంకాల మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీసు (ఎన్ఎస్ఓ) ప్రకటించింది. గురువారం వెల్లడించిన ఈ గణంకాలు ఆర్‌బిఐ అంచనాల కంటే ఎక్కువగా ఉండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఆర్‌బిఐ సహా అనేక అంతర్జాతీయ, జాతీయ ఎజెన్సీలు, విత్త సంస్థలు భారత వృద్ధి రేటు 7 శాతం దిగువన ఉండొచ్చని ఇంతక్రితం అంచనా వేశాయి. డిసెంబర్ త్రైమాసికంలో జిడిపి 6.5 శాతానికి పరిమితం కావొచ్చని ఆర్‌బిఐ ఇటీవల పేర్కొంది. ఈ అంచనాలకు భిన్నంగా ప్రధాని మోడీ ప్రభుత్వ గణంకాలు ఉండటం గమనార్హం.

2011-12 స్థిర ధరలతో పోల్చితే గడిచిన డిసెంబర్ త్రైమాసికంలో జిడిపి విలువ రూ.43.72 లక్షల కోట్లకు పెరిగింది. 2022-23 ఇదే త్రైమాసికంలో రూ.40.35 లక్షల కోట్లుగా ఉందని.. దీంతో పోల్చితే 8.4 శాతం పెరుగుదల నమోదయ్యిందని ఎన్ఎస్ఓ వెల్లడించింది. 2023-24లో 7.6 శాతం వృద్ధి చోటు చేసుకోవచ్చని ఎన్ఎస్ఓ తాజా అంచనాల్లో పేర్కొంది. కాగా.. 2022-23లో తొలుత ప్రకటించిన 7 శాతం వృద్ధిని.. 7.2 శాతానికి పెంచి సవరించింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో భారత జిడిపి 7.8 శాతం, జులై నుంచి సెప్టెంబర్ త్రైమాసికంలో 7.6 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. గడిచిన డిసెంబర్ త్రైమాసికంలో నిర్మాణ రంగం ఏకంగా 10.7 శాతం పెరుగుదలను నమోదు చేసినట్లు ఎన్ఎస్ఓ చూపించింది. తయారీ రంగం 8.5 శాతం పెరిగింది. రేటింగ్ ఎజెన్సీలు, దిగ్గజ విత్త సంస్థల పరిశోధన సంస్థల అంచనాను మించి జిడిపి పెరుగుదల చోటు చేసుకోవడం నిపుణులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. గడిచిన క్యూ3లో భారత వృద్ధి 6.5 శాతంగా ఉండొచ్చని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ అంచనా వేయగా.. 6.7-6.9 శాతంగా నమోదు కావొచ్చని ఎస్‌బిఐ రీసెర్చ్ విశ్లేషించింది. మరోవైపు ఆర్‌బిఐ అంచనాలు 6.5 శాతం మించి ఎన్ఎస్ఓ అనుహ్య గణంకాలను ప్రకటించడం విస్మయాన్ని కలిగిస్తోంది. ప్రజల ఆదాయాల్లో పెద్ద మార్పులు లేకపోయినప్పటికీ.. పెట్టుబడులు, ఆర్థిక వ్యవస్థలో గొప్ప సానుకూలాంశాలు కానరాకపోయినప్పటికీ 8 శాతం ఎగువన జిడిపి పెరగడం విమర్శలకు దారి తీస్తోంది. ఇవి ఎన్నికల ఎత్తుగడ గణంకాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

లగ్జరీ యూరోపియన్ ఫర్నీచర్‌లోకి ఆల్టైరో

- హైదరాబాద్‌లో 12వేల చదరపు అడుగుల్లో స్టోర్ ప్రారంభం :ఆల్టైరో ఎండి చందన కోగంటి వెల్లడి



హైదరాబాద్: లగ్జరీ యూరోపియన్ ఫర్నీచర్ మార్కెట్లోకి ఆల్టైరో ప్రవేశించినట్లు ప్రకటించింది. మూడు అంతస్తుల్లో 12వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మాదాపూర్ కావూరి హిల్స్‌లో ఏర్పాటైన తొలి స్టోర్‌ను కంపెనీ గురువారం ప్రారంభించింది. ప్రధానంగా యూరప్‌లో డిజైన్, తయారీ చేపట్టిన వినూత్న, నాణ్యమైన లగ్జరీ ఫర్నీచర్‌ను సరసమైన ధరల్లో విక్రయిస్తామని ఆల్టైరో ఎండి చందన కోగంటి ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. ధర రూ.5 లక్షలతో ప్రారంభమై రూ.5 కోట్ల వరకు ఉంటుంద న్నారు. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో స్టోర్స్ ఏర్పాటు చేస్తామని అన్నారు. రియల్టీ రంగంలో వృద్ధి మార్కెట్లలో హైదరాబాద్ ఒకటని చందన తెలిపారు. 'నగరంలో అపార అవకాశాలు ఉన్నాయి. మరోవైపు దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో లగ్జరీ హోమ్స్ వచ్చే అయిదేళ్లలో పెద్ద ఎత్తున వస్తున్నాయి. 6,000 నుంచి 15,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇవి ఏర్పాటవుతు న్నాయి. పెద్ద క్లయింట్స్ అంతా నాణ్యమైన, ఖరీదైన ఫర్నీచర్ కోరుకుంటారు. ఒకరి ఇంట్లో ఉన్నవి తమ ఇంట్లో ఉండకూడదన్న ఆలోచన కస్టమర్లలో ఉంది. అందుకే ప్రత్యేక, ఖరీదైన ఫర్నీచర్‌ను కోరుకుంటున్నారు. ఆల్టైరోకు ఈ అంశాలు కలిసి వస్తాయి. ఫర్నీచర్ రంగంలో ప్రత్యేకత చూపిస్తాం' అని తెలిపారు.

గుంటూరు ప్లాంట్‌లో ఇక మసాలల తయారీ

- రూ.30 కోట్ల పెట్టుబడులు
- ఎంటిఆర్ సిఇఒ సంజయ్ బాసిన్ వెల్లడి

నవతెలంగాణ- హైదరాబాద్

గడిచిన మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రూ.100 కోట్ల పెట్టుబడుల వ్యయం చేశామని ప్రముఖ మాసాల ఉత్పత్తుల కంపెనీ ఎంటిఆర్ తెలిపింది. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంటిఆర్ సిఇఒ సునయ్ బాసిన్ మాట్లాడుతూ.. తమ సంస్థ 100 ఏళ్ల వార్షికోత్సవం జరుపుకుంటుందని అన్నారు. గుంటూరులోని తమ ప్లాంట్‌లో ప్రస్తుతం మిర్చీ ఉత్పత్తులను తయారు చేస్తున్నామన్నారు. ఇకపై మసాల ఉత్పత్తుల తయారీని కూడా చేపట్టనున్నామన్నారు. ఇందుకోసం రూ.30 కోట్ల పెట్టుబడి వ్యయం చేయనున్నామన్నారు. తమ పోర్టుపోలియోలో 145 ఉత్పత్తులు ఉన్నాయని.. మరికొన్నిటినీ జోడించనున్నామని తెలిపారు. తమ మాతృసంస్థ ఓర్క్లా 42 దేశాల్లో కార్యకలాపాలు కలిగి ఉందని.. 11 ఫ్యాక్టరీలు, 3వేల పైగా ఉద్యోగులను కలిగి ఉందన్నారు. ఓర్క్లా కింద ఎంటిఆర్, ఈస్టర్న్, ఇంటర్నేషనల్ బిజినెస్ యూనిట్లలో 12 పోర్టుపోలియే కంపెనీలను కలిగి ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 1.5 లక్షల అవుట్‌లెట్లలో తమ ఎంటిఆర్ ఉత్పత్తులు లభ్యమవుతాయన్నారు. ప్రతీ 5వేల జనాభా పైబడిన గ్రామాల్లో విస్తరణపై దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు.

నగరంలో మెడ్‌ట్రానిక్ ఇన్నోవేషన్ సెంటర్ విస్తరణ

- మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభోత్సవం



హైదరాబాద్ : నగరంలో నూతనంగా విస్తరించిన మెడ్‌ట్రానిక్ ఇంజినీరింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు లాంచనంగా ప్రారంభించారు. అమెరికా వెలుపల మెడ్‌ట్రానిక్ అతిపెద్ద ఆర్అండ్‌డి సెంటర్‌గా నిలువనుందని మంత్రి అన్నారు. మెడ్‌టెక్ ఆవిష్కరణలకు హాట్‌స్పాట్‌గా ఎదుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వైద్య పరికరాల తయారీ, ఆర్అండ్‌డి రెండింటికీ ఆదర్శవంతమైన గమ్యస్థానంగా హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలిపేందుకు కృషి చేస్తుందన్నారు.

దాదాపు 2.50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను హెల్త్‌కేర్ టెక్నాలజీ ఆర్అండ్‌డికి ఉపయోగించనున్నామని మెడ్‌ట్రానిక్ ఇంజనీరింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ (ఎంఈఐసి) ఛైర్మన్, సిఇఒ జెఫ్ మార్తా అన్నారు. ఐదేళ్ల విస్తరణ ప్రణాళికల్లో భాగంగా రూ.3,000 కోట్ల పెట్టుబడులు పెడుతున్నామన్నారు. భవిష్యత్తులో 1500 మందికి ఉపాధి లభించ నుందన్నారు. ఈ ప్రారంభోత్సవంలో యుఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ పాల్గొన్నారు.

ఫైనాన్సియల్ డిస్ట్రిక్‌లో ఫోర్సీస్ సెంటర్ ఏర్పాటు

కాలిఫోర్నియా కేంద్రంగా ఐటి కంపెనీ ఫోర్సీస్ ఐఎన్‌సి నగరంలోని ఫైనాన్సియల్ డిస్ట్రిక్‌లో కొత్త ఆఫీసును తెరిచింది. 21వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను గురువారం ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు, హైదరాబాద్‌లోని యుఎస్ కన్సూలెట్ జనరల్ జెన్నీఫర్ లర్సన్‌తో కలిసి ప్రారంభించారు. రూ.16 కోట్ల (2మిలియన్ డాలర్ల)తో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఉద్యోగ కల్పన పెంచడానికి తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడులను అహ్వానిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో ఐల్యాబ్స్ గ్రూప్ ఛైర్మన్ శ్రీనివాస రాజు, స్టార్ హాస్పిటల్స్ ఎండి గోపి చంద్ మన్నమ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టు ఒక్కటే...జీతాలే వేర్వేరు

మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ల వేతనాల్లో వ్యత్యాసం

- నర్సింగ్ ఆఫీసర్లకు తక్కువ చెల్లింపులెందుకు?



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సాధారణంగా ఒకే రకమైన పోస్టులకు ఒకే రకమైన వేతనాలను నిర్ణయిస్తారు. వేతనాల్లో వ్యత్యాసం చూపిస్తుండటంతో నర్సింగ్ ఆఫీసర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు. ఒక్కో జిల్లాలో అవసరాన్ని బట్టి 15 నుంచి 20 మంది చొప్పున రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 300 నుంచి 500 వరకు పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇప్పటికే జిల్లాల వారీగా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ పోస్టులన్నీ కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేవే. ఆంధ్రప్రదేశ్‌లో ఈ పోస్టులకు కేవలం బీ.యస్సీ (నర్సింగ్) అర్హత కలిగిన వారిని తీసుకుంటున్నారు. కర్నాటకలో బీ.యస్సీ (నర్సింగ్) తో పాటు జీఎన్ఎం అర్హత కలిగిన వారితో నింపుతున్నారు. తెలంగాణలో మాత్రం ఎంబీబీఎస్, బీఏఎంఎస్ చదివిన వారికి కూడా అవకాశమిచ్చారు. రాష్ట్రంలో నర్సింగ్ విద్యను అభ్యసించిన వారి సంఖ్య భారీగా ఉన్నది. మరోవైపు గ్రామాల్లో శాస్త్రీయ వైద్యం అందుబాటులో లేక ప్రజలు నకిలీలు, అశాస్త్రీయ వైద్య విధానాల వైపు వెళుతూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎంఎల్‌హెచ్‌పీలను నియామకం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని దేశవ్యాప్తంగా మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లను పరిచయం చేస్తున్నారు. ప్రాథమిక వైద్యాన్ని మరింత బలోపేతం చేసే క్రమంలో పెద్దాస్పత్రులపై భారం పడకుండా వారు కీలక పాత్ర పోషిస్తారని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి పోస్టులను భర్తీ చేసే క్రమంలో నిర్ణయించిన జీతాల్లో తేడా ఉండటం నర్సింగ్ ఆఫీసర్లను అసంతృప్తికి గురి చేస్తున్నది.ఎంబీబీఎస్, బీఏఎంఎస్ అభ్యర్థులకు రూ.40 వేలుగా, స్టాఫ్ నర్సులకు వేతనం రూ.29,900గా నిర్ణయించడమే ఇందుకు కారణం. ఎంఎల్‌హెచ్‌పీగా ఎంపికైన స్టాఫ్ నర్సులకు ఏపీలో రూ.25 వేల జీతంతో పాటు రూ.15 వేలు ఇన్సెంటివ్‌గా మొత్తం రూ.40 వేలిస్తుండగా, తెలంగాణలో రూ.29,900గా నిర్ణయించడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి ఎంబీబీఎస్, బీఏఎం ఎస్ అభ్యర్థులకిచ్చినట్టుగానే సమాన వేతనం ఇవ్వాలని కోరుతున్నారు.

మొదటి ప్రాధాన్యతనివ్వాలి



ఎంహెచ్ హెచ్ పీ పోస్టుల భర్తీలో బీ.యస్సీ (నర్సింగ్), జీఎన్ఎం అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యతని వ్వాలని తెలంగాణ నర్సింగ్ సమితి (టీఎన్ఎస్) రాష్ట్ర అధ్యక్షులు కంపాటి ధనుంజయ్ డిమాండ్ చేశారు. బ్రిడ్జ్ కోర్సుతో సంబంధం లేకుండా అర్హత కల్పిస్తూ నియామకాలు చేపట్టాలని కోరారు. ఒకే రకమైన పోస్టుకు ఒకే విధంగా వేతనాన్ని నిర్ణయించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే భవిష్యత్ కార్యాచరణ చేపట్టాల్సి వస్తుందని ధనంజయ్ హెచ్చరించారు.

టీఎన్ఎస్ అధ్యక్షులు కాంపాటి ధనుంజయ్

కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించలేదు

తెలుగు రాష్ట్రాల మధ్య సమన్వయం ఎలా ?

- పునర్విభజన సరిగ్గా జరగలేదు : జలశక్తి శాఖ సలహాదారు శ్రీరాం వెదిరె

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) లేకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య సమన్వయం ఎలా చేస్తారని కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు శ్రీరాం వెదిరె అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సరిగ్గా జరగకపోవడంతో సమస్యలు వస్తున్నాయని అన్నారు. ఇప్పటివరకు కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించలేదనీ, పరస్పర విమర్శలతో ప్రయోజనం లేదని చెప్పారు. కృష్ణా నదిపై ప్రాజెక్టులు, కేఆర్ఎంబీ విధివిధానాలపై ఆయన హైదరాబాద్‌లోని పీఐబీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ ఘటన తర్వాత కేంద్ర ప్రభుత్వం అడిగిన వివరాలు రాష్ట్ర అధికారులు ఇవ్వలేదని చెప్పారు.

ఇప్పటి సర్కారు సైతం పంప లేదనీ, ఇప్పటికైనా జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్ఏ) బృందానికి సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. రాష్ట్రం సమాచారం ఇస్తేనే ఎన్‌డీఎస్ఏ విచారణ చేయగలగుతుంది, మేడిగడ్డ నిర్మించేటప్పుడు జిలయోలాజికల్ సర్వే వారి సహాయం తీసుకుని ఉండాల్సిందనీ, సర్వే చేయకుండానే ప్రాజెక్టు కట్టడం అతి పెద్ద తప్పని అన్నారు. థర్డ్ పార్టీ నాణ్యత తనిఖీలు చేయడం కూడా చాలా అవసరమనీ, ప్రాజెక్టు నిర్మాణం వివిధ స్థాయిల్లో కంప్లీషన్ రిపోర్టులు ఇవ్వాలని అన్నారు. మొత్తం ప్రాజెక్టుకు ఒకేసారి కంప్లీషన్ రిపోర్టు ఇచ్చారని గుర్తు చేశారు. ఎన్‌డిఎస్ఏ కమిటీ ఏర్పాటుకు కేంద్ర మంత్రి ఆమోదం తెలిపారని వివరించారు. వచ్చే వారం ఎన్‌డిఎస్ఏ కమిటీ రాష్ట్రానికి వస్తుందనీ, అడిగిన సమాచారం కమిటీకి ఇస్తే విచారణ సత్వరం పూర్తవుతుందన్నారు.

తెలంగాణకు సహకరించాలని నేను ఎంతోగాను ప్రయత్నిస్తున్నా, రాష్ట్రం నుంచి స్పష్టమైన సమాచారం రావట్లేదని గుర్తు చేశారు. సరైన సమాచారం ఇవ్వకపోతే కేంద్రం కూడా సాయం చేయలేదని అభిప్రాయపడ్డారు. ఆరు ప్రాజెక్టులను పూర్తిచేసుకోవాలని విభజన చట్టంలో చెప్పారని గుర్తు చేశారు. నీటి కేటాయింపులు మాత్రం చెప్పలేదనీ, నాలుగు ఏపీ, రెండు తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయింపుల్లేవని చెప్పారు. తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల సమస్య పరిష్కారం కోసమే గత ఏడాది అక్టోబరులో కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేశారన్నారు. విభజన చట్టం రూపొందించిందే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమనీ, ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించాలని విభజన చట్టం చెబుతున్నదన్నారు. ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వమే దాన్ని తప్పు అంటున్నదని గుర్తు చేశారు. రాష్ట్రాల మధ్య సమన్వయం కోసమే కేంద్రం ప్రయత్నిస్తున్నదని చెప్పారు. పదేండ్లుగా శ్రీశైలాన్ని ఏపీ, నాగార్జునసాగర్‌ను తెలంగాణ నిర్వహిస్తున్నా యని చెప్పారు. 299 టీఎంసీలకు గతంలోనే తెలంగాణ అంగీకరించిదన్నారు. కేఆర్ఎంబీని విలన్‌గా చూపించే ప్రయత్నం మంచిది కాదన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పరస్పరం విమర్శలతో కాలం గడుపుతున్నాయని వ్యాఖ్యానించారు. కేఆర్ఎంబీకి ఎవరూ ప్రాజెక్టులు ఇచ్చింది లేదనీ, ఏపీ, తెలంగాణ పరస్పరం మాట్లాడుకుని పరిష్కరించుకుంటే గొడవే ఉండదన్నారు. ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలను పార్టీలు చేయకూడదని అభిప్రాయపడ్డారు. కేఆర్ఎంబీ లేకుంటే ఏపీ, తెలంగాణ మధ్య సమన్వయం ఎలా చేస్తారని ప్రశ్నించారు.

ఒప్పో నుంచి ఎఫ్25 ప్రో 5జి

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ ఒప్పో మధ్య స్థాయి 5జి సెగ్మెంట్‌లో ఎఫ్25 ప్రో 5జిని విడుదల చేసింది. దీని ప్రారంభ ధరను రూ.23,999గా నిర్ణయించింది. 6.7 అంగుళాల అమోలెడ్ డిస్ప్లే కలిగిన ఈ ఫోన్ 64 మెగా ఫిక్సల్ ప్రధాన కెమెరాతో ఆవిష్కరించింది. బ్లూ, లావా రెడ్ రంగుల్లో తయారు చేసిన ఈ ఫోన్ మార్చి 5 నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అమ్మకాలను ప్రారంభించనున్నట్లు తెలిపింది.

జీరో కమీషన్‌తో క్యాబ్ సేవలు

- యాత్రి యాప్ ప్రారంభం

హైదరాబాద్ : నగరంలో తొలిసారి జీరో కమీషన్ ఆధారిత ఆటో, క్యాబ్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. సొంత కమ్యూనిటీ ఆధారిత బుకింగ్ యాప్ 'మన యాత్రి'ని గురువారం టి హబ్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రతినిధులు, డ్రైవర్ల యూనియన్ల సభ్యులు, సాంకేతిక నిపుణులు పలువురు పాల్గొన్నారు. ఒఎన్‌డిసి నెట్‌వర్క్‌లో భాగమైన ఈ యాప్‌కు బెంగళూరులోని నమ్మ యాత్ర విజయం సాధించిన స్ఫూర్తితో టీ-హబ్‌లోని బృందం నుంచి ఇన్ పుట్స్, సపోర్ట్ తో అదే సంస్థ ఈ యాప్‌ను రూపొందించింది.

హైదరాబాద్ ప్రజలకు సరసమైన, సౌకర్యవంతమైన రవాణాను అందించడంతో పాటు డ్రైవర్ల సంపాదనను మరింతగా పెంచడానికి సాధికారత కల్పించడానికి ఇది దోహదం చేయనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిహబ్ సిఇఒ మహంకాళి శ్రీనివాసరావు, ప్రభుత్వ రవాణా కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రకాష్, ఐఎస్‌బి డీన్ మదన్ పిల్లుట్ల, ఒఎన్‌డిసి సిఇఒ టి కోషి, జస్ పే సంస్థలో చీఫ్ గ్రోత్ ఆఫీసర్ ఎంఎస్ షాన్ తదితరులు పాల్గొన్నారు. మనయాత్రి ఇప్పటికే హైదరాబాద్‌లో 25వేల మందికి పైగా డ్రైవర్లను చేర్చుకుందని యాత్రి యాప్ వర్గాలు తెలిపాయి.

హెల్మెట్ నిబంధన బేఖాతరు

- వెనుక కూర్చునే వారు పట్టించుకోవడం లేదు
- 40 శాతం మందిది అదే తీరు

న్యూఢిల్లీ : ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ఇద్దరు వ్యక్తులూ విధిగా హెల్మెట్ పెట్టుకోవాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నప్పటికీ వాటిని చాలా మంది ఖాతరు చేయడం లేదు. వాహనాలు నడిపే వారిలో అనేక మంది హెల్మెట్ పెట్టుకుంటున్నప్పటికీ వెనుక కూర్చునే వారు మాత్రం ఈ నిబంధనను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. అలాంటప్పుడు ఒకవేళ వాహనం ప్రమాదానికి గురైతే వెనుక కూర్చునే వారి తలకు బలమైన గాయాలు అవుతున్నాయి. ఒక్కో సందర్భంలో ప్రాణాలు కూడా పోతున్నాయి.

ఢిల్లీలోని ఎయిమ్స్ ట్రూమా సెంటర్ ఇటీవల సేకరించిన సమాచారం ప్రకారం దేశ రాజధానిలో ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న వారిలో వెనుక కూర్చుంటున్న 40 శాతం మంది హెల్మెట్ పెట్టుకోవడం లేదు. అయితే సుమారు 85 శాతం మంది వాహన చోదకులు మాత్రం హెల్మెట్ పెట్టుకుంటున్నారు. మిగిలిన వారు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా ప్రమాదం జరిగి తలకు గాయాలై ప్రాణాలు కోల్పోవడమో లేదా అనారోగ్యానికి గురవడమో జరుగుతోందని ఎయిమ్స్ ట్రూమా సెంటర్ అధిపతి డాక్టర్ కమ్రాన్ ఫరూఖ్ తెలిపారు. గత సంవత్సరం జనవరి 21 నుండి డిసెంబర్ 22 వరకూ సేకరించిన సమాచారం ఆధారంగా వారు ఈ సమాచారాన్ని వెల్లడించారు.

2022లో రోడ్డు ప్రమాదానికి గురైన తర్వాత ఆస్పత్రికి తరలించే లోగానే 82 శాతం మంది ప్రాణాలు కోల్పోయారని డాక్టర్ ఫరూఖ్ చెప్పారు. 2022లో గాయాలపాలైన 53,541 మందిని తమ ఆస్పత్రికి తీసుకొచ్చారని, వీరిలో 25 శాతం మంది రోడ్డు ప్రమాద బాధితులేనని ఆయన వివరించారు. రోడ్డు ప్రమాదాలకు గురైన వారిలో ఎక్కువ మంది 20-40 సంవత్సరాల మధ్య వయస్కులని అంటూ ఈ వయసులో ఉండే వారు ఎంతో క్రియాశీలకంగా ఉంటారని, అలాంటి వారు బాధితులు కావడం వారి కుటుంబాలకే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ఎంతో నష్టమని చెప్పారు. రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణమే చికిత్స అందించడానికి ఓ సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదని డాక్టర్ ఫరూఖ్ అభిప్రాయపడ్డారు.

దేశ వ్యాప్తంగా12 కోట్ల గృహాలకు పైప్ గ్యాస్

పీఎన్‌జీఆర్‌బీ సభ్యుడు అంజనీ కుమార్



హైదరాబాద్ : మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని సౌత్ ఆసియన్ సిరామిక్ టైల్స్ కంపెనీకి పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పిఎన్‌జి కనెక్షన్‌ను పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డ మెంటర్ అంజనీకుమార్ తివారి గురువారం ప్రారంభించారు. వీటితో పాటు ఈ ప్రాంతంలో నేచురల్ గ్యాస్ సరఫరా చేయడానికి వీలుగా పోలేపల్లి పారిశ్రామిక ప్రాంతంలో మదర్ సిఎన్‌జి స్టేషన్‌ను ప్రారంభించారు. దీని ద్వారా గృహ, పారిశ్రామిక, వాణిజ్య అవసరాలతో పాటు, వాహనాలకు కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్‌ను మెఘా గ్యాస్ సరఫరా చేయనున్నట్లు మెఘా గ్యాస్ తెలిపింది. ఈ సందర్భంగా అంజనీకుమార్ తివారి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా.. కీలకమైన పది రాష్ట్రాల్లోని 22 జియోగ్రాఫికల్ ఏరియాల్లో నేచురల్ గ్యాస్ సరఫరా చేస్తూ మేఘా గ్యాస్ అగ్రగామిగా ఉందన్నారు. పిఎన్జిఆర్బి దేశ వ్యాప్తంగా 12కోట్ల మందికి పిఎన్జి కనెక్షన్లు అందించాలని లక్ష్యం పెట్టుకోగా, ఇందులో మేఘా గ్యాస్ 1.3కోట్ల కనెక్షన్లు అందించనుందన్నారు. 17000కు పైగా సిఎన్‌జి స్టేషన్లు ఏర్పాటు చేయనుండగా వీటిలో 2200కు పైగా స్టేషన్లను మెఘా అందుబాటులోకి తీసుకురానుందన్నారు. ఈ కార్యక్రమంలో మేఘా గ్యాస్ డైరెక్టర్, సిఇఒ పలింపాటి వెంకటేష్, ఛీఫ్ జనరల్ మేనేజర్ తిమ్మారెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఒడిశాలో అంగన్‌వాడీల వేతనాల పెంపు

భువనేశ్వర్ : ఒడిశాలోని లక్షా 48 వేల అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాలను పెంచుతున్నట్లు ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రకటించారు. త్వరలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీజేడీ ప్రభుత్వం గురువారం ఈ నిర్ణయం తీసుకుంది. అంగన్‌వాడీ వర్కర్ల నెలవారీ వేతనాన్ని రూ.7,500 నుంచి రూ.10,000కు, మినీ అంగన్‌వాడీ వర్కర్లకు రూ.5,375 నుంచి రూ.7,250కు పెంచారు. అంగన్‌వాడీ సహాయకులకు రూ.3,750 నుంచి రూ.5,000కి పెంచారు. 2023 అక్టోబర్ నుంచి వేతనాల పెంపు అమల్లోకి వస్తుందని, రాష్ట్ర ప్రభుత్వంపై రూ.350 కోట్ల అదనపు భారం పడుతుందని ఒక అధికారి తెలిపారు.

ఉక్రెయిన్‌పై మక్రాన్ వ్యాఖ్యలతో...

గందరగోళంలో నాటో దేశాలు

నెల్లూరు నరసింహారావు

ఉక్రెయిన్ యుద్ధంలో నాటో తన సైన్యాన్ని మోహరించవచ్చని ఈ వారం ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మక్రాన్ చేసిన వ్యాఖ్యలను అనేక నాటో దేశాలు తిరస్కరించాయి. అటువంటి చర్య అమెరికా నేతత్వంలోని నాటో సైనిక కూటమితో ప్రత్యక్ష యుద్ధాన్ని "అనివార్యం" చేస్తుందని మాస్కో ప్రతిస్పందించింది.

ఉక్రెయిన్ లో యుద్ధాన్ని ఎలా కొనసాగించాలనే దానిపై నాటో కూటమిలో సమన్వయం లేకపోవడాన్ని మక్రాన్ ప్రసంగం ఎత్తిచూపింది. రష్యా - ఉక్రెయిన్ యుద్ధం మూడవ సంవత్సరంలోకి ప్రవేశించినందున ఏమి చేయాలో చర్చించడానికి ఉక్రెయిన్ మద్దతుదారులు మక్రాన్ ఆహ్వానం మేరకు సోమవారం పారిస్‌లో సమావేశమయ్యారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ వీడియో లింక్ ద్వారా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉక్రెయిన్ లోని డోనెట్స్ పీపుల్స్ రిపబ్లిక్‌లోగల అవదీవ్కాపై ఉక్రేనియన్ దళాలు తమ పట్టును కోల్పోవటం తోపాటు యుద్ధభూమిలో వరుస పరాజయాలను చవి చూసిన వారం తర్వాత పారిస్ నగరంలో నాటో దేశాల నాయకులు సమావేశమయ్యారు. యుద్ధంలో ప్రాణాలను కోల్పోయిన సైనికుల స్థానంలో సైన్యంలో నూతన దళాలను తిరిగి చేర్చుకోవడానికి ఉక్రెయిన్ ప్రభుత్వం కష్టపడుతోంది. సైన్యంలో చేరకుండా తప్పించుకుంటే కఠినమైన శిక్షలను ప్రవేశపెట్టే వివాదాస్పద సమీకరణ సంస్కరణ చట్టాన్ని ఉక్రెయిన్ పార్లమెంటు ఆమోదించలేదు. ఇంతలో అమెరికన్ కాంగ్రెస్‌లోని ప్రతినిధుల సభలో ఉక్రెయిన్ కు అదనపు సహాయాన్ని అందించటం కోసం ఉద్దేశించిన బిల్లు తిరస్కరణకు గురైంది. ఎలీసీ ప్యాలెస్లో జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్నవారు "తమ ఐక్యతను పునరుద్ఘాటిం చడానికి", రష్యాను ఓడించాలనే వారి సంకల్పాన్ని వ్యక్తం చేయడానికి ఒక మార్గంగా పేర్కొన్నారు. ఉక్రెయిన్ సంఘర్షణ పట్ల పాశ్చాత్య విధానాన్ని విమర్శిస్తూ కొంతమంది అతిథులు ముందుగా ఆందోళనలను వ్యక్తం చేశారు. స్లోవాక్ ప్రధాన మంత్రి రాబర్ట్ ఫికో ఈ ఎజెండాతో "నాకు వణుకు వస్తోంది" అని అన్నాడు.

రష్యా విజయాన్ని నిరోధించడం యూరోపియన్ భద్రతా ప్రయోజనాలకు అవసరమని వాదిస్తూ ఉక్రెయిన్‌ను పశ్చిమ దేశాలు బలపరిచే వివిధ మార్గాలను మాక్రాన్ మీడియాకు వివరించారు. "ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొనేం దుకు సైన్యాన్ని పంపటానికి అధికారికంగా ఏకాభిప్రాయం లేనప్పటికీ, అతను వివాదాస్పదంగా "ఏదీ మినహాయించ కూడదు" అని చెప్పారు. యూరోపియన్ యూనియన్ సభ్యదేశాలు క్రమంగా ఉక్రెయిన్‌కు అధునాతన ఆయుధాలను అందించడానికి సిద్ధపడుతున్నాయి. వారు మొదట "కేవలం స్లీపింగ్ బ్యాగ్‌లు మరియు హెల్మెట్‌లను" అందించినప్పటికీ, వారు సుదూర లక్ష్యాలను ఛేదించే క్షిపణులను , ఫైటర్ జెట్‌లను అందించడానికి చర్యలు తీసుకున్నారని మక్రాన్ చెప్పారు. సైన్యాన్ని మోహరించడం లో కూడా అదే జరగవచ్చు, ఏ దేశాలు తమ మిలిటరీలను పంపడానికి సిద్ధంగా ఉన్నాయో చెప్పడానికి ఆయన నిరాకరించారు.

మక్రాన్ ప్రకటనకు ప్రతిస్పందనగా తమ సైన్యాలను ఉక్రెయిన్ కు పంపే ఉద్దేశం తమకు లేదని ఐరోపా దేశాల నాయకులు స్పష్టం చేశారు. హంగేరి, స్లోవేకియాల నుండి పోలాండ్, జర్మనీల వంటి దేశాల వరకు అలాంటి ప్రణాళికలు ఏవీ అమలులో లేవని నొక్కిచెప్పాయి. అదే సందేశం నాటో సెక్రెటరీ జనరల్ జెన్స్ స్టోల్టెన్‌బర్గ్ , వాషింగ్టన్ నుంచి వచ్చింది. జాతీయ భద్రతా మండలి ప్రతినిధి అడ్రియన్ వాట్సన్ మీడియాతో మాట్లాడుతూ, "ఉక్రెయిన్‌లో పోరాడేందుకు అమెరికా తన సైన్యాన్ని పంపదని అధ్యక్షుడు జో బిడెన్ స్పష్టం చేశారు. ఫ్రెంచ్ రాజకీయ నాయకులు మక్రాన్‌ను మందలించారు. మైనర్ నేషనలిస్ట్ లెస్ పేట్రియాట్స్ పార్టీకి చెందిన ఫ్లోరియన్ ఫిలిప్పోట్ ఉక్రెయిన్‌లో జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించినట్లయితే అధ్యక్షుడిని ఆపాలని చట్టసభ సభ్యులను కోరారు. ఎమ్‌పి జీన్-లూక్ మెలెన్‌చోన్ మాక్రాన్ ఆలోచనను "పిచ్చి" అని పిలిచారు. ఇది అణ్వాయుధాలు కలిగిన దేశాలను పరస్పరం తలపడేలా చేయటమే అవుతుందని ఆమె పేర్కొంది.

మక్రాన్ ప్రకటనకు వ్యతిరేకంగా రష్యా ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. అదే జరిగితే రష్యా-నాటో ఘర్షణ "సంభావ్యత గురించి కాకుండా దాని అనివార్యత గురించి మాట్లాడవలసి ఉంటుంది" అని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ ప్రెస్ కాన్ఫరెన్స్ లో పేర్కొన్నారు. పాశ్చాత్య నాయకులు తమ జాతీయ ప్రయోజనాలకు అది ఎలా ఉపయోగపడుతుందనే విషయం గురించి తీవ్రంగా ఆలోచించాలని పెస్కోవ్ అన్నాడు. ఫ్రెంచ్ అధ్యక్షుడు తన దేశీయ విధానాలపై విమర్శలను తిప్పికొట్టేందుకు ఉక్రెయిన్ సంక్షోభాన్ని ఉపయోగించుకుంటున్నాడని డూమా ఛైర్మన్ వ్యాచెస్లావ్ వోలోడిన్ అన్నాడు.

ఫ్రెంచ్ ప్రెసిడెంట్ మక్రాన్ అమెరికా వదిలిపెట్టిన "నాయకత్వ శూన్యతను పూరించడానికి ప్రయత్నించాడు", కానీ అతని ప్రయత్నం "బెడిసికొట్టింది" అని ది వాల్ స్ట్రీట్ జర్నల్‌తో విధాన నిపుణుడు జానా పుగ్లీరిన్ అన్నాడు. అతను "అనవసరంగా నాటో లో చీలిక వచ్చేలా చేశాడు. నాటో సభ్య దేశాలు ఈ సమస్యపై చాలా సందేహాస్పదంగా ఉన్నాయి. యూరోపియన్ ఐక్యత , బలాన్ని ప్రోత్సహించ డానికి ఇది మార్గం కాదు" అని ఆయన అన్నాడు. ఈ పరాజయం "నాటో కూటమిలో ఐక్యత గురించి గందరగోళానికి దారితీసిందని, మక్రాన్ వ్యాఖ్య కేవలం శుష్క బెదిరింపుగానే మిగిలిపోతుంది" అని న్యూయార్క్ టైమ్స్ రాసింది. మక్రాన్ ప్రతిపాదనను "వేగంగా పంక్చర్ చేయబడిన ట్రయల్ బెలూన్"గా యుఎస్ఏ టుడే అభివర్ణించింది.



సిద్దిపేట జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి

- మంత్రి పొన్నంకు వినతిపత్రం ఇచ్చిన టీఎన్జీవో నాయకులు



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని కోరుతూ.. మంత్రి, 317జీఓ ఉపసంఘంలో సభ్యులు పొన్నం ప్రభాకర్‌కు సిద్దిపేట జిల్లా టీఎన్జీవోస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. టీఎన్‌జీవోస్ అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కోమండ్ల విక్రం రెడ్డి గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. తమ వినతిపత్రంపై మంత్రి సానుకూలంగా స్పందించారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని చెప్పారని చెప్పారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని సంగారెడ్డి జిల్లా చార్మినార్ జోన్‌లో, మెదక్, సిద్దిపేట జిల్లాలను రాజన్న సిరిసిల్ల జోన్‌లో కలపడం వల్ల ఉద్యోగుల ప్రమోషన్లతో పాటు మిగతా విషయాల్లో నష్టపోతున్నామని తెలిపారు.

దళితులకు మూడెకరాల భూపంపిణీలో.. న్యాయం చేయాలని గూడెం గ్రామస్తుల నిరాహారదీక్ష



నవతెలంగాణ-బెజ్జంకి

తమకు న్యాయం చేయాలంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన దళితులకు మూడెకరాల భూ పంపిణీ బాధితులు సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట రెండు రోజులుగా నిరాహారదీక్ష చేస్తున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గూడెం గ్రామంలోని 34 మందికి అధికారులు గతంలో భూ పంపిణీ చేశారు. కాగా, భూమి పొందిన వారిలో కొంతమందికి గతంలో వ్యవసాయ భూమి ఉండగా.. దాన్ని అమ్ముకొని భూ పంపిణీ పథకంలో లబ్దిదారులుగా చేరారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వారి వల్ల అసలు లబ్దిదారులకు భూములు దక్కలేదని వాపోయారు. లబ్ది పొందిన వారి గత రెవెన్యూ రికార్డులను పున్ణపరిశీలించాలని డిమాండ్ చేశారు. గ్రామ సభ ద్వారా మళ్లీ లబ్దిదారులను ఎంపిక చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు అధికారులను కోరారు.

హాలియా మున్సిపాలిటీలో అవిశ్వాసం నెగ్గిన కాంగ్రెస్

- చైర్‌పర్సన్, వైస్‌చైర్మెన్ స్థానాలను కోల్పోయిన బీఆర్ఎస్



నవతెలంగాణ-హాలియా

నల్లగొండ జిల్లా హాలియా పురపాలక సంఘం చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మ, వైస్ చైర్మెన్ నల్లగొండ సుధాకర్‌పై గురువారం పెట్టిన అవిశ్వాస తీర్మానంలో కాంగ్రెస్ నెగ్గింది. మున్సిపాలిటీలో మొత్తం 12 మంది కౌన్సిలర్లు ఉండగా వీరిలో చైర్‌పర్సన్, వైస్ చైర్మెన్ గైర్హాజరు కాగా మిగతా 10 మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతు పలికారు. దాంతో మున్సిపల్ చైర్ పర్సన్ వెంపటి పార్వతమ్మ, వైస్ చైర్మెన్ నల్లగొండ సుధాకర్ తమ పదవులను కోల్పోయారు. మిర్యాలగూడ ఆర్డీవో చెన్నయ్య ఆధ్వర్యంలో అవిశ్వాస పరీక్ష జరగ్గా నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి ఎక్స్‌అఫిషియో హోదాలో హాజరయ్యారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని నందికొండ, హాలియా మున్సిపాలిటీలు కాంగ్రెస్ హస్తగతం అయ్యాయని, వాటి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

ప్రజాసంస్కృతి విస్తరణకు ఎన్.శంకర్ కృషి ప్రశంసనీయం

- తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, అంబేద్కర్, ఫూలేపై వెబ్‌సిరీస్‌లు తేవడం గొప్ప విషయం : అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గరాజు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సాంస్కృతికరంగంలో ప్రజా సంస్కృతి విస్తరణకు సినీ దర్శకులు ఎన్.శంకర్ చేస్తున్న కృషి అభినందనీయమనీ, సాంస్కృతికంగా ఆయన చేస్తున్న పోరాటానికి తాము సంఘీభావం తెలుపుతున్నామని అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గరాజు, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం నాయకులు భూపతి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు గురువారం ఎన్.శంకర్‌కు జగ్గరాజు లేఖ రాశారు. తెలంగాణ, అంబేద్కర్, ఫూలే వెబ్‌సిరీస్‌లు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దేశ చరిత్రలోనే నిలిచి పోయిందనీ, ఆ పోరాటంలో నాలుగు వేల మందికిపైగా వీరమరణం పొందారని గుర్తుచేశారు. దొరలు, భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా జరిగిన ఆ మహత్తర పోరాటం ద్వారా పేదలకు 11 లక్షల ఎకరాల భూమిని కమ్యూనిస్టులు పంచారని తెలిపారు. ఆ పోరాటంతో ఏమాత్రం సబంధంలేని బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులు దాన్ని హిందూ-ముస్లిం మధ్య జరిగిన గొడవగా చూపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ప్రజల మెదళ్లలో తప్పుడు ఆలోచనలు జొప్పించేలా కొన్ని శక్తులు సినిమాలు తీస్తున్న ఈ సమయంలో శంకర్ వెబ్ సిరీస్‌లు తేవడానికి పూనుకోవడం మంచి నిర్ణయమని అభినందిం చారు. మనువాద సంస్కృతిని మెజార్టీ మతోన్మాదంగా దేశంపై రుద్దుతున్న శక్తులకు జవాబు చెబుతూ జ్యోతిబాపూలే, అంబేద్కర్‌లను నేటి తరానికి సోదాహరణంగా పరిచయడం చేయాలనుకోవడం మంచి పరిణామని తెలిపారు. వీరతెలంగాణ పోరుగడ్డ నల్లగొండ జిల్లా బిడ్డగా శంకర్ సాయుధ పోరాట వారసత్వాన్ని ముందుకు తీసుకుపోతారని ఆకాంక్షించారు. అంబేద్కర్ భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లడంలో భాగంగా 'సంఘం శరణం గచ్ఛామి' పేరుతో అంబేద్కర్‌పై నాటకాన్ని రూపొందించి ఎనిమిదేండ్లుగా 660 ప్రదర్శనలు చేశామనీ, 'సత్యశోధన' పేరుతో పూలే జీవితంపై 60 ప్రదర్శనలు, 'యోగి వేమన' నాటకాన్ని 60 చోట్ల ప్రదర్శించామని వివరించారు. 'బుద్ధునితో నా ప్రయాణం' అనే పేరుతో బౌద్ధం సారాంశాన్ని నాటకంగా మలిచే ప్రయత్నంలో ఉన్నామని తెలిపారు.

యాత్ర విజయవంతానికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

- హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్. గౌతమ్ రావు



నవతెలంగాణ-అంబర్‌పేట

విజయ సంకల్ప యాత్రతో బీజేపీ ప్రజల మధ్యకు వెళ్ళి వారి సమస్యలను గుర్తిస్తుందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్. గౌతమ్ రావు అన్నారు. యాత్ర విజయవంతానికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా గౌతమ్‌రావు మాట్లాడుతూ వచ్చే నెల 1వ తేదీన జరగాల్సిన ముగింపు యాత్ర వచ్చే నెల 2 వ తేదీకి వాయిదా పడిందని అన్నారు. వచ్చే నెల 2వ తేదీన వై.ఎమ్.సీ.ఏ చౌరస్తా నుండి చెప్పుల బజార్, టూరిస్ట్ హోటల్, బర్కత్ పుర చమాన్, ఫీవర్ హాస్పిటల్, పటేల్ నగర్ చౌరస్తా మీదుగా విజయ సంకల్ప యాత్ర వెళ్ళి శ్రీ. రమణ టాకీస్ వద్ద సాయంత్రం 06:30 గంటలకు రాష్ట్రంలో జరుగుతున్న అన్ని యాత్రల ముగింపు సభ ఉంటుందని తెలిపారు. వచ్చే లోకసభ ఎన్నికలలో సికింద్రాబాద్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలోని మెజార్టీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకోబోతుందని ఈ విజయ సంకల్ప యాత్ర ద్వారా స్పష్టమైందని అన్నారు.

రీ ఆర్గనైజ్ చేస్తేనే ప్రభుత్వ బడులకు మనుగడ

లేదంటే మరో ఐదేండ్లలో కనుమరుగయ్యే పరిస్థితి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ - తొర్రూరు

ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలలను కలుపుతూ ప్రతి తరగతికి 25మంది విద్యార్థులు ఉండేలా రీ ఆర్గనైజ్ చేస్తేనే ప్రభుత్వ బడులు నిలబడతాయని, లేకుంటే మరో ఐదేండ్లలో ప్రభుత్వ బడులు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్‌లోని అమ్మపురం, దంతాలపల్లి, నరసింహులపేట మండలాల్లో ఆయన పర్యటించి పాఠశాలల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో షేక్ సలార్ సాహెబ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ప్రభుత్వ బడులు నిలబడాలి-చదువులో అంతరాలు పోవాలి' అన్న నినాదంతో జిల్లాల పర్యటన సాగిస్తున్నట్టు చెప్పారు. ఈ పర్యటనలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు తెలుసుకొని సీఎం రేవంత్ రెడ్డికి నివేదిక అందజేస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న 27 వేల ప్రభుత్వ మండల పరిషత్, జిల్లా పరిషత్, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఈ పాఠశాలల్ని సరైన రీతిలో అభివృద్ధి చేస్తే మరో 20 లక్షల మంది విద్యార్థులకు చదువు చెప్పవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఏమి చేస్తే తల్లిదండ్రులు తమ పిల్లలను పంపుతారో అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించాలన్నారు. పాఠశాలలో ఒక సెక్షన్‌కు ఏడుగురు సబ్జెక్టు టీచర్ల చొప్పున సెక్షన్లు పెరిగే కొద్ది టీచర్ల సంఖ్యనూ పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, ప్రతి ఐదు సెక్షన్లకు ఒక వ్యాయామ ఉపాధ్యాయుడు, పది సెక్షన్లకు పైగా ఉన్న పాఠశాలల్లో సహాయ ప్రధానోపాధ్యాయ పోస్టు మంజూరు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. రీ ఆర్గనైజ్ చేసే పాఠశాలల్లో కనీసం 75 నుంచి 100 మంది విద్యార్థులు ఉండేలా ఉండాలన్నారు. కొత్త జిల్లాలకు జిల్లా విద్యాధికారి పోస్టులతో పాటు ప్రభుత్వ డైట్, బీఈడీ కళాశాలలో ఖాళీ పోస్టులను వెంటనే మంజూరు చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం బిల్లులు, వంట ఏజెన్సీ జీతాలను ప్రతినెల 5వ తేదీలోగా ఇచ్చేలా చూడాలన్నారు. కరెంటు బిల్లు ఇతర అవసరాలకు సరిపోయే విధంగా పాఠశాల నిర్వహణ గ్రాంట్లు సకాలంలో విడుదల చేయాలని అన్నారు. ఆగిపోయిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పార్లమెంటు ఎన్నికల కోడ్ రాకముందే పూర్తి చేయాలని, పెండింగ్ డీఏలు విడుదల చేసి, జీతాలు ఒకటి లేదా రెండు తేదీల్లో చెల్లించాలని తెలిపారు. అన్నారు. కేజీబీవీ, సమగ్ర శిక్ష, మోడల్ స్కూళ్ల, గురుకులాల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ బడుల్లో స్కావెంజర్లను నియమించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి రూ.10 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం.. వాటిలో రూ.2కోట్లు 'మన ఊరు మనబడి' కార్యక్రమానికి వినియోగించాలని ఉత్తర్వులు జారీ చేసిందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ గుగులోతు రాము, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఏ. మురళీకృష్ణ, మండల నోడల్ అధికారి మహంకాళి బుచ్చయ్య, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో తేల్చుకుందామా..?

(మొదటిపేజీ తరువాయి)

సీటునైనా గెలిచి చూపించాలంటూ సీఎం... బీఆర్ఎస్‌నుద్దేశించి ఎద్దేవా చేసిన నేపథ్యంలో కేటీఆర్ ఈ రకమైన సవాల్ విసిరారు. మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) ఇచ్చిన రిపోర్టును ఆయన ఒక రాజకీయ ప్రేరేపిత నివేదికగా అభివర్ణించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కేంద్రంలోని బీజేపీ సూచనల మేరకు ఇచ్చిన ఆ రిపోర్టుపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి, సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎందుకంత విశ్వాసమంటూ ప్రశ్నించారు. ఉత్తమ్‌కు బ్యారేజీకి, రిజర్వాయర్‌కు తేడా తెలియదంటూ ఎద్దేవా చేశారు. ఆయనతో పాటు ముఖ్యమంత్రి రేవంత్...పాలనలో గందరగోళానికి గురవుతున్నారని విమర్శించారు. ఆ కన్ఫ్యూజన్‌నుంచి బయటపడాలంటూ వారికి సూచించారు.

గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్... పాత్రికేయులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన మేడిగడ్డ పర్యటన, పలు అంశాల్లో విచారణలు చేపడతామంటూ ప్రభుత్వ ప్రకటనలు, పార్లమెంటు ఎన్నికలు తదితరాంశాలపై ఆయన ఈ సందర్భంగా ముచ్చటించారు. సీఎం రేవంత్‌కు నిజంగా ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే రైతులకు రూ.2 లక్షల వరకూ రుణమాఫీ చేయాలనీ, మహిళలకు ఆర్థిక సాయం కింద నెలకు రూ.2,500 ఇవ్వాలనీ, ఇతర హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆడవాళ్లను కించపరిచే విధంగా సీఎం మాట్లాడటం శోచనీయమన్నారు. మహిళలు రాజకీయాల్లో రాణించకూడదా..? అని ప్రశ్నించారు. 'నేనే సీఎం, నేనే సీఎంగా ఉంటా...' అంటూ రేవంత్ మాట్లాడుతుండటాన్నిబట్టి ఆయనకు ఆత్మనూన్యత భావం (ఇన్‌ఫియారిటీ కాంప్లెక్స్) ఉందని అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. ఆయన క్యాబినెట్‌లోని వారిపై ఆయనకే నమ్మకం లేదంటూ ఎద్దేవా చేశారు. తనను, తన పదవులనుద్దేశించి రేవంత్ 'మేనేజ్‌మెంట్ కోటా' అంటూ మాట్లాడటాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా తప్పుబట్టారు. 'నాది మేనేజ్‌మెంట్ కోటా అయితే, మీ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకలది ఏ కోటా...?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు పీసీసీ అధ్యక్ష పదవితోపాటు సీఎం పదవి కూడా 'పేమెంట్' కోటాలోనే వచ్చిందని ఘాటుగా విమర్శించారు. ఆ కోటాలో పదవులు తెచ్చుకున్నందుకు రేవంత్, ఢిల్లీకి పేమెంట్లు చేయాలి, కప్పం కట్టాలి, బ్యాగులు మోయాలంటూ విమర్శించారు. ఆ డబ్బుల కోసం బిల్డర్లను, వ్యాపారులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈ తతంగంలో భాగంగానే హైదరాబాద్‌లో భవన నిర్మాణాలకు అనుమతులివ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఆపేసిందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్ని బిల్డింగులకు అనుమతులిచ్చారు..? ఎన్నింటిని ఆపేశారో తెలపాలంటూ డిమాండ్ చేశారు. రేవంత్ సర్కార్ వేధింపులు భరించలేక త్వరలోనే రాష్ట్రంలోని బిల్డర్లు, వ్యాపారులు రోడ్డెక్కటం ఖాయమని హెచ్చరించారు.

సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి మేడిగడ్డ బ్యారేజీలోని పిల్లర్ కుంగిపోవటమనేది రాష్ట్రంలో మొదటి ఘటన కానేకాదని కేటీఆర్ పునరుద్ఘాటించారు. ఉమ్మడి రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులకు రిపేర్లు వచ్చాయని గుర్తు చేశారు. ఆనాటి ప్రభుత్వాలు వాటికి మరమ్మతులు చేసి కాపాడాయి తప్పితే రేవంత్ ప్రభుత్వం మాదిరిగా వదిలిపెట్టలేదని తెలిపారు. మేడిగడ్డ లాంటి ఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వాలు వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచించారు. పిల్లర్ల రిపేర్లు, ఇంజినీరింగ్ పరిష్కారాల దిశగా సర్కారు కార్యాచరణ ఉండాలని అన్నారు. అంతే తప్ప ఎన్నికల సమయంలో హడావుడిగా రెండు రోజుల్లో నివేదిక రూపొందించిన ఎన్‌డీఎస్ఏ రిపోర్టు మీద ఆధారపడటం సరికాదన్నారు. ఆ సంస్థ ప్రతినిధులు కనీసం బ్యారేజీ మీద నుంచి కిందికి దిగారా..? కనీసం ఇసుకలోకి దిగి ఒక్క శాంపిల్‌నైనా తీసుకున్నారా..? అని ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసం, ఉద్దేశపూర్వకంగా ఆదరాబాదరాగా ఎన్‌డీఎస్ఏతో నివేదికను తయారు చేయించారని విమర్శించారు. అందుకే ప్రభుత్వానికి సమర్పించాల్సిన నివేదికను మీడియాకు చేరవేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రిపోర్టుపై నమ్మకాన్ని ప్రదర్శిస్తున్న మంత్రి ఉత్తమ్‌కు.. ఈడీ, సీబీఐ దాడులపై కూడా అంతే నమ్మకముండాలి కదా..? అని ప్రశ్నించారు. అన్నదాతలను ఆదుకోవాలన్న సెన్సు, కామన్సెన్సు ప్రభుత్వానికి లేవన్నారు. రైతుల కష్టాలను చూసైనా రేవంత్ సర్కార్ తన వైఖరిని మార్చుకోవాలని కేటీఆర్ ఈ సందర్భంగా కోరారు. సమస్య ఎక్కడ ఉందో తెలుసుకుని, దాన్ని పరిష్కరించాలని సూచించారు. మేడిగడ్డ నుంచి వృథాగా కిందికి పోతున్న నీళ్లను ఎత్తిపోసేందుకు ఒక పంపునైనా పని చేయించాలని కోరారు. తమ సూచనలను పనికి రావంటే, నిపుణుల కమిటీ వేసి, దాని సలహాలనైనా పాటించాలని విజ్ఞప్తి చేశారు. కాఫర్ డ్యాంను నిర్మించటం ద్వారా నాలుగు నెలల్లో కుంగిన పిల్లర్లకు మరమ్మతులు చేయాలని కోరారు. కాళేశ్వరంతోపాటు తమ ప్రభుత్వ హయాంలో ఏ విషయంలోనైనా తప్పు జరిగితే కచ్చితంగా విచారణ జరిపించాలనీ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అంతే తప్ప బీఆర్ఎస్‌పై ఉన్న కక్షతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. ప్రాజెక్టుల విషయంలో తమ పార్టీ నేతల సలహాలు వద్దంటూ చెప్పిన మంత్రికి సునీల్ కనుగోలు సూచనలు మాత్రం బాగా నచ్చుతున్నాయని ఎద్దేవా చేశారు. తమకు న్యాయ స్థానాలపై నమ్మకముందనీ, కాంగ్రెస్ కుట్ర పూరితంగా వ్యవహరించే ఏ అంశాన్నైనా న్యాయపరంగానే ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన 'పాలమూరు- రంగారెడ్డి' యాత్ర కేవలం తమకు పోటీ యాత్ర మాత్రమేనని విమర్శించారు. బీజేపీ నేత వెదిరె శ్రీరాం భువనగిరి ఎంపీ సీటు కోసం తాపత్రయ పడుతున్నారని చెప్పారు. అందుకే ఆయన కాళేశ్వరం పై అవగాహన లేకుండా విమర్శిస్తున్నారని చురకలంటించారు.

నిలోఫర్‌లో 'నవజాత శిశువుల స్క్రీనింగ్' ప్రారంభం



నవతెలంగాణ-మెహిదీపట్నం

హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో నవజాత శిశువుల స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ గురువారం ప్రారంభించారు. నవజాత శిశువుల్లో ఏమైనా జన్యుపరమైన లోపాలుంటే వాటిని ముందే గుర్తించి ఆ శిశువుల ఆరోగ్యాన్ని కాపాడడానికి తగు చర్యలు తీసుకోవడం దీని ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ.. శిశువుల ఆరోగ్యం పరిరక్షించేందుకు ఈ స్క్రీనింగ్‌ను నిలోఫర్ ఆస్పత్రిలో ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. నూటికి 52 శిశు జననాలు ప్రభుత్వ ఆస్పత్రిలోనే జరుగుతున్నందున ఈ స్క్రీనింగ్ టెస్ట్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ఈ స్క్రీనింగ్ టెస్ట్‌లో నిలోఫర్ ఆస్పత్రిలో పుట్టిన ప్రతి శిశువు రక్తం శాంపిల్‌ను బేగంపేటలోని జెనెటిక్ డీసీజెస్ ఇన్‌స్టిట్యూట్‌కు పంపిస్తారు. అక్కడ రక్తపరీక్ష చేసి శిశువులో ఏమైనా జన్యుపరమైన లోపాలు ఉంటే ఆ విషయాన్ని ముందే గుర్తించి ఆస్పత్రికి రిపోర్టులు పంపిస్తారు. ఈ పరీక్షకు ఐదు నుంచి వారం రోజుల సమయం పడుతుంది. ఈ పరీక్షల నిర్వహణతో శిశువు ఆరోగ్య పరిస్థితిని సమీక్షించి వైద్యం ప్రారంభిస్తారు. తల్లిదండ్రులను అప్రమత్తం చేసి శిశువు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలను వారికి తెలియజేస్తారు. పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఈ కార్యక్రమం ఇప్పటికే సంగారెడ్డిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రారంభమై విజయవంతంగా నడుస్తోంది. ఈ స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఐదు నిర్దిష్ట జన్యుపరమైన రుగ్మతలను గుర్తించడానికి రూపొందిం చారు. అవి.. పుట్టుకతో వచ్చే హైపో థైరాయిడిజం, అడ్రినల్ హైపర్ ప్లాసియా, గ్లూకోజ్-6-ఫాస్ఫేట్ డీహైడ్రోజీనేస్ లోపం, గెలాక్టోసెమియా, బయోటినిడేస్ లోపం. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాణి, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషారాణి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ సభ్యులు, ఏపీ పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరా రెడ్డి కలిశారు.

తెల్లజొన్న పంట దగ్ధం.. రూ.30 వేల నష్టం

నవతెలంగాణ-ముప్కాల్

నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామం నుంచి రెంజర్ల గ్రామానికి వెళ్ళే ప్రధాన రోడ్డుపై ఆరబెట్టిన తెల్లజొన్న కంకులను బుధవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. బాధిత రైతు శివాయి చిన్న నర్సయ్య వివరాల ప్రకారం.. రెండు టార్పలిన్లలో తెల్లజొన్న కంకుల పంటను గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో దాదాపు రూ.30 వేల మేర పంట నష్టం వాటిల్లింది. టార్పాలిన్లు సైతం కాలిపోయాయి.

జనావాసాల మధ్య 'బ్లాస్టింగ్'

- బోడుప్పల్ "శ్రీ కృష్ణ డెవలపర్స్" నిర్మాణం వద్ద.. పేలుడు పదార్థాల స్వాధీనం



నవతెలంగాణ-బోడుప్పల్

ఎలాంటి అనుమతులు లేకుండా ఓ రియల్ ఎస్టేట్ సంస్థ నిర్మాణాల పేరుతో పేలుళ్లకు పాల్పడిన సంఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్లలో శ్రీ కృష్ణ డెవలపర్స్ పేరుతో ఓ భారీ నిర్మాణం చేపట్టి పనులు ప్రారంభించారు. అయితే సెల్లార్ తవ్వేందుకు ఒప్పందం చేసుకున్న కాంట్రాక్టర్.. భూగర్భంలో బండ రాయి రావడంతో దాన్ని పగుల కొట్టేందుకు.. చట్టవిరుద్ధంగా డిటోనేటర్లు, జిలిటిన్ స్టిక్స్‌ను ఉపయోగించి రాత్రి, పగలు తేడా లేకుండా బండలను పగుల కొట్టారు. దాంతో ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలు భయభ్రాంతులకు గురై స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ పోలీసులకు)కు సమాచారం ఇచ్చారు. దాంతో వారు రంగంలోకి దిగి ఘటనా స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలను ఉపయోగించి బండలను పగులకొడు తున్న విషయం ధ్రువీకరించారు. పేలుళ్లకు బాధ్యులైన కాంట్రాక్టర్ మధుతో పాటు అక్కడ పనిచేసే వ్యక్తులు సత్తయ్య, గణేష్, వెంకటేష్, మల్లేష్‌ను ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకుని కంప్రెషర్ ట్రాక్టరును స్వాధీనం చేసుకుని మేడిపల్లి పోలీసులకు అప్పగించారు. పలురకాల పేలుడు పదార్థాలనూ స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా, మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న శ్రీ కృష్ణ డెవలపర్స్‌లో పేలుళ్లకు పాల్పడుతుంటే స్థానికంగా ఉన్న పోలీసులకు సమాచారం లేదా లేకుంటే తెలిసినా డెవలపర్స్ ఒత్తిడిల కారణంగా చూసి చూడనట్టుగా వ్యవహరిం చారా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇదే సమయంలో పేలుడు పదార్థాలను ఎస్ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్న విషయం బయటకు పొక్కకుండా స్థానిక రాజకీయ నాయకులు రంగంలోకి దిగినట్టు సమాచారం. రాజకీయ నాయకుల ఒత్తిడితో డెవలపర్స్ యాజమానులపై కాకుండా కేవలం అక్కడ పనిచేసే వారిపై కేసులు నమోదు చేశారని స్థానికులు చర్చించుకుంటున్నారు. వీటిపై వివరణ అడిగేందుకు హెచ్ఎండీఏ ఘట్‌కేసర్ జోన్ ప్లానింగ్ ఆఫీసర్ (పీవో) ప్రభాకర్ రెడ్డికి ఎన్ని సార్లు ఫోన్ చేసినా ఆయన నుంచి ఎలాంటి సమాధానం దొరకలేదు.

అకృత్యాలకు ఆవాసంగా గుజరాత్ లా వర్సిటీ

లైంగికదాడులు, వేధింపులు, వివక్ష ఉదంతాలు

విద్యార్థుల గొంతు నొక్కేస్తున్నారు

- న్యాయ విద్యార్థులకే రక్షణ లేకుంటే ఎలా? : హైకోర్టు వ్యాఖ్య

అహ్మదాబాద్ : గుజరాత్ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (జీఎన్‌ఎల్‌యూ) ప్రాంగణంలో వేధింపులు, అత్యాచారాలు, స్వలింగసంపర్కం, వివక్ష వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇవేవో ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలు కావు. గుజరాత్ హైకోర్టు నియమించిన నిజ నిర్ధారణ కమిటీ గత వారం న్యాయస్థానానికి సమర్పించిన నివేదికలోని చేదునిజాలు. ఈ నివేదిక 'నిజంగా భయానకం'గా ఉన్నదని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ దారుణాలకు జీఎన్ఎల్‌యూయే బాధ్యత వహించాలని ప్రధాన న్యాయమూర్తి సునీతా అగర్వాల్, న్యాయమూర్తి అనిరుద్ధ మయీతో కూడిన బెంచ్ స్పష్టం చేసింది. అకృత్యాలపై గళం విప్పకుండా విద్యార్థుల గొంతుకను వర్సిటీ యాజమాన్యం అణచివేస్తోందని మండిపడింది.

జీఎన్ఎల్‌యూలో చదువుతున్న ఓ విద్యార్థినిపై లైంగికదాడి జరిగిందని, మరో విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని సామాజిక మాధ్యమాలలో వచ్చిన వార్తలపై మీడియాలో కథనాలు వెలువడ్డాయి. వీటిని సుమోటోగా స్వీకరించిన న్యాయస్థానం మాజీ న్యాయమూర్తి హర్షా దేవాని నేతృత్వంలో నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసింది. యూనివర్సిటీపై వచ్చిన వార్తలను వర్సిటీకి చెందిన ఆంతరంగిక ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ), రిజిస్ట్రార్ అంతకుముందు తోసిపుచ్చారు. 'ఇది జాతీయ న్యాయ యూనివర్సిటీ ఎలా అవుతుంది? ఏమీ జరగలేదని, విచారణను నిలిపివేశామని రిజిస్ట్రార్ ఓ అఫిడవిట్ సమర్పించారు. ఇలాంటి వ్యక్తులు పిల్లలను ఎలా రక్షిస్తారు?' అని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. వర్సిటీ ప్రాంగణంలో అత్యాచారం, లైంగిక వేధింపులకు సంబంధించి రెండు సంఘటనలు మాత్రమే జరగలేదని, అనేక ఇతర దారుణాలు కూడా చోటు చేసుకున్నాయని బెంచ్ అభిప్రాయపడింది. విద్యార్థులు చేసిన ఫిర్యాదులను వర్సిటీ అధికారులు బుట్టదాఖలు చేశారని నిజ నిర్ధారణ కమిటీ తేల్చిందని తెలిపింది. పైగా విద్యార్థులు తమ సమస్యలను సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేయడాన్ని నేరంగా వారు పరిగణించారు. ఇలాంటి పోస్టుల వల్ల వర్సిటీ ప్రతిష్ట దెబ్బతింటుందని భావించారు. న్యాయాన్ని రక్షించాల్సిన లా విద్యార్థులకే ఇలా జరిగితే ఎలా అని న్యాయస్థానం ప్రశ్నించింది. కేసు తదుపరి విచారణను మార్చి 12వ తేదీకి వాయిదా వేసింది.

మహారాష్ట్రలో సయోధ్య




- 48 సీట్లపై చర్చలు పూర్తి : ఎంవిఎ

ముంబయి : మహారాష్ట్రలోనూ ప్రతిపక్ష కూటమి మహా వికాస్ అఘాది (ఎంవిఎ) ఐక్యంగా బరిలోకి దిగేందుకు సిద్ధమైంది. మొత్తం 48 లోక్‌సభ స్థానాలపై చర్చలు పూర్తయ్యాయని గురువారం ప్రకటించింది. ముంబయిలోని శరద్‌పవార్ నివాసంలో గురువారం జరిగిన సమావేశంలో కాంగ్రెస్, శివసేన (యుబిటి), ఎన్‌సిపి నాయకులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాలాసాహెబ్ థోరట్ మీడియాతో మాట్లాడుతూ 48 సీట్లపై చర్చలు ముగిసాయని చెప్పారు. ఎన్నికల్లో పార్టీల ఓటింగ్ ఆధారంగా సీట్ల పంపకాల ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. పూర్తి వివరాలను ఎంవిఎ అగ్రనాయకులు త్వరలో వెల్లడిస్తారని చెప్పారు.

రెచ్చిపోయిన స్కామర్లు

మాజీ న్యాయమూర్తి కుటుంబానికి రూ.2.5 కోట్ల కుచ్చుటోపీ

- 'ఎలక్టోరల్ బాండ్ల జారీ కోసం' అంటూ వసూలు
- ఇద్దరిపై మాజీ న్యాయమూర్తి ఫిర్యాదు
- అందులో ఒకరు ఆరెస్సెస్‌లో ముఖ్యమైన వ్యక్తి అని ఆరోపణ



న్యూఢిల్లీ : ఎలక్టోరల్ బాండ్ల పేరుతో ఇద్దరు స్కామర్లు మాజీ న్యాయమూర్తి డి.ఎస్.ఆర్. వర్మ కుటుంబాన్ని మోసం చేశారు. 'కేంద్రంలోని పార్టీకి' ఎలక్టోరల్ బాండ్ల జారీ కోసం వర్మ కుటుంబాన్ని మోసం చేసి రూ.2.5 కోట్లు వసూలు చేశారు. దీనిపై వర్మ హైదరాబాద్‌లో ఇద్దరు స్కామర్లపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. "మా బంధువులకు తెలిసిన వ్యక్తి అయిన నరేంద్రన్ నా వద్దకు వచ్చి కేంద్రంలోని పార్టీకి కొంత మొత్తాలు బాండ్ల ద్వారా ఇవ్వాలని కోరాడు. అతని మాటలు నమ్మి.. నా కుమార్తెలు, నా భార్య 2021 సంవత్సరంలో ఎప్పటికప్పుడు మొత్తం రూ. 2.5 కోట్లు బ్యాంక్ ద్వారా పంపారు" అని వర్మ హైదరాబాద్ ఫిల్మ్ నగర్ పోలీస్ స్టేషన్‌లో దాఖలు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. డి.ఎస్.ఆర్ వర్మ (72) ఆంధ్రప్రదేశ్, అలహాబాద్ హైకోర్టులలో పనిచేసిన రిటైర్డ్ జడ్జి.

వర్మ ఫిర్యాదు చేసిన ఇద్దరు వ్యక్తులలో ఒకరు తన అల్లుడికి తెలుసుననీ, వారు ఆరెస్సెస్‌లో 'ముఖ్యమైన నాయకులు' అని పేర్కొన్నారు. అనిల్ లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌లో అతను వరల్డ్ హిందూ కాంగ్రెస్‌కు కోఆర్డినేటర్ అనీ, ఆరెస్సెస్‌తో సన్నిహితంగా పనిచేసే సంస్థ వరల్డ్ హిందూ ఎకనామిక్ ఫోరమ్‌లో భాగమని ఒక ఆంగ్ల వార్త పత్రిక కథనం వెల్లడించింది. ఇచ్చిన డబ్బుతో ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేస్తామనీ, దానికి బదులుగా "తనను, తన మనవళ్లను యూఎస్‌లో మర్యాదగా ఉంచుతామని" స్కామర్లు పేర్కొన్నారని వర్మ తన ఫిర్యాదులో వివరించారు. రిటైర్డ్ జడ్జి తన ఇద్దరు మనవరాళ్ళు యూఎస్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ పూర్తి చేశారని చెప్పారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
శుక్రవారం | మార్చి 1, 2024 | www.navatelangana.com



కమలానగర్ నుండి దిల్‌సుఖ్‌నగర్‌కు వెళ్లే రహదారి మార్గంలో చెత్త పేరుకుపోయి ఉంది. కొద్ది రోజులుగా ఈ చెత్తను తీయకపోవడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు అనారోగ్యానికి గురికాక ముందే ఆ చెత్తను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

నవతెలంగాణ - మలక్‌పేట్

'మేడిగడ్డ యాత్రను విజయవంతం చేయాలి'



నవతెలంగాణ - చైతన్యపురి

నేడు నిర్వహించబోయే కాళేశ్వరం మేడిగడ్డ యాత్రను విజయవంతం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం కండ్లు తెరిపిద్దామని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద శర్మ పిలుపునిచ్చారు. గ్రీన్‌హిల్స్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును అతి తక్కువ సమయంలోనే నిర్మించిన కాళేశ్వరంను కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాల్లోకి వాడుకోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మేడిగడ్డ ఒకటే కాదని.. పదుల సంఖ్యలో రిజర్వాయర్లు, వేల కిలోమీటర్ల కాల్వలు, వందల కిలోమీటర్ల సొరంగాలు, పదుల సంఖ్యలో పంప్‌హౌస్‌లని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలన మీద దృష్టి పెట్టకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై వితండవాదానికి దిగుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ఇలాంటి నీచ రాజకీయాలకు తెరలేపారని మండిపడ్డారు. కాళేశ్వరం మేడిగడ్డ యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ - బడంగ్‌పేట్

నాలా నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 1వ డివిజన్ వరలక్ష్మీ నగర్, సాయి బాలాజీ నగర్, సాయి కృష్ణ కాలనీలలో చేపట్టిన ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణ పనులను గురువారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న నాలా నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించి, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఉన్న సమయంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కోట్లాది రూపాయల ప్రత్యేక నిధులను మంజూరు చేసి, అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసినట్టు గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రత్యేకంగా మంజూరు చేసిన రూ.50 లక్షల నిధులను రద్దు చేయకుండా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంట ఫ్లోర్ లీడర్ సుర్గగంటి అర్జున్, పెద్దబావి ఆనంద్ రెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి శ్రీనివాసరెడ్డి, సంరెడ్డి వెంకట్ రెడ్డి, భీమిడి జంగారెడ్డి, వరలక్ష్మీ కాలనీ అధ్యక్షులు డి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ నగరాల సదస్సుకు మేయర్‌కు ఆహ్వానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

సింగపూర్‌లో ఈ ఏడాది జూన్ 2 నుండి 4 వరకు జరగనున్న 9వ ప్రపంచ నగరాల సదస్సులో హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని పాల్గొనాల్సిందిగా కోరుతూ సింగపూర్ కౌన్సిల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ గురువారం మేయర్‌ను కలిసి ఆహ్వానించారు. నివాసయోగ్యమైన, స్థిరమైన నగర సవాళ్లను పరిష్కరించడానికి, ఇంటిగ్రేటెడ్ అర్బన్ సొల్యూషన్స్ పంచుకోవడానికి, కొత్త భాగస్వామ్యాలను రూపొందించడానికి మేయర్లు, వ్యాపారవేత్తలు, పట్టణ నిపుణులతో ఈ ప్రపంచ నగరాల సదస్సు ఒక వేదికగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ వేదికలో లివబుల్ అండ్ సస్టైనబుల్ సిటీస్, రిజువేనేట్, రీ ఇన్వెంట్, రీ ఇమేజిన్ అంశాలపై మేయర్లు, బిజినెస్ లీడర్‌లు, పట్టణ నిపుణులతో స్మార్ట్, పునరుత్పత్తి నగరాలను సాధించడానికి గల అవకాశాలు, స్మార్ట్ సిటీల లక్ష్యసాధనకు సొల్యూషన్స్, ప్రస్తుతం భవిష్యత్తులో అందరికీ మంచి నగర జీవితాన్ని అందించడంపై చర్చించడం జరుగుతుందన్నారు.

ఈ సందర్భంగా మేయర్ వారితో మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. నగరాన్ని అత్యున్నత నగరంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. నగరంలో మౌలిక సదుపాయాలు సోషల్ ఎకనామిక్ పథకాలు, సిగ్నల్ ఫ్రీ నగరంగా అభివృద్ధి చేసినట్టు మేయర్ వివరించారు. ఈ కార్యక్రమంలో సింగపూర్ వైస్‌కౌన్సిల్ మిస్‌నికోల్ చెన్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాలి



- సీనియర్ సివిల్ జడ్జి డి. ఇందిరా

నవతెలంగాణ - చైతన్యపురి

పిల్లలకు గుడ్, బ్యాడ్ టచ్ (స్పర్శ) వంటి వాటిపై అవగాహన కల్పించాలని రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిరా సూచించారు. చైల్డ్ చాప్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉప్పరిగూడ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు మంచి స్పర్శ, చెడు స్పర్శల మీద గురువారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లల కిడ్నాప్‌లు, వారిపై వేధింపులు, లైంగిక వేధింపులు జరుగుతున్న కేసులను మనం ఎప్పటికప్పుడూ చూస్తూనే ఉంటున్నాం.. అయినా సరే కొందరు తల్లీదండ్రులు పిల్లలకు కొన్ని సెన్సిటివ్ విషయాలు నేర్పేందుకు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పిల్లలకు ఆ విషయాలపై అవగాహన లేకుంటే ఇలాంటి దారుణాలు జరుగుతూనే ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారని పేర్కొన్నారు. కాబట్టి తమ పిల్లలను కాపాడుకోవాలి అనుకునేవారు కొన్ని విషయాలు పిల్లలతో చర్చించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ చాప్టర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జాకీర్ హుస్సేన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచడం కోసమే సదస్సులు



- ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

నవతెలంగాణ - బడంగ్‌పేట్

నేటి విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం కోసం కళాశాలలో జాతీయ, అంతర్జాతీయ సదస్సులను ఏర్పాటు చేస్తున్నట్టు ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాదర్ గుల్‌లోని ప్రముఖ ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో డేటా అక్విసిషన్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్-24 అంశంపై జరుగుతున్న మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును గురువారం మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ కే.వీ.ఆర్ కశ్యప్, లక్ష్మీనారాయణలతో కలిసి ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొ. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆధునిక సమాజం యొక్క ప్రస్తుత అవసరాలను పరిష్కరించే నిపుణ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్, డీప్ లెర్నింగ్, ఎవల్యూషనరీ అల్గోరిథంలు ఆప్టిమైజేషన్ తదితర అంశాలను సమావేశంలో చేర్చబడతాయన్నారు. డాక్టర్ సంధ్య మాట్లాడుతూ ఈ సదస్సుకు దేశ విదేశాల నుండి మొత్తం 600 మంది రచయితలు, 200 పేపర్లు సమర్పించగా..చివరగా 32 పేపర్లు టేలర్ అండ్ ఫ్రాన్సిస్, 23 పేపర్లు యూజీసీకి సెలెక్ట్ అయ్యాయని తెలిపారు. ఈ మూడు రోజులు పేపర్, పోస్టర్ల ప్రెజెంటేషన్లు ఉంటాయన్నారు. అనంతరం మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ కోశాధికారి జూపూడి సుధాకర్, జాయింట్ సెక్రటరీ-1 వాసుదేవరావు, జాయింట్ సెక్రటరీ-2 పార్థసారథి, సభ్యులు హిరణ్మయి, ఉమాదేవి పాల్గొని సదస్సు నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమానికి చీఫ్ ప్యాట్రన్స్‌గా చైర్మన్ కేవీఆర్ కశ్యప్,సెక్రటరీ డా.కేపీ శ్రీనివాస్ రావు, ప్యాట్రన్స్‌గా కళాశాల ప్రిన్సిపాల్ డా. జి కనకదుర్గ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.యస్డీయస్ మూర్తి, కాన్ఫరెన్స్ చైర్ పర్సన్‌గా సీయస్ఇ హెచ్ఓడి ప్రొ. ప్రసన్నకుమార్, కార్యక్రమ చైర్ పర్సన్స్‌గా ప్రొ. సంధ్య ప్రొ. రాజేష్ కులకర్ణి, ప్రొ. డి శిరీష వ్యవహరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు డా. సుధ, డా. సురేష్ లోఖండే, డా. వెంకటదాస్, వివిధ రాష్ట్రాలు, యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు, డీఆర్డీఓలు, సైంటిస్టులు, పేపర్ ప్రజెంటేషన్‌లను పర్యవేక్షించారు.

విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న కేంద్ర ప్రభుత్వం

- సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య విమర్శ



నవతెలంగాణ- నాగోల్

నేడు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నదని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య విమర్శించారు. బండ్లగూడ నాగోల్‌లోని నవ చేతనలో నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా రాజకీయ శిక్షణా తరగతులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలో వచ్చిన ఈ పదేండ్ల కాలంలో శాస్త్రీయ విద్యా విధానాన్ని మార్చివేసి మతపరమైన వాటిని పాఠ్యపుస్తకాలలో చేర్చి, సమాజానికి ఏ మాత్రం ఉపయోగపడని భావజాలాన్ని పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. ఈ శిక్షణా తరగతులలో నేర్చుకున్న వాటిని అర్థం చేసుకొని ..రాబోయే కాలంలో విద్యార్థి పోరాటాలకు ఉపయోగించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీకి సూచించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజ్ రవీంద్ర చారి మాట్లాడుతూ..నేటి విద్యార్థులే భవిష్యత్ రాజకీయ నాయకులు కావాలని పిలుపునిచ్చారు. మార్క్సిజం లేని నిజం పునాదుల పైన అవగాహన కలిగించుకొని విప్లవం పట్ల మంచి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మొదటి క్లాసు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి ఏఐఎస్ఎఫ్ ఉద్యమ చరిత్రను, రెండో సెషన్‌లో ఏఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ నూతన విద్యా విధానం, మూడో క్లాస్‌ను సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు గతితార్కిక భౌతిక వాదం క్లాస్‌లను బోధించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సామిడి శేఖర్ రెడ్డి, సరూర్నగర్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గ్యార క్రాంతి, జిల్లా అధ్యక్షుడు పి.శివ, వంశీ, అరుణ్, వినోద్, ఆకాష్, తేజ, ఉపేందర్, బాను, శ్రీకాంత్త మణికంఠ కుమార్, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.500 కోట్ల విలువైన భూమిని

కబ్జా చేసిన వాసవి రియల్ ఎస్టేట్ సంస్థ



సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు

నవతెలంగాణ - హయత్‌నగర్

ఎల్బీనగర్‌లో ఉన్న వాసవి రియల్ ఎస్టేట్ సంస్థ సుమారు రూ.500కోట్ల విలువ గల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందని సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు ఆరోపించారు. ఈ విషయంపై సెక్రటేరియట్‌లోని సీఎం రేవంత్ రెడ్డి కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరీస్ ఫార్మా సంస్థకు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేవలం 14 ఎకరాలు మాత్రమే కేటాయించిందని ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. మిగతా ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, అక్కడ హైరస్ బిల్డింగులు నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఎల్బీనగర్‌లోని సరూర్నగర్ మండల బహదూర్‌గూడ సర్వే నెంబర్ 49/13 భూములపై విచారణ జరిపించేందుకు ప్రత్యేకంగా అధికారుల బృందాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఆ ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని అందులో బీసీ స్టడీ సర్కిల్ భవనాలు నిర్మించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కబ్జా వ్యవహారాలపై ఎల్బీనగర్ పేరును మాయం చేసే కుట్ర జరుగుతుందని, ఈ విషయంపై అతి త్వరలో ఎల్బీనగర్ నియోజకవర్గంలో ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలచే రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

'ఎన్టీఆర్‌నగర్ ఇండ్ల స్థలాలను రెగ్యులరైజ్ చేయాలి'



నవతెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజవర్గం ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ బస్తీలో నివాసం ఉండే పేదల ఇండ్ల స్థలాలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ది అర్బన్ హట్స్, స్లమ్ డెవలప్మెంట్ అసోసియేషన్ ట్విన్ సిటీస్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. ఎన్టీఆర్‌నగర్ చింత చెట్ల వద్ద బస్తీ వాసులతో కలసి ఇండ్లను క్రమబద్దీరణ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్‌నగర్ సర్వేనెంబర్ 9/1లో దాదాపు 45 ఎకరాలలో 1986 నుంచి 3వేల కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. దశాబ్దాలుగా ఇండ్ల పట్టాలను రెగ్యూలర్ చేస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ నేటికీ ఆ హామీని నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఎన్టీఆర్‌నగర్ ఇండ్ల క్రమబద్ధీకరణ జరిగే వరకూ తమ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఇండ్ల స్థలాలను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ నగర్ బస్తీ వాసులు సామల చంద్రయ్య, శంకర్ మహారాజు, పోచయ్య, యాదయ్య, మమ్మద్ అజీమ్, చింతల శోభరాజీ, ఎండి రియాజ్, సయ్యద్ అజీబాబు, సుజాత, శారద, మాడపాట్టి గౌరి, సురేష్, మోసిన్, లక్ష్మి, మేడి పుష్ప, సత్తమ్మ, సహినబేగం, నకిరేకంటి శారద తదితరులు పాల్గొన్నారు.

'ఆర్టికల్ 370 రద్దు

దేశ చరిత్రలోనే అత్యంత కీలక ఘట్టం'



నవతెలంగాణ - చైతన్యపురి

ఆర్టికల్ 370' రద్దు దేశ చరిత్రలోనే అత్యంత కీలక ఘట్టం అని ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్, పల్లవి స్కూల్స్ అధినేత మల్క కొమరయ్య అన్నారు. కొత్తపేట్‌లోని మహా లక్ష్మి, శాలిని, శివాని థియేటర్లో 'ఆర్టికల్ 370' సినిమా ఉచితంగా చూసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసి, 400 మందికి గురువారం టికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మల్క కొమరయ్య మాట్లాడుతూ ఆర్టికల్ 370 అంటే ఏమిటి..? ఎందుకు రద్దు చేయాల్సి వచ్చింది..? రద్దు చేసిన తర్వాత ఇప్పుడు అక్కడి పరిస్థితుల్లో ఏమైనా మార్పు వచ్చిందా..? అనే తదితర అంశాలపై నేటి తరానికి అవగాహన కల్పించాలని సంకల్పించినట్టు తెలిపారు. 'ఈ ఆర్టికల్ కారణంగా కశ్మీర్ ఉగ్రవాదానికి అడ్డాగా మారిందన్నారు. అక్కడి ప్రజల జీవితాలు చిన్నాభిన్నామయ్యాయని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం ఇచ్చిన మాటకు కట్టుబడి 370 ఆర్టికల్ ను రద్దు చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి ప్రథమ వార్షికోత్సవం



నవతెలంగాణ - నాగోల్

హైదరాబాద్‌లోని నాగోల్, గణేష్ నగర్ కాలనీలోని శ్రీ లక్ష్మీ గణపతి దుర్గా భవాని సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవం, ఆంజనేయ, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి చింతల సురేందర్ యాదవులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తర్వాత స్వామివార్ల దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ నగర్ కాలనీ ఆలయ కమిటీ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, అధ్యక్షులు మల్లికార్జున రావు, నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు నారాయణ రెడ్డి,ప్రధాన కార్యదర్శి మోహన్, సంయుక్త కార్యదర్శిలు అరుణ, జలంధర్ రెడ్డి, కోశాధికారి వెంకట్ రావు, వెంకటేశ్, దామోదర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సంతోష్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాల్గొన్నారు.

అవిశ్వాసం వెనుక రాజకీయ కుట్ర

- ఎవరి చరిత్ర ఏందో తెలుసుకోవాలి
- అధికారం అడ్డం పెట్టుకొని ఆడితే.. న్యాయ స్థానంలో తేల్చుకుంటా
- సహకార సంఘం చైర్మెన్ లెక్కల విఠల్ రెడ్డి
- అవకతవకలు జరిగుంటే విచారణ జరిపించాలని జిల్లా కో ఆపరేటివ్ అధికారులకు వినతిపత్రం అందజేత



నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్

గ్రామ పంచాయతీ మెంబర్, ఎంపీటీసీ, సర్పంచ్, సహకార సంఘం డైరెక్టర్, వైస్ చైర్మన్, చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నేను..ఏ ఒక్క రోజు కూడా అవినీతి, అక్రమాలకు పాల్పడిన రోజులు లేదని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్ రెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తను చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిక ముందు 3.5 కోట్ల రూపాయల నష్టాల్లో సహకార సంఘం అప్పుల్లో కూరుకుందన్నారు. 2013లో సంఘం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి దశల వారీగా ప్రతి ఏటా రెండు కోట్ల రూపాయల లాభాలకు తీసుకురావడం జరిగిందన్నారు. గతంలో రూ.లక్ష రుణం కూడా ఇవ్వలేని స్థితి నుంచి రూ.10 లక్షలు రుణాలు ఇచ్చే స్థాయికి తీసుకొచ్చినట్టు తెలిపారు. అకాల మరణం చెందే రైతులకు రూ.10 నుంచి 25 వేల ఆర్థిక సాయ ం, సకాలంలో రుణాలు చెల్లించే వారికి ఐదు వేల రూపాయల ప్రోత్సాహకాలు ఇచ్చేసి రైతులను ప్రోత్సహించినట్టు పేర్కొన్నారు.

ఓపెనింగ్ నుండి పైసా పైసా లెక్క ఉంది...

సంఘంలోని ప్రతి పైసా ప్రతిరోజు ఓపెనింగ్ నుంచి క్లోజింగ్ వరకు పైసా పైసా లెక్క ఉంటుందని, ఒక్క పైసా కూడా అవినీతికి పాల్పడే అవకాశం లేదన్నారు. డైరెక్టర్ కొత్తపల్లి జపాల్ రెడ్డి ప్రతి సమావేశంలో అవినీతి ఆరోపణలు చేస్తుండడంతో నేనే స్వయంగా జిల్లా కో ఆపరేటివ్ అధికారికి అవినీతి అక్రమాలుంటే వెలికి తీయాలని వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. 1987 నుంచి 1990 వరకు డైరెక్టర్ గా, తదనంతరం వైస్ చైర్మన్‌గా, 2013 నుంచి నేటి వరకు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టానని, 13 మంది డైరెక్టర్‌లకు గాను తన ప్యానల్‌లో 9 మంది డైరెక్టర్లను గెలిపించుకోవడం జరిగిందన్నారు.

చైర్మన్‌పై అవిశ్వాసం తీర్మానం..

గత నెల 8న బాట సింగారం సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్ రెడ్డిపై అవిశ్వాసం ప్రకటిస్తూ డైరెక్టర్లు తమ సంతకాలతో కూడిన తీర్మానాన్ని డీసీవోకు అందజేసిన విషయం విధితమే. ఈ మేరకు ఫిబ్రవరి 28న సహకార సంఘం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు డిసివో(జిల్లా కో ఆపరేటివ్ అధికారి) నుంచి డైరెక్టర్లకు నోటీసులు జారీ అయ్యాయి. క్యాంపులో ఉన్న 9 మంది డైరెక్టర్‌లు నేరుగా సమావేశానికి హాజరయ్యారు. డైరెక్టర్లు నార్లకొండ మల్లమ్మ, చేగురి భరత్, చింతల లక్ష్మమ్మ ,మొగుళ్ల చిన్న యాదిరెడ్డి,గంట శ్రీనివాస్ రెడ్డి కొత్తపల్లి జైపాల్ రెడ్డి, బిజిలి బాల నర్సింహ, ఇటికల మహేందర్ రెడ్డి, మేకల రాములు అవిశ్వాసంలో పాల్గొన్నారు. చైర్మన్ లెక్కల విఠల్ రెడ్డి, డైరెక్టర్‌లు మహిపాల్ రెడ్డి, పి.బాల్ రెడ్డి గైర్హాజరయ్యారు. మొదటగా అవిశ్వాసంకు హాజరైన డైరెక్టర్‌లతో చేతులెత్తే ఎన్నిక ప్రక్రియ పూర్తి చేసిన అధికారులు.. అందుకు సంబంధించిన ఫలితాలను వెల్లడించలేదు. చైర్మన్ ఎన్నిక కోర్టు పరిధిలో ఉండడంతో ఎన్నిక ప్రక్రియ వాయిదా వేస్తూ అవిశ్వాసంకు సంబంధించిన వివరాలను డీసీఓ సీల్డు కవర్ లో కోర్టుకు సమర్పించనున్నారు.

డబ్బులకు ఆశపడి అవిశ్వాసంకు తెర..

కొంతమంది డైరెక్టర్లు డబ్బులకు లాలూచీ పడి అధికార పార్టీ అండతో, గతంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడుగా (ప్రస్తుతం బీఆర్ఎస్ నాయకుడు) చీకటి రాజకీయ కుట్రలో భాగంగా అవిశ్వాసం అనే కుట్రను తెరపైకి తెచ్చారు. ఎవరెన్నీ పన్నాగాలు/కుట్రలు పడిన న్యాయస్థానంలో తేల్చుకుంటానన్నారు. ఓటేసి గెలిపించిన రైతుల విశ్వాసాన్ని తాకట్టుపెట్టి డబ్బులకు అమ్ముడుపోయారని ఆరోపించారు. ఎవరికైనా కాలమే సమాధానం చెప్పుతుందని, న్యాయస్థానంపై తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. దీపాన్ని చూసి చందమామ అనుకోవద్దని, అప్పుడే చైర్మన్ అయినట్లు ఓ డైరెక్టర్ పగటి కలలు కనవద్దని హితవు పలికారు. అధికారం ఉందని ఏదైనా చేయొచ్చు అనేది భ్రమని, దాని నుంచి బయటకు రావాలన్నారు. న్యాయ స్థాన నిర్ణయమే తుది తీర్పు అని అన్నారు.

'యోగాతో జ్ఞానం, మానసిక ప్రశాంతత'

నవతెలంగాణ - బడంగ్‌పేట్

యోగాతో జ్ఞానం, మానసిక ప్రశాంతత లభిస్తుందని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థలు మీర్ పేట్ సమితి వారి సౌజన్యంతో ఆచార్య రమేష్ గురూజీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సంస్కార వికాస సాధన - యోగ విజ్ఞాన శిబిరంలో విద్యార్థుల తల్లీదండ్రులకు, ఉపాధ్యాయులకు పాదపూజ కార్యక్రమాన్ని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ యోగాలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు సంస్కారాన్ని నేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, జి.చెన్నకేశవ, పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు గోవర్ధన్ యాదవ్, మహేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీ సత్యసాయి సేవా సమితి మీర్ పేట్ సమితి ప్రతినిధులు గంగ, యాదగిరిరావు, రమాదేవి, బ్రిజేష్, చైతన్య కుమార్, భూషణ్ పురోహిత్, రవికుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.





హైదరాబాద్ జేఆర్‌సీ కన్వెన్షన్‌లో జరిగిన ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ కూతురు వివాహ వేడుకకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. -నవతెలంగాణ, కాప్రా

'అంత్యోదయ కార్డు ద్వారా 35 కిలోల బియ్యం ఇవ్వాలి'



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

జిల్లా పరిధిలోని దివ్యాంగులకు అంత్యోదయ కార్డు కింద 35కిలోల బియ్యం ఇవ్వాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షు డు ఎస్.వినయ్ కోరారు. గురువారం ఆయన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎస్.విజయ లక్ష్మిని కలిసి వినతి పత్రం అందచేశారు. జిల్లాలోని దివ్యాంగ కుటుంబాలకు జీవో నెం.61, 2002 ప్రకారం 35 కిలోల బియ్యం ఇవ్వాలని పేర్కొన్నారు. అంతకుముందు ఉప్పల్ సివిల్ సప్లయ్ ఆఫీసులో సంబంధిత అధికారిని కలిసి అంత్యోదయ కార్డు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆర్.కృష్ణ నాయక్, జ్యోతి, శోభ, విజయలక్ష్మి, నాగయ్య, రజిత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్



● పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఉప్పల్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ తన కార్యకర్తలతో కలిసి గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఉప్పల్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా తోడుగా ఉంటామని తెలిపారు. అందరం కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేద్దామని సూచించారు. అనంతరం డివిజన్‌లోని పలు కాలనీల్లోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమ నాయకుడు నాగ్గిల బాల్‌రెడ్డి, జండ్ల సత్తిరెడ్డి, ప్రభుగౌడ్, బత్తుల శ్రీకాంత్ యాదవ్, రాజు గౌడ్, చల్ల వీరేశం, బాల్ నర్సింహ, నర్సిరెడ్డి, గోపి, రమేష్, పండు ముదిరాజ్, శ్రీను, రాజు, భాను చందర్, ముత్యాలు, నజీర్, వెంకట్ రెడ్డి, భాను, హరి నాయి, రెడ్యా నాయక్, మరో 150 మంది కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా డివిజన్‌లోని కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలకు తేనీటి విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీతారాంరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, అంజి రెడ్డి, గోపాల్, యాదగిరి, కే.వీ.ఎల్.ఎన్ రావు, నాగరాజ్, ఆనంద్ రాజ్‌గౌడ్, శ్రవణ్ కుమార్ గౌడ్,వంశీ, సర్ఫరాజ్, ముస్తాక్, వెంకన్న గౌడ్, సంజయ్ గౌడ్, క్రాంతి, సాకేత్ గౌడ్, చరణ్, హిరాలల్ నాయక్ కార్యదర్శులు, మహిళ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

చీర్యాల మల్లికార్జునుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-కీసర

శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో శ్రీగంగా భ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామి వారి ప్రతిష్ఠ మహోత్స వంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సతీమణి గురువారం పాల్గొన్నారు. వారికి ఆల య ఫౌండర్, చైర్మెన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరి, వేదపండితులతో కలిసి పూర్ణకుం భంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు స్వామివారి చిత్ర పటంతో ఆశీర్వచ నం అందజేశారు. నూత నంగా నిర్మించిన శ్రీ గంగా భ్రమరాంభికా సమేత మల్లికార్జున స్వామి ఆలయా న్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మెన్ బెస్త వెంకటేష్, కీసర ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ. నేమూరి మహేష్ గౌడ్, పాల్గొన్నారు.

జలమండలి ఎండీని కలిసిన పన్నాల దేవేందర్‌రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

జలమండలి ప్రధాన కార్యాలయంలో జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డిని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్లాపూర్ డివిజన్ పరిధిలో నెలకొన్న భూగర్భ డ్రయినేజీ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎండీ సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని పన్నాల తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్ ఉన్నారు.

డ్రయినేజీ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి పరిధిలోని విద్యా మారుతి కాలనీలో రూ.14లక్షల వ్యయంతో 337 మీటర్ల యూజీడీ పనులు, వీఆర్ కాలనీలో రూ.12లక్షల వ్యయంతో 330 మీటర్ల అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులకు చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులను 15 రోజుల్లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. చర్లపల్లి డివిజన్‌లోని అన్ని కాలనీవాసులకు అన్నివేళలా అండగా ఉంటానని, ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా తమ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కార్పొరేటర్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా మారుతి కాలనీ ప్రెసిడెంట్ ముస్కు నర్సిరెడ్డి, వీఆర్ కాలనీ ప్రెసిడెంట్ శంకరయ్య, మల్లేష్, డివిజన్ అధ్యక్షులు సింగిరెడ్డివెంకటరెడ్డి, నాగిళ్ల బాల్‌రెడ్డి, యాదగిరి, కేవీఎల్ఎన్ రావు, బొడిగె ప్రభుగౌడ్, బత్తుల శ్రీకాంత్ యాదవ్, వెంకటేష్ గౌడ్, పాండు ముదిరాజ్, ముత్యాలు, నజీర్, వెంకట్‌రెడ్డి, ముస్తాక్, ఈరాలాల్ నాయక్, కృష్ణ, శ్రీను, విజయ, రామ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్ట



నవతెలంగాణ-బోడుప్పల్

ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా విరాజిల్లాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గురువారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ పార్వతీ నగర్, న్యూ శ్రీరామ్ నగర్ కాలనీలో కార్పొరేటర్ కుర్ర శాలిని శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో శ్రీసీతారామాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠకు ముఖ్య అతిథిగా మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా, మానసిక ప్రశాంతతకు నెలవుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు నాయకులు, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రూ.75.21 కోట్లతో బోడుప్పల్ వార్షిక బడ్జెట్

● ప్రతి డివిజన్‌కూ రూ.7 కోట్లు కేటాయింపు



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను సుమారు రూ.75 కోట్ల 21లక్షలతో వార్షిక బడ్జెట్‌కు పాలకమండలి ఆమోదం తెలిపింది. గురువారం ఉదయం 11గంటలకు కౌన్సిల్ సమావేశం మేయర్ సామల బుచ్చి రెడ్డి అధ్యక్షతన, కమిషనర్ జి.రామలింగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. వార్షిక బడ్జెట్ ప్రారంభ విలువతో కలుపుకొని ఆమోద ముద్ర వేశారు. బడ్జెట్‌లో ఇంటి పన్నుల ద్వారా 16.00 కోట్లు, పన్నేతర రాబడి రూ.41 కోట్ల 70లక్షలు, ఇతర గ్రాంట్లు కలుపుకొని మొత్తం రూ.75 కోట్ల 21 లక్షలుగా రాబడి అంచనా వేశారు. అదే విధంగా అభివృద్ధి పనులకు, జీతభత్యాలకు, ఇతరములకు అంచనా ఖర్చు రూ.72 కోట్ల 38 లక్షలుగా నిర్ణయించారు. మొత్తంగా రూ.2కోట్ల 83 లక్షల మిగులు బడ్జెట్ అంచనాగా వేశారు. బడ్జెట్‌కు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో డివిజన్ల వారీగా సుమారు రూ.7 కోట్ల నిధులను పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవిగౌడ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబర్లు, మేనేజర్ నాగేంద్ర బాబు, డీఈలు బాలమురళీ, శారద, టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ కావ్య, జలమండలి అధికారులు, విద్యుత్, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఈఎంఆర్ఐలో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-మేడ్చల్

ఈఎంఆర్ఐ(108) సంస్థలో పని చేయడానికి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టుగా సంస్థ ప్రోగ్రాం మేనేజర్ షేక్ జంషీద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 4వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మేడ్చల్ పోస్ట్ ఆఫీస్ రైల్వే స్టేషన్ సమీపంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పైలెట్ డ్రైవర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఉద్యోగుల కోసం అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు తోపాటు జిరాక్స్ సెట్‌ను తెచ్చుకోవాలని సూచించారు. పైలెట్ డ్రైవర్‌కు విద్యార్హతలు 10 తరగతి పాసై, వయస్సు 23 నుంచి 35 ఏండ్లతో పాటు లైట్ మోటార్ వెహికల్ బ్యాడ్జి కలిగి ఉండాలని తెలిపారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోసం దరఖాస్తు చేసుకునేవారు బీఎస్సీ, బీజెడ్సీ, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ చదివి 30 ఏండ్లలోపు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు సంస్థ ప్రోగ్రాం మేనేజర్ షేక్ జంషీద్ ఫోన్ నెంబర్లు 9154248904, 9000001674 సంప్రదించాలని సూచించారు.

వై.కే.డిజైనర్స్ ఫ్యాబ్రిక్ స్టూడియో ప్రారంభం



నవతెలంగాన-సిటీబ్యూరో

వై.కే. డిజైనర్ ఫ్యాబ్రిక్ స్టూడియో ప్రతి ఒక్కరికీ ఆధునిక ఫ్యాషన్ అందించాలనే లక్ష్యంతో డిజైనర్ ఫ్యాబ్రిక్స్ కోసం ప్రత్యేకమైన షోరూంను హైదరాబాద్‌లోని జేఎన్టీయూ మెట్రో స్టేషన్ సమీపంలోని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యాంకర్ రవి మాట్లాడుతూ.. ఇప్పుడు ప్రతి ఒక్కరూ డిజైనర్ దుస్తులు ఇష్టపడుతున్నారని తెలిపారు. తాను కూడా ఎప్పటి నుంచో వై.కే ఫ్యాబ్రిక్ స్టూడియో వారే డిజైన్ చేస్తున్న వాటినే కొనుగోలు చేస్తున్నానని పేర్కొన్నారు. మీకు నచ్చిన విధంగా మీ బడ్జెట్‌లో మంచి డిజైన్ దుస్తులను అందిస్తారని తెలిపారు. రాకింగ్ రాకేష్ మాట్లాడుతూ తనకు వై.కే ఫ్యాబ్రిక్ స్టూడియో బాగా తెలుసని, వీళ్ల దగ్గర అన్ని విధాలా డిజైన్లు ఉన్నాయని పేర్కొన్నారు. వై.కే ఫ్యాబ్రిక్‌లోని డిజైనర్ వస్త్రాలు ఎంబ్రాయిడరీ, అల్లడం, డైయింగ్, మిర్రర్ వర్క్ మొదలైన అనేక రకాల శైలిలో రూపొందించబడ్డాయని వై.కె.డిజైనర్స్ ఫ్యాబ్రిక్ స్టూడియో ప్రతినిధులు యశ్వంత్, కౌశల్య చెప్పారు. వై.కే డిజైనర్లు ఫ్యాబ్రిక్ స్టూడియో ప్రతి ఒక్కరికీ ఆధునిక ఫ్యాషన్‌లో విస్తృత ఎంపికలను అందించాలనే ఏకైక లక్ష్యంతో ప్రారంభించినట్లు స్టోర్ ప్రతినిధి తెలిపారు.

డివిజన్ అభివృద్ధే లక్ష్యం : కార్పొరేటర్ బన్నాల



నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళున్నామని కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. గురువారం డివిజన్‌లోని కావేరి నగర్ కల్వర్టు దగ్గర కుమ్మరి సంఘం వైకుంఠధామం పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అధికారులు పనులను ప్రతి రోజు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ రాజు కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, బీఆర్ఎస్ నాయకులు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, ఎదుల కొండల్‌రెడ్డి, కోకొండ జగన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, నారాయణ్ రెడ్డి, శ్యామ్, బాలు, కుమ్మరి సంఘం నాయకులు గుమిదేలి మల్లేష్, పెంటయ్య, యాదయ్య అశోక్, భాస్కర్ తదితరులున్నారు.

మహిళను ఆస్పత్రిలో చేర్పించిన కౌన్సిలర్ గణేష్



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ 4వ వార్డు కౌన్సిలర్ తుడుం గణేష్ తన వార్డు పరిధిలోని మిత్‌లా బాయ్ అనే మహిళకు అనారోగ్య సమస్య ఉందని తెలియడంతో గురువారం సీఎంఆర్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ సందర్భంగా సదరు మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ నిఖిత మాట్లాడుతూ.. మిత్‌లా బాయ్‌కి గర్భసంచి సమస్య ఉందని తెలిపారు. గర్భసంచిని కొద్దిగా కత్తిరించి డీ అండ్ సీ పరీక్షలకు పంపిస్తున్నట్టు తెలిపారు. రిజల్ట్ వచ్చాక ఆపరేషన్ చేస్తామని డాక్టర్ పేర్కొన్నారు. కౌన్సిలర్ తుడుం గణేష్ మాట్లాడుతూ.. తన వార్డుకు చెందిన మహిళ మిత్‌లా బాయ్ వైద్య పరీక్షలు చేసేందుకు సహకరిస్తున్న సీఎంఆర్ హాస్పటల్ చైర్మెన్ సీహెచ్.గోపాల్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్ ఆస్పత్రి డైరెక్టర్ అలీ బేగ్, పీఆర్‌వో జె.దుర్గాప్రసాద్ రెడ్డి, మార్కెటింగ్ ప్రసాద్, మధు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రిలో పరిస్థితి విషమించి వ్యక్తి మృతి



నవతెలంగాణ-జవహర్‌నగర్

అపస్మారక స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని 30 ఏండ్ల వ్యక్తి ఈ నెల 25వ తేదీన జమ్మిగడ్డ సాకేత్ ప్రాణామ్ వద్ద విషం తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అక్కడున్నవారు 100కు కాల్ చేస్తే జవహర్‌నగర్ పోలీసులు108 వాహనంలో గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమిం చడంతో గురువారం మరణించాడు. ప్రస్తుతం అతడి శవాన్ని గాంధీ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపర్చారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబరు 8712662188, సర్కిల్ ఇన్‌స్పెక్టరు 8712662097, ఎస్ఐ ఇద్రిస్ ఫోన్: 871266210, ఏఎస్ఐ ఇమామ్ ఫోన్: 9440996390 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

మూడు చింతలపల్లి సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-శామీర్‌పేట

మూడు చింతలపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ హారిక మురళీ గౌడ్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రత్యేక అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మంద శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో వత్స లాదేవి, తహశీల్దార్ వెంకట నరసింహారెడ్డి, భగీరథ డీఈవో అర్చన, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు గోనె హనుమత్ రెడ్డి, ఎంపీటీసీ అఖిలేష్ రెడ్డి, కోఆప్షన్ నెంబర్ గౌస్ పాషా, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు

అల్వాల్‌లో శ్రీమత్ గీత జ్ఞాన యజ్ఞం, భాగవత కథా సప్తాహం



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ పట్టణంలో టెంపుల్ అల్వాల్‌లో గల ప్రసిద్ధ క్షేత్రం శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం ఎనిమిది రోజుల పాటు నిర్వహించే శ్రీమత్ గీతా జ్ఞాన యజ్ఞం, శ్రీమత్ భాగవత కథ సప్తహంకు అంకురార్పణ చేశారు. ఈనెల 29 వ తేదీ నుంచి మార్చి 7వ తేదీ వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఏకాదశితో మొదలై 7 మార్చిన రుక్మిణి కల్యాణంతో పరిపూర్ణమైతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సహస్ర పురుష సూక్తయుక్త శ్రీ మద్భగవద్గీత జ్ఞాన యజ్ఞంలో పాల్గొని పూజలు చేశారు. ఈ కల్యాణం శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయం, భగవద్గీత భక్త సమాజం, అల్వాల్ బ్రాహ్మణ సంఘం, అల్వాల్ వైశ్య సంఘం, అల్వాల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్, రామాంజనేయ ట్రస్టు అల్వాల్ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారు. ఈ మహా క్రతువులో శాస్త్రుల రఘురాం శర్మ, పెద్ది రమేష్, ప్రవీణ్, బ్రహ్మాచారి, పద్మాచారి, శ్రీనివాస్, లింగారెడ్డి, రాంబాబు, నాయకులు మల్లేష్ గౌడ్, వీఎస్. రాజు, తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని పరిరక్షించండి

● కమిషనర్ త్రిలేశ్వరావుకు వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ నేతలు



నవతెలంగాణ-బోడుప్పల్

కార్పొరేషన్ పరిధిలోని పార్క్ స్థలాలను కాపాడేందుకు అధికారులు కృషి చేయాలని కాంగ్రెస్ పీర్జాదిగూడ కార్పొరేషన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో కమిషనర్ త్రిలేశ్వర్ రావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 3వ డివిజన్‌లో సాయి ఐశ్వర్య కాలనీలో ఉన్న పార్కు కోర్టు పరిధిలో ఉండడంతో ఆ స్థలాన్ని కొంత మంది పెండింగ్ డాక్యుమెంట్స్ పెట్టి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. వాటిపై విచారణ జరిపి ఆ ప్లాట్లని రద్దు చేసి పార్క్ స్థలానికి హద్దులు పెట్టి కంచె వేయాలని కోరారు. అనంతరం నారపల్లి లోని సబ్ రిజిస్ట్రార్‌కు డాకుమెంట్స్ రద్దు చేయాలని వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. ఎస్. కే. దుర్గ, భాస్కర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాయి సుధీర్ కళాశాలలో జాబ్ మేళా



● 2 వేల మంది అభ్యర్థులు హాజరు

నవతెలంగాణ-కాప్రా

రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో సాయి సుధీర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సాయి సుధీర్ విద్యా సంస్థల అధినేత ఆర్. ఉషారాణి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బండారి అఖిల్‌రెడ్డి, విశాల్ రాజ్, ప్రవీణ్, చైతన్య శ్రవణ్, హర్ష ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ.. జాబ్‌మేళాను తమ కళాశాలలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కళాశాలకు చెందిన విద్యార్థులే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి 2వేలకుపైగా విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. జాబ్ మేళాకి వచ్చిన అభ్యర్థులందరికీ అభినందనలు తెలిపారు. ఈ జాబ్ మేళాను భవిష్యత్తులో నిర్వహించడానికి తమ విద్యాసంస్థల తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ జాబ్ మేళాలో హెచ్‌డీఎఫ్‌సి, ఆక్సిస్ బ్యాంకు, వన్ స్టాప్' డి 'సొల్యూషన్స్,పేటీఎం, ఐసీఐసీఐ ప్రోడెన్షియల్ వంటి 58 సంస్థలు పాల్గొన్నాయని తెలిపారు. 100కిపైగా ఉద్యోగాల కోసం 2వేల మందికి ఇంటర్వ్యూకు హాజరైనట్టు తెలిపారు.



ప్రభుత్వ భూములు కాపాడే బాధ్యత అధికారులదే



● మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి

నవతెలంగాణ-శామీర్‌పేట

ప్రభుత్వ భూములను కాపాడే బాధ్యత అధికారులదేనని జగన్ గూడ మాజీ సర్పంచ్ చందుపట్ల విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం మూడు చింతలపల్లి మండలం జగన్ గూడ గ్రామంలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగన్‌గూడ గ్రామంలోని గ్రామకంఠం కంఠం భూమిని (తోట బావి) నందు యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారిచే క్రీడా మైదానంలో వాకింగ్ ట్రాక్, యువకులకు వ్యాయామం చేసుకోవడానికి ఓపెన్ జిమ్, మహిళలు బతుకమ్మలు వేసుకోవడానికి హౌస్ ఏర్పాటు, ఆ స్థలం చుట్టూ పూల మొక్కలు, ఔషధ మొక్కలు నాటి అందంగా తీర్చిదిద్దినందుకు యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ స్థలంలో చిన్నారులు ఆడుకునేందుకు ఆట పరికరాలు ఏర్పాటు చేయాలని సంస్థ ప్రతినిధులను కోరారు. గ్రామకంఠం భూమిలో అప్పటి కలెక్టర్ చొరవతో బతుకమ్మ ఘాట్, క్రీడామైదానం ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రస్తుతం ఆ భూమిని అధికారులు పరిరక్షించి హరితహారం మొక్కలు నాటించాలని కోరారు. అనంతరం మూడు చింతలపల్లి మండల తహశీల్దార్, జగన్ గూడ గ్రామ ప్రత్యేక అధికారి వెంకట నరసింహారెడ్డి మాట్లాడుతూ... గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయుటకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామ కంఠం భూమికి సంబంధించిన వివరాలను తెలుసుకొని ఆ దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడుటకు తాము కృత నిశ్చయంతో ఉన్నామని స్పష్టం చేశారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బందిని, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను ఈ సందర్భంగా సన్మానించారు. ఇటీవల మూడుచింతలపల్లి మండలానికి ఇటీవల వచ్చిన తహశీల్దార్ వెంకట నరసింహారెడ్డిని మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వే ఆఫ్ యునైటెడ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి మనీ, మాజీ ఉపసర్పంచ్ బుద్ధి శ్రీనివాస్. మాజీ వార్డు సభ్యులు జహంగీర్, అనీల్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాత నేరస్తుడికి జైలు

నవతెలంగాణ-అల్వాల్

ఇండ్లలో నగలు, నగదు చోరీ చేసి పలు మార్లు జైలుకు వెళ్లొచ్చిన పాత నేరస్తుడిని బుధవారం అరెస్ట్ చేసి గురువారం జైలుకు పంపించారు. అల్వాల్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. శాలిబండకు చెందిన మహమ్మద్ అవేజ్ అహ్మద్, (42) 2005 సంవత్సరంలో మొదటి సారి చోరీ కేసులో జైలుకు వెళ్లాడు. జైలు నుంచి వచ్చాక దొంగతనమే వృత్తిగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పలు ఇండ్లలో బంగారం, నగదు దొంగతనాలు చేశాడు. అతడిపై 2016లో మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో, 2021లో కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో పీడీయాక్టు కేసులు నమోదయ్యాయి. అయినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఇతడు తన తోటి దొంగ అయిన సలాంభీంతో కలిసి నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం చేశారు. అనంతరం రాయల్‌ఇన్‌ఫీల్డ్ బైక్‌పై అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అయ్యప్ప నగర్ కాలనీకి వచ్చి ఫిబ్రవరి నెలలో ఒక ఇంట్లో బంగారు నగలు, నగదు దొంగతనం చేశారు. ఇతడు సరూర్ నగర్, మేడిపల్లి పోలీస్ స్టేషన్ లలో చేసిన దొంగత నం చేసినట్టు ఒప్పుకున్నాడు. ఇప్పటి వరకు అతడిపై 100 కు పైగా దొంగతనం కేసులు నమోదయ్యాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బుధవారం వారిని పట్టుకుని గురువారం జైలుకు పంపించారు.

డాక్టర్ సీహెచ్. భద్రారెడ్డికి ఇండియన్ ఎచివర్స్ అవార్డు



నవతెలంగాణ-బంజారాహిల్స్

మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్, మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మెన్ సి. హెచ్.భద్రారెడ్డికి ఇండియన్ ఎచివర్స్ అవార్డు వరించింది. వైద్య, విద్య రంగంలో అందించిన సేవలకు ఈ అవార్డు అందుకున్నారు. ఈనెల 28న ఇంటర్ ఆక్టివ్ ఫారం ఆన్ ఇండియన్ ఎకానమీ ద్వారా న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ మినిస్టర్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ నితిన్ గడ్కారి ఈ అవార్డు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. తన వృత్తిని మరింత మెరుగ్గా పెంపొందించుకోవడానికి ఈ అవార్డు దోహదం చేస్తుందని తెలిపారు. ఈ అవార్డు ఈయనతో పాటు సినీ, క్రీడా రంగాలకు సంబంధించిన ప్రముఖులకు, సామాజిక సేవ చేస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత గౌరవ్ ఖన్నా, పద్మభూషణ్ అవార్డు గ్రహీత సత్పాల్ సింగ్ వంటి ప్రముఖులు అవార్డును అందుకున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
శుక్రవారం | మార్చి 01, 2024 | www.navatelangana.com

సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు



నవతెలంగాన-సిటీబ్యూరో

11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి, నిరుద్యోగులకు శుభవార్త సువర్ణ అవకాశాలు కల్పించిన ప్రజా ప్రభుత్వం అని, నిరుద్యోగులకు స్వీట్లు పంచి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, పాలమూరు యూనివర్సిటీ పూర్వ విద్యార్థి నాయకుడు మహేష్ గౌడ్ కాసుల ధన్యవాదాలు తెలిపారు.



నిజాంపేట్ వాసులు దోసకంటి శ్రీను కుమారుడి వివాహ మహెూత్సవంలో గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నవ దంపతులను ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాస్, సురేష్, రాజు, జంగయ్య, మహేష్, కుమార్,నరేష్, సురేష్, రమేష్, సంతు, గోపాల్, వెంకటేష్ పాల్గొన్నారు.
నవతెలంగాణ-దుండిగల్

ఎమ్మెల్యేను కలిసిన నూతన సభ్యులు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 130-సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని నూతనంగా ఎన్నుకోబడిన ఎస్.ఆర్. నాయక్ సంక్షేమ సంఘం, కార్యవర్గ సభ్యులు గురువారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను వారి నివాసంలో కలసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కాలనీ అభివృద్ధికి సంక్షేమ సంఘాలు వారధిగా నిలవాలని కాలనీలో నెలకొన్న ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి, కాలనీ అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం నూతన సంక్షేమ సంఘం సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఆర్.నాయక్ నగర్ కాలనీ నూతన అధ్యక్షులు గోగినేని శ్రీనివాసరావు (టి.టి.కె), సెక్రెటరీ మహేందర్ రెడ్డి, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ వేమూరి మల్లికార్జున్ రావు, వైస్ ప్రెసిడెంట్ పి.సురేందర్ రెడ్డి, జి.హరిబాబు, ట్రెజరర్ మధుసూదన్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పూర్ణచందర్ గుప్త, జాయింట్ కమిటీ సభ్యులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఓం మణికంఠ నాయి సేవ సంక్షేమ సంఘం సభ్యులు...

నూతనంగా ఎన్నుకోబడిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఓం మణికంఠ నాయి సేవ సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు, వారి కార్యవర్గ సభ్యులతో కలిసి గురువారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను వారి నివాసంలో కలిసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతనంగా ఎన్నుకోబడిన వారందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఒకరికొకరు సహకరించుకుంటూ నాయి బ్రాహ్మణ సంక్షేమాన్ని అభివృద్ధి పరచుకోవాలని తెలిపారు. ఎటువంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వీఎస్ఆర్ వెంకటేష్, జి. రవీందర్, యాదగిరి, అశోక్, మధు, నరసింహ, బాలేశ్వర్, కోటి పాల్గొన్నారు.



విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు : ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 129 సూరారం డివిజన్ ఎంజేఎస్ గార్డెన్‌లో నిర్వహించిన సుభాష్ నగర్ 'వివేకానంద విద్యా మందిర్' స్కూల్ 27వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు విద్యను కష్టంగా కాకుండా ఇష్టంగా చదివినట్లయితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను నేర్పించినట్లయితే విద్యార్థులతోపాటు పాఠశాల కు కూడా మంచి పేరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ జి.సురేష్ రెడ్డి, సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



మార్చి 3వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని 130 డివిజన్ కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ... పోలియో రహిత డివిజన్‌గా మార్చేందుకు అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. 130 సుభాష్ నగర్ డివిజన్‌లో పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్టాండ్, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలోని పోలియో కేంద్రాలు, మొబైల్ టీంలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చిన్నారులకు ఉదయం 8 నుచి సాయంత్రం 4 వరకు పోలియో చుక్కలు వేయించే బాధ్యత తల్లిదండ్రులదే అన్నారు. చుక్కల మందు వేయించని చిన్నారులకు 4,5వ తేదీల్లో కూడా ఇండ్ల వద్దకే అధికారులు వచ్చి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు తప్పక వినియోగించుకోవాలని సూచించారు. రెండు చుక్కలు వేయిద్దాం .. పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం అన్నారు.

ఘనంగా 'గ్రాండ్ పేరెంట్స్ డే' వేడుకలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ నందు గురువారం ఘనంగా 'గ్రాండ్ పేరెంట్స్ డే' నిర్వహించారు. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టీ.వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో వారి ఆదేశాల మేరకు టీవీఆర్ మోడల్ హై స్కూల్ అపురూప కాలనీ, సత్యవాణి విద్యానికేతన్ ఎస్సార్ నాయక్ నగర్, బచ్పన్ ఒలంపియాడ్ చింతల్, బచ్పన్ ప్లే స్కూల్ సూరారం, టీవీఆర్ గీతాంజలి హై స్కూల్ పద్మా నగర్ ఫేస్ - 2 నందు గ్రాండ్ పేరెంట్స్ డే అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలకు పాటలు ఆటలు నిర్వహించి, వారి అభిప్రాయాలను సూచనలను స్వీకరించి వారిని ఘనంగా సత్కరించారు. నర్సరీ, ఎల్కేజీ చిన్నారుల ఆట పాటలను బుడిబుడి అడుగులు వేస్తూ ప్రపంచ దేశాల వేషధారణ, పాతకాలమునాటి సినీ యాక్టర్ల అనుకరణ వంటి కార్యక్రమాలు అమ్మమ్మ తాతయ్యలను ఎంతగానో మురిపించాయి. ఈ కార్యక్రమంలో ప్రతీ పాఠశాలకు అశేష ప్రశంసలు గ్రాండ్ పేరెంట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రాండ్ పేరెంట్స్‌కి టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ టీ.కోటి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్స్ డా.సుర రవిచంద్ర రెడ్డి, శ్రీమతి దీప్తి రెడ్డిలు గ్రాండ్ పేరెంట్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

హెూమ్ లోన్ వడ్డీ రేట్లు తగ్గించండి

- హెచ్ఏఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కర్క నాగరాజు

నవతెలంగాణ-బాలానగర్

ఇంటికి సంబంధించిన రుణం, వడ్డీ ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించాలని హెచ్ఏఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఐఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శి కర్క నాగరాజు డిమాండ్ చేశారు. కరోనా సమయంలో హెూమ్‌లోన్ ఇంట్రస్ట్ రేట్స్ 6.5 శాతం ఉండేదని, గత ఐదు సంవత్సరాలలో రేపోరేటు ఆరుసార్లు పెరిగి 10 శాతానికి చేరుకుంటుందని, దీని వల్ల దేశంలో 70 శాతం ఉన్న మధ్యతరగతి కార్మికులు, ఉద్యోగస్తులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రెపో రేటు పెరగటం వల్ల నెలసరి వాయిదా రూ. 6 వేల నుంచి రూ.7 వేల వరకు అధికంగా కట్టాల్సివస్తుందన్నారు. దీంతో అధిక భారం పడటం వల్ల కార్మికుల జీవితాలు చెల్లాచెదురై ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెల వాయిదా అధికం కావడం వల్ల కార్మికు లు, ఉద్యోగస్తులు అప్పుల్లో కురుకుపోతున్నారని అన్నా రు. కేంద్ర ప్రభుత్వం మరియు రిజర్వు బ్యాంకు అఫ్ ఇండియా రేపో రేటును తగ్గించి కార్మికులు, మధ్యతరగతి ఉద్యోగస్తుల జీవితాలలో వెలుగులు నింపాలని ఆయన కోరారు.



మోడీ సర్కార్ ప్రజా, కార్మిక విధానాలను ఎండగడదాం

- ఏ.ఐ.టి.యు.సి.రాష్ట్ర నాయకులు కే.ఏసురత్నం
- జగద్గిరిగుట్టలో భవన నిర్మాణ కార్మిక సంఘాల నిరసన



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ అనుసరిస్తున్న ప్రజా, కార్మిక తిరోగమన విధానాన్ని ఎండగడదామని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కే.యేసురత్నం అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తపిలుపులో భాగంగా భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ.. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్, జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ అనుబంధం)ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు జిల్లా ఐఏటీయూసీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ ప్రభుత్వం పెట్టుబడి దారులకు, కార్పొరేట్ సంస్థలకు, సంపన్న వర్గాలకు దేశ సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. కార్మికుల హక్కులను, చట్టాలను కాలరాస్తూ కార్పోరేట్ పక్షాన నిలిచి కార్మికులకు అన్యాయానికి గురి చేస్తున్నాడని ఆరోపించారు. 60 ఏండ్ల వయస్సు పైబడిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు 6వేలు పెన్షన్ ఇవ్వాలని, గతంలో పెండింగ్లో ఉన్న పెన్షన్లు ఇతర బకాయిలు వెంటనే ఇవ్వాలని, కార్మిక అడ్డా వద్ద మౌలిక వసతులు, షెల్టర్లు, మంచినీటి సదుపాయం ఏర్పరచాలని, ప్రమాదంలో మరణించిన భవన నిర్మాణ కార్మికునికి రూ.10 లక్షల రూపాయల తోపాటు సహజ మరణం పొందినట్లయితే రూ. 5 లక్షల ఇవ్వాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో భవన నిర్మాణ కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి కార్మికునికి తెల్లరేషన్ కార్డు, డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలని తదితర డిమాండ్లతో నిరసన చేపట్టారు. సమస్యలు పరిష్కరించలేని పక్షంలో ప్రజలతో మమేకమై పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఏఐటీయూసీ అధ్యక్షులు వి.హరినాథ రావు, మేడ్చల్ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు నాగప్ప, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వంగాల శ్రీనివాస్, జగద్గిరిగుట్ట భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ముసలయ్య, భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా బాచుపల్లి జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం వద్ద జేవీవీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జేవీవీ వివిధ ప్రయోగాలతో విద్యార్థులు ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఆశాలత, సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, భద్రయ్య, దినకర్, శ్యామల జన విజ్ఞాన వేదిక నాయకులు సిహెచ్ ఎం.చారి, ప్రముఖ సైంటిస్ట్ డాక్టర్ ప్రశాంత్, కే శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ నూతన గృహప్రవేశం కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-దుండిగల్

వాటర్ పైప్ లైన్ పనులను పర్యవేక్షించిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో నిజాంపేట్28, 30వ డివిజన్ పరిధిలో రూ.10లక్షల వ్యయంతో హెచ్ఎండబ్ల్యూఎస్, మెగా ఓఆర్ఆర్ ఫేస్ -2 వారు నూతనంగా చెప్పాడుతున్న పనులను డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ పర్యవేక్షించారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ పైప్ లైన్ పనులను నాణ్యతతో, త్వరగా పూర్తి చేయాలనీ కాంట్రాక్టర్ ను ఆదేశించారు. గత కొద్ది రోజులుగా 28, 30 వ డివిజన్‌లో ప్రజలకు మంజీరా నీటి సమస్య మెయిన్ లైన్ జామ్ అవడం వల్ల నూతనంగా పైప్ లైన్ పనులు చేపడుతున్నారు దీనివల్ల ప్రజలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ లైన్ మెన్‌లు సమర సింహారెడ్డి, మేకల బాలకృష్ణ, మునిసిపల్ ఇంజనీర్ రవి, కాంట్రాక్టర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి బాల మేధావేలే రేపటి శాస్త్రవేత్తలు



- త్రివేణి పాఠశాల సీఎస్ఓ సుబ్బారావు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నేటి బాల మేధావులే రేపటి శాస్త్రవేత్తలని త్రివేణి పాఠశాల సీఎస్ఓ సుబ్బారావు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని చింతల్ బ్రాంచ్ త్రివేణి పాఠశాలలో గురువారం సైన్స్ ఫెయిర్, యాక్టివిటీ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఆయనతోపాటు వైస్ ప్రిన్సిపల్ నళిని, సీఆర్ఓ వెంకట్రావులు తిలకించారు. విద్యార్థులు వారిలోని సృజనాత్మకతను వెలికితీసి 200 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ నమూనాలను వారు తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే స్ఫూర్తి కొనసాగిస్తూ భవిష్యత్తులో ఎంతో ఎత్తు ఎదగాలని ఆకాంక్షించారు. విద్యతోపాటు శాస్త్ర సాంకేతిక రంగాలలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ఇన్‌చార్జి క్రాంతి, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మన యాత్రి యాప్ ప్రారంభం



నవతెలంగాన-సిటీబ్యూరో

ఆటోలు, క్యాబ్‌ల కోసం హైదరాబాద్ సొంత కమ్యూనిటీ ఆధారిత బుకింగ్ యాప్ 'మన యాత్రి'ని గురువారం టి హబ్‌లో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రతినిధులు, డ్రైవర్ల యూనియన్ల సభ్యులు, సాంకేతిక నిపుణులు పలువురు పాల్గొన్నారు. ఓఎన్‌డీసీ నెట్ వర్క్‌లో భాగమైన ఈ యాప్‌కు బెంగళూరులోని నమ్మ యాత్ర విజయం సాధించిన స్ఫూర్తితో టీ-హబ్‌లోని హైదరాబాద్ బృందం నుంచి ఇన్ పుట్స్, సపోర్ట్‌తో అదే సంస్థ ఈ యాప్‌ను రూపొందించింది. హైదరాబాద్ ప్రజలకు సరసమైన, సౌకర్యవంతమైన రవాణాను అందించడంతో పాటు డ్రైవర్ల సంపాదనను మరింతగా పెంచడానికి సాధికారత కల్పించడం ద్వారా హైదరాబాద్ నగర రవాణాలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని మన యాత్రి యాప్ లక్ష్యంగా పెట్టుంకుంది. నగరంలోని జనాభా అవసరాలకు తగినట్లు సామాజిక ప్రభావం చూపేలా మనయాత్రి యాప్ సాంకేతికతను ఎలా ఉపయోగించుకుంటుందో టీ హబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావు చెప్పారు. టీజీపీడబ్ల్యు యూనియన్ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ మన యాత్రి బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇది గిగ్ వర్క్‌లో సరికొత్త ప్రమాణాలను ఏర్పరుస్తుందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ రవాణా కమిషనర్ డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ మాట్లాడుతూ, నగరంలోని డ్రైవర్లకు ఒక సంతోషకరమైన వాతావరణాన్ని ఏర్పరచాల్సిన అవసరం ఉందన్నారు. సమాజాన్ని, ప్రభుత్వాన్ని, బజారును ఒకేతాటి మీదకు తెచ్చి ప్రజల రవాణా అవసరాలు తీరుస్తున్నందుకు మనయాత్రిని ఐఎస్‌బీ డీన్ మదన్ పిల్లుట్ల అభినందించారు. ఈ సందర్భంగా ఓఎన్‌డీసీ సీఈఓ టి. కోషి మాట్లాడుతూ.. "హైదరాబాద్ సంస్కృతి, ఇక్కడి సాకేంతిక నిపుణులకు మన యాత్రి సరిగ్గా సరిపోతుంది. దీనికి మద్దతు ఇస్తున్నందుకు మేమెంతో ఆనందిస్తున్నాం. ఇది సమీకృత డిజిటల్ ఆర్థికవ్యవస్థకు దోహదపడుతుంది. ఓఎన్‌డీసీ నెట్‌వర్క్‌లో ఉన్న మనయాత్రి నగర రవాణా వ్యవస్థను సమూలంగా మార్చడంలో ఓపెన్ నెట్‌వర్కుల శక్తికి ఉదాహరణగా నిలుస్తుంది" అన్నారు. జస్ పే సంస్థలో చీఫ్ గ్రోత్ ఆఫీసర్ ఎంఎస్ షాన్ మాట్లాడుతూ.. "మనయాత్రి అనేది కేవలం ఒక యాప్ మాత్రమే కాదు. ఇది హైదరాబాదీ డ్రైవర్లు, పౌరుల జీవితాలను మెరుగుపరిచే ఒక ఉద్యమం. టెక్నాలజీని వాడుకోవడం ద్వారా హైదరాబాద్ రవాణాను మరింత సమర్థంగా చేయడమే మా లక్ష్యం" అని చెప్పారు.

కుత్బుల్లాపూర్‌లో పౌర హక్కుల దినోత్సవం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం131 డివిజన్ పరిధి అంబేద్కర్ నగర్ లోని అంబేద్కర్ కమిటీ హాల్‌లో దళిత సంఘాల చైర్మెన్ గట్టు అశోక్ అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొని పౌరహక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల రక్షణ కోసమే చట్టాలు ఉన్నాయని తెలిపారు. పౌరులు తమ హక్కును కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల డిప్యూటీ తాసిల్దార్ అశ్విని, ఆర్ఐ రేణుక దేవి, రజనీకాంత్, జీహెచ్ఎంసీ అసిస్టెంట్ కృష్ణ, వాటర్ వర్క్స్ రాములు, ఎస్.ఐ మహాదేవి, ఎస్సీ కార్పొరేషన్ షరీఫ్, ఎస్సీ డెవలప్మెంట్ నరసింహ దళిత నాయకులు డీవీఎంసీ మెంబర్. కే కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ, జీఆర్‌పీ సికింద్రాబాద్ యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని(ముజీబ్) ఆదేశాల మేరకు అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్ రాజ్‌కుమార్, పబ్లిక్ సెక్రటరీ వైదిక్ శస్త్ర ఆధ్వర్యంలో గురువారం సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, జీఆర్‌పీ సికింద్రాబాద్ యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, జీఆర్‌పీ సికింద్రాబాద్ యూనిట్ అధ్యక్షుడిగా సి.దినేష్, కార్యదర్శిగా జి. శ్రీదేవి, ఉపాధ్యక్షులుగా ఎన్.భాస్కరరావు, బి.నవీన్, ఎస్.నరహరి, సంయుక్త కార్యదర్శిగా అహమద్ అలీ భాష, సుస్మి జాదవ్, కోశాధికారిగా ఏ.సతీష్ కుమార్, ఈసీ సభ్యులుగా జె.అవినాష్ రాజ్, ఈ.సాయి రాఘవ, ఎల్.కె.ఎస్.సందీప్ కుమార్, బి.సంగీత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారికి వారందరికీ ఎలక్షన్ ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. నూతన ఎస్పీ, జీఆర్‌పీ సికింద్రాబాద్ యూనిట్ సభ్యులు.. జిల్లా యూనియన్ అధ్యక్షులు డాక్టర్ ముజీబ్, సభ్యులు కుర్రాడి శ్రీనివాస్, నరేష్ కుమార్, ముఖీమ్ ఖురేషిలను సన్మానించి.. వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ యూనియన్ కేంద్ర సంఘం సభ్యులు టి.పర్వతాలు, జిల్లా ఏపీ ఆర్వో మొహమ్మద్ వహీద్, ముస్తఫా షరీఫ్, జిల్లా యూనిట్ అధ్యక్షుడు సిఐడి యూనిట్ అధ్యక్షులు ధనరాజ్, ఈఎన్‌టీ ఆస్పత్రి అధ్యక్షులు టి.రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ కొత్త యూనిట్ సభ్యులందరినీ ప్రత్యేకంగా అభినందిస్తూ.. రానున్న రోజు ల్లో బంగారు తెలంగాణ ఏర్పాటుకు ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చోరీకి యత్నం..!

నవతెలంగాణ-కూకట్‌పల్లి



కూకట్‌పల్లి ప్రశాంత్ నగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డ్ రూమ్ తాళాలు పగలగొట్టి చోరీకి యత్నం జరిగింది. కూకట్‌పల్లి సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఉద్యోగులు ఎప్పటి లాగానే విధులు ముగించుకొని తాళము వేసి వెళ్లిపోయారు. మరుసటి రోజు ఉదయం ఆఫీస్‌కి వచ్చిన సమయంలో రికార్డ్ రూం తాళాలు పగులగొట్టి ఉండటం ఉద్యోగులు గుర్తించారు. ఈ మేరకు ప్రశాంత్ నగర్‌లోని జాయింట్ సబ్ రిజిస్ట్రార్ సతీష్ కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆఫీస్‌లోకి చొరబడి రికార్డ్ రూం తాళాలు పగుల గొట్టి ఉండవచ్చు అని అనుమానిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు అయితే ఇప్పటి వరకు ఏటువంటి రికార్డ్స్ పోయినట్టుగా గుర్తించలేదనీ తెలియజేశారు.

తార్నాకలో అగ్నిప్రమాదం



నవతెలంగాణ-ఓయూ

తార్నాక, కిమ్టీ కాలనీలోఓ ఇంట్లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే అగ్ని మాపక సిబ్బందికి సమాచారమివ్వగా సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. క్షణాల మీద వ్యాపించిన మంటలతో కాలనీ వాసులు ఒక్కసారిగా భయబ్రాంతులకు గురయ్యారని, ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది అని పలువరు తెలిపారు. ఈ ఘటన షార్ట్ ర్ర్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగి ఉండొచ్చన్నారు. అయితే ఈ ప్రమాదంలో కొంత మేర ఆస్తి నష్టం సంభవించినట్లు తెలిపారు. ఈ ఘటన స్థలాన్ని డిప్యూ టీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మోతే శోభన్‌రెడ్డి గురు వారం పరిశీలించారు.

డాక్టర్ జీఎన్ రావుకు వరల్డ్ ఐకాన్ 21' అవార్డు

నవతెలంగాణ-బంజారాహిల్స్



ఎల్వీ ప్రసాద్ వ్యవస్థాపకులు డాక్టర్ జీఎన్ రావుకు వరల్డ్ ఐకాన్ 21' అవార్డు లభించిందింది. ఈ గుర్తింపునకు ఎంపికైన మొదటి ఏకైక భారతీయుడు డాక్టర్ జీఎన్‌రావు అని, ఆసియా పసిఫిక్ జర్నల్ ఆఫ్ ఆప్తాల్మాలజీ (ఏపీజేవో) ప్రపంచంలో అత్యంత ప్రభావ వంతమైన పది మంది నేత్ర వైద్య నిపుణులలో ఒకరిగా గుర్తించిందని పలువురు నేత్ర వైద్య నిపుణులు తెలిపారు. ఇండోనేషియాలోని బాలిలో జరిగిన 39వ ఆసియా పసిఫిక్ అకాడమీ ఆఫ్ ఆప్తాల్మాలజీ (ఏపీఏవో) సమావేశంలో డాక్టర్ ఎన్‌రావు, ప్రపంచంలో 23 మంది అత్యంత ప్రభావవంతమైన నేత్ర వైద్య నిపుణులకు 'వరల్డ్ ఐకాన్స్ 21' అవార్డుతో సత్కరించారు. 21వ శతాబ్దంలో నేత్ర సంరక్షణలో ఆయన అసాధారణమైన కృషికి ఈ సమూహంలో టాప్ 10లో నిలిచినట్లు తెలిపారు.ఇది ఆసియా పసిఫిక్ జర్నల్ ఆఫ్ ఆప్తాల్మాలజీ (ఏపీజేవో) ప్రారంభ అవార్డు అని అన్నారు.

రక్తదాతలే..ప్రాణదాతలు





● మురళీ వరదరాజన్

నవతెలంగాణ-బంజారా హిల్స్

రక్తదాతలే అసలైన ప్రాణదాతలుగా మారండి అంటూ ఎల్ అండ్ టి మెట్రో రైల్ చీఫ్ స్ట్రేటజీ ఆఫీసర్, మురళీ వరదరాజన్ అన్నారు. గురువారం అమీర్ పేటలోని ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రిలో, అమీర్ పేట్ మెట్రో స్టేషన్‌లో ఆస్టర్ క్లినిక్లో రక్తదాన శిబిరాన్ని ఆస్టర్ డీఎం హెల్త్ కేర్ సీఈవో రీజనల్ హెడ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేటి దేవానంద్‌తో కలిసి ఈ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుమారుగా సుమారు 50 మందికి పైగా దాతలకూ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఈఓ కేటి దేవానంద్ మాట్లాడుతూ రక్తదానం అన్ని దానాలలో కల్లా మిన్నదని రక్తాన్ని దానం చేయడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు.ఎందరో రోగులు సరైన సమయంలో రక్తం అందక మృత్యువాత పడుతుంటారని, అలాంటి వారిని కాపాడడానికి రక్తదాతలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రిలో ఇలాంటి మంచి కార్యక్రమాలను నిరంతరం ప్రోత్సహిస్తూ ఉంటుందని, అందుకు సహకరించిన రక్తదాతలు అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మురళీ వరదరాజన్ మాట్లాడుతూ హైదరాబాద్ మెట్రో రైలు ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్ర మాలను చేపడుతోందని తద్వారా సమాజానికి తన వంతు సహాయాన్ని అందించడంలో ముందంజలో ఉందన్నారు. ఈ కోవలోనే నేడు ఈ రక్తదాన శిబిరాన్ని అమీర్‌పేట్ స్టేషన్లో ఏర్పాటు చేశామని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపడతామని అందుకు ప్రజలు స్వచ్చందంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ రక్తదాన శిబిర కార్యక్రమంలో ఆస్టర్ వాలంటీర్లకు చెందిన బ్లడ్ బ్యాంక్ ఉద్యోగులు అమీర్పేట్ మెట్రో స్టేషన్ కు చెందిన సిబ్బంది ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ఇయర్ పరీక్ష ప్రశాంతం..

● జిల్లాలో తొలి రోజు 76470 మంది హాజరు

● 3407 మంది విద్యార్థులు గైర్హాజరు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి పరీక్ష కేంద్రాల్లోకి అరగంట ముందే విద్యార్థులను అనుమతించారు. సెకండ ఇయర్ విద్యార్థులకు మొదటి పరీక్ష కావడంతో ఉరుకులు పరుగులు తీస్తు కనిపించారు. పరీక్ష కేంద్రాల వద్ద హడావుడి కనిపించింది. హైదరాబాద్ జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్ ద్వితీ య సంవత్సర పరీక్షలకు 79877 విద్యార్థులకుగాను 3407 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వ హణకుగాను 242 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 75950 జనరల్ విద్యార్థులకుగాను 72914 మంది విద్యార్థులు హాజరుకాగా 3036 మంది గైర్హాజరయ్యారు. ఒకేషన్ విభాగంలో 3927 మంది విద్యార్థులకు గాను 3556 మంది హాజరవ్వగా 371 మంది గైర్హాజరయ్యారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 61581 మంది విద్యార్థులకుగాను 60565 మంది హజరు కాగా.. 1016 మంది గైర్హాజరయ్యారు. మాల్‌ప్రాక్టీస్, మాస్‌కాఫియింగ్ వంటి ఎలాంటి కేసులు నమోదు కాలేదు. తల్లిదండ్రులు వారి పిల్లలను తీసుకుని పరీక్ష కేంద్రాలకు చేరుకోవడంతో ఆయా సెంటర్ల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో విద్యార్థులు కొంత ఇబ్బంది పడాల్సి వచ్చింది. నిమిషం ఆలస్యం నిబంధన అమలులో ఉన్నప్పటికీ.. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా..కొన్ని చోట్ల విద్యార్థులు రెండు నుంచి అయిదు నిమిషాల పాటు ఆలస్యంగా వచ్చినా అధికారులు అనుమతించారని తెలిసింది.

పదవీ విరమణ పొందిన జీహెచ్ఎంసీ ఉద్యోగులకు ఘనంగా సన్మానం

నవతెలంగాణ-సిటీబ్యూరో



వివిధ హెూదాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన ఆరుగురు జీహెచ్ఎంసీ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం పన్వర్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీ.ఎం. హెచ్.ఓ డాక్టర్ పద్మజ, ఓ.ఎస్.డీ వేణుగోపాల్, సీ.పీ.ఆర్.ఓ మహమ్మద్ ముర్తుజా, జాయింట్ కమిషనర్ జయంత్, లేబర్ ఆఫీసర్ విజయ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ పద్మజ మాట్లాడుతూ పదవీవిరమణ పొందామని ఆందోళన చెంద్దవద్దని, శేష జీవితాన్ని మీ కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలని సూచించారు. పదవీ విరమణ పొందిన వారిలో శేరిలింగంపల్లి జోన్ రెవెన్యూ విభాగంలో ఆఫీస్ సబార్డినేట్ గా పనిచేసిన జి.రాములు, సికింద్రాబాద్ జోన్ అంబర్ పేట్‌లో కామాటిగా పనిచేసిన తుల్జా రామ్, ఖైరతాబాద్ జోన్ గోషామహల్ లో కమాటన్‌గా పనిచేసిన జగదాంబ, చార్మినార్ జోన్‌లో కామాటిగా పనిచేసిన శంకరయ్య, మణియమ్మ, జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో మజ్దూర్ గా పనిచేసిన అబ్దుల్లా ఉన్నారు.

వర్గీకరణతో అందరికీ మేలు చేకూరుతుంది

● తెలంగాణ మాదిగ దండోర..



నవతెలంగాణ-బంజారాహిల్స్

వర్గీకరణతో అందరికీ మేలు చేకూరుతుందని తెలంగాణ మాదిగ దండోర రాష్ట్ర అధ్యక్షులు దైద శ్యాంసుందర్ మాదిగ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కాలంలో మాదిగలు క్రియాశీలక పాత్ర పోషించారని,కాని మాదిగల జీవితాల్లో ఎలాంటి మార్పులు చేర్పులు జరగలేదని ఆవేదన వ్యక్తపరిచారు.ఎస్సీ (ఏబీసీడీ),వర్గీకరణతోనే వారి కళలు సహకారం చేసుకోవచ్చని దీనికి కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో నెరవేర్చాలన్నారు. కేవలం వర్గీకరణ చేస్తే సరిపోదని, ప్రాంతాల వారీగా వర్గీకరణ చేయాలన్నారు. రాష్ట్రంలో దళితులకు సంబంధించిన వందలాది ఎకరాల అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాయని వాటిని తిరిగి అప్పగించాలన్నారు. త్వరలోనే తెలంగాణ మాదిగ దండోర జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని,హక్కుల సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రుద్రాల స్వామి మాదిగ, ప్రధాన కార్యదర్శి పాలడుగు జానయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కె. మోజెస్ మాదిగ, సెక్రటరీ జనరల్ దార యాదగిరి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నిమ్మగళ్ల అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పర్మిట్ రూమ్‌లపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-బంజారాహిల్స్



కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా రాష్ట్రంలో ఉన్న బెల్ట్‌షాపులను మూసివేస్తు న్నందుకు తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. బెల్ట్ షాపులు మూసివేయడం వల్ల ప్రభుత్వ ఖజానాకు ఎలాంటి నష్టం ఉండదని, హైదరాబాద్ నాంపల్లిలోని ఆబ్కారీ శాఖ కార్యాలయంలో కమిషన ర్‌ను కలిసి తమ సమస్యలపై వినతి పత్రం అందజే శారు. అనంతరం బంజారాహిల్స్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైన్స్ షాపులలో నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూమ్ లను నడుపుతున్నారని, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ తెలిపారు. జీవో నెంబర్ 24,25 ప్రకారం పర్మిట్ రూమ్ 100 స్క్వేర్ మీటర్స్ లోపు ఉండాలని. లోపల కుర్చీలు , తినుబండా రాలు పెట్టకూడదని నిభంధన ఉందని... కానీ కొత్తగా వైన్స్ లను తీసుకున్న వారు ఎకరాలలో పర్మిట్ రూమ్ లను ఏర్పాటు చేసి , నిభందనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో బెల్టు షాపులను మూసివేసి , వైన్స్ షాప్ వద్ద పర్మిట్ రూమ్ లను అరికట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బాల్ రెడ్డి,సలహాదారు బలరాజ్ గౌడ్,చక్రపాణి తదితరాలు పాల్గొన్నారు.

మరో 10 షోరూంలను ప్రారంభించనున్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్

నవతెలంగాణ-బంజారాహిల్స్

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ నుంతంగా 10 షోరూములను అందుబాటు లోకి రానున్నాయని, ప్రపంచ వ్యాప్తంగా 350కి చేర్చాలని లక్ష్యంతో పనిచేస్తామని మలబార్ గ్రూప్ చైర్మెన్ ఎంపి అహమ్మద్ తెలిపారు. ఈ మేరకు సోమాజిగూడలో సంస్థ ప్రతినిధులు ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ సంవత్సరం మార్చి నెల చివరి వరకు షోరూం సంఖ్యను మూడు వందల యాభైకి చేర్చాలని, ప్రస్తుతం ప్రపంచంలోని ఆరవ అతిపెద్ద ఆభరణాల సంస్థగా గుర్తింపు పొందడమే కాకుండా, డెలాయిట్ లగ్జరీ గూడ్స్ గ్లోబల్ ర్యాంకింగ్లో 19వ స్థానంలో ఉందన్నారు. అనంతరం సంస్థ చైర్మెన్ ఎంపి అహమ్మద్ వార్చువల్గా మాట్లాడుతూ ప్రస్తుతం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఉనికి ఉన్న దేశాలతో పాటు న్యూజిలాండ్, ఈజిప్ట్, టర్కీదక్షిణాఫ్రికా వంటి దేశాల్లో కొత్త షోరూములు ప్రారంభించడం ద్వారా అంతర్జాతీయ విస్తరణ కొత్తగా ఉద్యోగ అవకాశాలను సృష్టించడం వంటి అంశాల్లో మలబార్ గ్రూప్ ప్రసిద్ధి చెందిందన్నారు.

కంటోన్మెంట్‌లో విజయవంతమైన సంకల్ప యాత్ర



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం విజయసంకల్ప యాత్ర విజయమైందని నియోజకవర్గ బీజేపీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం జీవీఆర్ గార్డెన్ నుంచి 500 బైక్‌లతో ర్యాలీ నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తమిళనాడు బీజేపీ నాయకురాలు జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు సినీ నటి కుష్బు సుందర్ పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్, శ్రీ గణేష్ , మాజీ పార్లమెంటు సభ్యుడు చాడ సురేష్, నడికొండ గీత రెడ్డి,విజయ సూరణ,మాజీ మంత్రి కృష్ణ యాదవ్, గోలి మధు సూదన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామారావు పాటిల్,కార్పొరేటర్ దీపిక, కంటోన్మెంట్ బీజేపీ నాయకులు బానుక నర్మదామల్లి కార్జున్, పరుశురాం పలువురు ప్రముఖులు యాత్రలో పాల్గొన్నారు. కంటోన్మెంట్ బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీ గణేష్, శ్యామ్ సుందర్ గౌడ్, అంతకుముందు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ 17 సీట్లు గెలిచే అవకాశం ఉంది అన్నారు.

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొ.అర్జున్ రావు కుతాడి



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వ విద్యాలయం ఓయూ చరిత్రశాఖ సీనియర్ ప్రొఫెసర్ అర్జున్‌రావు కుతాడి గురువారం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఓయూ వీసీ ప్రొ. రవీందర్ చేతుల మీదుగా ఆడర్ కాపీ అందుకున్నారు. అర్జున్ రావు 1997 సంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, సికింద్రాబాద్ పీజీ కళాశాల నుంచి ప్రస్థానం ప్రారంభించిన అ యిన జనరల్ వార్డెన్, మెస్‌వార్డెన్‌గా, అకాడమిక్ ఆడిట్ సెల్ కో-ఆర్డినేటర్, సీడీసీ కో-ఆర్డినేటర్, ఎస్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్, గెస్ట్ హౌస్ డైరెక్టర్, సీడీసీ డైరెక్టర్ గా పని చేసి పలు యూజీసీ, న్యాక్ కమిటీల్లో మెంబర్, దేశంలో పలు యూనివర్సిటీల్లో బీఓఎస్ మెంబర్ గా సేవలు అందించారు.ఒక ట్రైబల్ సామాజిక వర్గానికి చెందిన అయిన ప్రిన్సిపాల్‌గా కావడం విశేషం. ఆయనకు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రొఫెసర్స్, విద్యార్థుల, ఉద్యోగుల సహకారాన్ని తీసుకొని కళశాల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్‌లో పీఈటీలకు అన్యాయం

● ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శాంగటి రాజేష్



నవతెలంగాణ-ఓయూ

ఓయు ఆర్ట్స్ కళాశాల సెమినార్ హల్‌లో గురువారం స్పోర్ట్స్ స్టూడెంట్ పెడరేషన్ ఆధ్వర్యంలో వ్యాయామ నిరుద్యోగ ఉపాధ్యాయుల సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు శాంగటి రాజేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎస్ఎఫ్ చీఫ్ అడ్వాయిజర్ బిక్కుసాని ప్రశాంత్ ఉస్మానియా యూనివర్సిటీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్‌లు వడ్డేపల్లి సత్యనారాయణ, ప్రొ.దీప్ల ప్రొ.మల్లికార్జున్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం విడుదల చేసిన డిఎస్సి నోటిఫికేషన్ జారీలో అతి తక్కువ పీఈటీ పోస్టులు ఇవ్వడం సరికాదన్నారు. ఏస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శాగంటి రాజేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు డిఎస్సీ నోటిఫికేషన్ విడుదలైందని, అందులో పీఈటీ,పీడీ, పోస్టులు 182 మాత్రమే చాలా దురదృష్టకరం, అదేవిధంగా కాంగ్రెసు పార్టీ అభయహస్తం మ్యానిఫెస్టోలో పాఠశాలలు కాలేజ్‌లు ,యూనివర్సిటీలలో ఉన్న పీఈటీ/పిడి పోస్టులను భర్తీ చేస్తామని, ప్రతి జిల్లాకు రెసిడెన్షియల్ స్పోర్ట్స్ స్కూల్‌ను, రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిట, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులకు ప్రోత్సా హకాలు, ప్రతి మండల స్థాయిలో మినీ స్టేడియం, నియోజకవర్గంలో స్టేడియం,జిల్లా స్థాయి స్పోర్ట్స్ అకాడమీలు ఏర్పాట్లు చేస్తామని గుర్తు చేశారు. వాటిని ఏర్పాటు చేయాలని స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ తరుపున డిమాండ్ చేశారు. మ్యానిఫెస్టోలో ఉన్న విధంగా ఏర్పాట్లు చేయాని యాడల ధర్నా లు నిరసనలు వెల్లువెత్తాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యాప్తంగా1600 ఖాళీలు ఉన్న పీఈటి, పి,డి పోస్టులు ఉన్నాయి కానీ రాష్టం ప్రభుత్వం కేవలం అతి తక్కువ పోస్టులు 182 మాత్రమే డిఎస్సి లో విడుదల చేయడం నిరుద్యోగులు చాలా చేదువార్త అని చెప్పుకో వచ్చు తెలంగాణ రాష్ట్రసీఎం రేవంత్ రెడ్డి మాకు ఎక్కువగా పీఈటీపీడీ పోస్టులు భర్తీ చేయాలని ఓయూ వేదికగా మీదగా స్పోర్ట్స్ స్టూడెంట్ పెడరేషన్ కోరారు.ఈ కార్యక్రమంలో, ఏస్ఎస్ఎఫ్ రాష్ట్రం వర్కింగ్ అధ్యక్షుడు గుండు నాగయ్య చాలికంటి వినోద్ కుమార్ మహేందర్ నిరుద్యోగు ప్రవేట్ పీఈటీ సంఘం అధ్యక్షుడు సైదులు గౌడ్, ఓయూ అధ్యక్షుడు గణేష్, కేయు అధ్యక్షుడు ఉంద్రాతి లెనిన్ మహిళ అధ్యక్షురాలు మనుశ్రీ, పాల్గొన్నారు.

దేశం గర్వపడేలా విద్యార్థులు ముందుకు సాగాలి

● మాస్టర్ మైండ్ చైర్మెన్ రాజు సంఘాని



నవతెలంగాణ-బేగంపేట్

విద్యార్థులే దేశ భవిష్యత్తుకు పునాదులని, దేశం గర్వపడేలా విద్యార్థులు ముందుకు సాగాలని మాస్టర్ మైండ్ విద్యాసంస్థల చైర్మెన్ రాజుసంఘానీ తెలిపారు. ఓల్డ్ బోయినపల్లి బ్రాంచ్ మాస్టర్ మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆరవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాస్టర్‌మైండ్స్ విద్యా సంస్థల చైర్మెన్ రాజు సంఘని హాజరయ్యారు. ఈ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రాజు సంఘాని మాట్లాడుతూ అనతి కాలంలోనే 75 పాఠశాలలు ఉన్నాయని, నాణ్యతతో కూడిన విద్యను అందించడమే తమ లక్ష్యమని ఆయన తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ వారిలో సృజనాత్మకతను వెలికి తీసే దిశగా మాస్టర్ మైండ్ తనదైన శైలిలో విద్యాబోధన చేస్తున్నట్లు వెల్లడించారు.డైరెక్టర్లు, రంజిత్ కుమార్ విజయ్ సారథి, జగన్నాథం, యాదగిరి,లావణ్య ,గీత, కాజా, విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బూరుగు శ్రీనివాస్‌కు ఓయూ డాక్టరేట్



నవతెలంగాణ-ఓయూ

అశ్వారావుపేట నియో జకవర్గం, చంద్రు గొండ మండలం అయ్య న్నపాలెం గ్రామస్తులు బూ రుగు ముత్తయ్య, సావి త్రిల కుమారుడు బూరు గు శ్రీనివాస్ ఓయూ భౌతిక శాస్త్రంలో ప్రఖ్యాత ఉస్మానియా విశ్వవిద్యాల యం నుండి డాక్టరెట్ పొం దారు. ఈయన ఓ.యు భౌతిక శాస్త్ర సహాయ ఆచార్యులు డాక్టర్ పి. హిమ బిందు పర్యవేక్షణలో "ఎఫెక్ట్ ఆఫ్ బిస్మత్ ఆక్సైడ్/ లెడ్ ఆక్సైడ్/ అల్యూమినియం ఆక్సైడ్ ఆన్ ఫిజికల్, ఆప్టికల్, స్ట్రక్చరల్ అండ్ షీల్డింగ్ ప్రాపర్టీస్ ఆఫ్ జింక్ కాడ్మియం బోరేట్ గ్లాసెస్" అనే అంశం పై పరిశోధన పూర్తి చేశారు.ప్రస్తుతం కాకతీయ ప్రభుత్వ కళాశాల హన్మకొండ లో పనిచేస్తున్నారు. డాక్టరేట్ పొందిన శ్రీనివాస్‌ను కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు, చిన్ననాటి మిత్రులు, ఉపాధ్యాయులు, సహ అధ్యాపకులు, కళాశాల ప్రిన్సిపల్ అబినందించారు. శ్రీనివాస్ తన గైడ్, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ముగిసిన న్యాక్ అవగాహన సదస్సు



నవతెలంగాణ-ఓయూ

న్యాక్ గుర్తింపు ప్రక్రియలో అధ్యాపకులను సన్నద్ధం చేసేందుకు ఓయూ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంయుక్తంగా ఓయూ సైన్స్ కళాశాలలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది.న్యాక్ గుర్తింపులో కీలకమైన బోధన, అధ్యయన పద్ధతులు, పరిశోధన, మౌళిక వసతులు తదితర అంశాలపై ఆయా విభాగాల్లో నిష్ణాతులు పాల్గొని ప్రసంగించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మణిపూర్ కేంద్రీయ విశ్వవిద్యాలయ కులపతి ఆచార్య టి. తిరుపతిరావు, ఉన్నత విద్యలో నాణ్యత హామీ, ఇతర అకడమిక్ ఎక్సలెన్స్ నిర్ధారించటంలో న్యాక్ గుర్తింపు ప్రక్రియపై మాట్లా డారు. రెండు రోజుల జాతీయ సద॑స్సు లో ప్రముఖులు ఇచ్చిన దృక్పథాలు, అంతర్దృష్టితో కూడిన చర్చలు ఫలితాల ప్రతిబింబించే దిశగా సాగాలని ఆశా భావం వ్యక్తం చేశారు. గౌరవ అతిథిగా హాజరైన ఓఎస్డీ ఆచార్య బానోత్ రెడ్యానాయక్, ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాల హామీలో ఓయు నిబద్ధతను వివరించారు. విద్యా బోధన, పరిశోధనల్లో నాణ్యతను మరింత పెం చేందుకు ఇటీవలి కాలంలో వర్శిటీలో తీసుకొచ్చిన సంస్క రణలను వెల్లడించారు.రెండు రోజుల సదస్సులో భాగంగా జరిగిన చర్చలు, కీల కాంశాలు, సిఫార్సుల సమగ్ర అవలోకాన్ని ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ ఎ.విజయభాస్కర్‌రెడ్డి నివేదిం చారు. రెండు రోజు ల సదస్సును విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొ. శిరీష కృతజ్ఞతలు తెలిపారు. విద్యా ప్రమాణాణాల పెంపుదల, నాణ్యమైన విద్యను అందించేందుకు ఓయూ కృషి చేస్తుందన్నారు.

పరీక్షలలో ఒక్క నిమిషం నిబంధన ఎత్తివేయాలి : ఓయూ-ఎంఎస్‌యూ



నవతెలంగాణ-ఓయూ

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జరుగుతన్న సమయంలో రాష్ట్ర ఇంటర్ మీడియేట్ బోర్డు ప్రకటించిన "ఒక్క నిమిషం నిబంధనలతో పరీక్ష కేంద్రాలలోకి రానివ్వకపోవడం అనేది విద్యార్థుల భవిష్యత్తుకు గొడ్డలిపెటు , ఇది నిజంగా విద్యార్థుల భవి ష్యత్తుతో ఆటలాడుకోవడమే ఓయూ-ఎంఎస్‌యూ అధ్యక్షుడు మంద రాజు మాదిగ తెలిపారు. ఈ సందర్భంగా ఓయూలో గురువారం ఏర్పాటు చేసిన ఓయూ-ఎంఎస్ఎఫ్ నేతల సమావేశంలో అధ్యక్షుడు మాట్లాడుతూ విద్యార్థులను ఒక్క నిమిషం నిబంధన దానితో ఇబ్బందిపెడ్తున్నారని ఇటువంటి నిబంధనతో విద్యార్థులను మానసిక భయంతో ఆవేదన చెందెటట్టు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఇంచార్జ్ వంశీ రాజు మాదిగ ,మనోహర్ సురేందర్ ,అంజన్, పాల్గొన్నారు.

వాచ్‌మెన్ ఉద్యోగం చేస్తూ.. మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక



నవతెలంగాణ-ఓయూ

ఒకటి, రెండు, మూడు, ఇవేమీ కార్పొరేట్ విద్యా సంస్థలు ఇచ్చే ర్యాంకింగ్‌లు కాదు. ఓ వాచ్‌మెన్ ప్రభుత్వ రంగంలో ఒకేసారి సాధించిన ఉద్యోగాలు. అవును ఆకలి, పట్టు దల, నిరంతర కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని ప్రవీణ్ నిరూపించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎడ్యుకేషనల్ మల్టీ మీడియా రీసెర్చ్ సెంటర్‌లో రాత్రి పూట వాచ్‌మెన్ గా పనిచేస్తున్నప్రవీణ్ పది రోజుల వ్యవధిలోనే మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించారు. ఇటీవలే తెలంగాణ గురుకుల విద్యాలయాల బోర్డు ప్రకటించిన ఫలితాల్లో టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలు సాధించారు. మంచిర్యాల జిల్లా జన్నారం మం డలం పొన్కల్ గ్రామానికి చెందిన ప్రవీణ్ ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ వరకు జెన్నారంలో పూర్తి చేశారు. ప్రవీణ్ తండ్రి పెద్దులు మేస్త్రీ పనిచేస్తుండగా తల్లి పోసమ్మ బీడీ కార్మికురాలిగా పనిచేస్తు ప్రవీణ్‌ను చది వించింది. తల్లిదండ్రులు కష్టాన్ని చూసిన ప్రవీణ్ ఉన్నత ఉద్యోగం సంపాదించాలని నిర్ణ యించు కున్నారు. ఎంకాం, బీఈడీ, ఎంఈడీ ఓయూ క్యాంపస్‌లో చదుపుకున్నారు. ఖర్చుల కోసం ఈ ఎమ్మార్సీలో ఐదేళ్లుగా వాచ్‌మెన్‌గా ఉద్యోగం చేస్తూనే పోటీ పరీక్షల కు సిద్ధమయ్యాడు. అతని పట్టుదల, కష్టం ఫలించి ఒకే సా రి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక య్యాడు. ప్రవీణ్ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించటం పట్ల ఈఎమ్మార్సీ డైరెక్టర్, ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రవీణ్ స్ఫూర్తితో పేదరికాన్ని జయించేందుకు విద్యార్థులు, యువత ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌ను ఈఎమ్మార్సీ డైరెక్టర్ రఘుపతి ఉద్యోగులు సన్మానించారు.

తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడుగా బారి అశోక్



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ టీఎస్‌పీ రాష్ట్ర అధ్య క్షుడుగా సూర్యాపేట జిల్లావాసి, ఓయూ విద్యార్థి ఉద్యమ నాయకుడు, గత కొన్ని సంవత్సరాల నుండి విద్యార్థి ఉద్య మాల్లో కీలక పాత్ర పోషిస్తూ విద్యార్థుల శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న బారి అశోక్ యాదవ్ ఎకగ్రీవ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతర సైనికుడిలా పోరాటం చేస్తానని, త్వరలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీ కమిటీలు, జిల్లా కమిటీలు, మండల స్థాయి నూతన కమి టీల ను ఏర్పాటు చేసి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించి ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తామన్నారు. రాష్ట్ర కమిటీ నియా మకం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వడ్డే గణేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బాలగాని సైదులు,రాష్ట్ర అధికార ప్రతినిధిగా వెంపటి సురేష్ , గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వెంపటి భగత్ సింగ్,రాష్ట్ర కార్యదర్శిగా వడ్డేపల్లి సందీప్, రాష్ట్ర కోశాధికారిగా దండేపల్లి నవీన్, ఓయూ ఇన్‌చార్జ్‌గా నూకల మధు యాదవ్,ఓయూ కార్యదర్శిగా కేలోత్ కిరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొంతుల రాజ్‌కుమార్,ఏర్పుల మహేష్ నియామకాన్ని రాష్ట్ర కమిటీ తీర్మానం చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగ విద్యారంగలో జరుగుతున్న ఆర్థిక దోపిడి అరికట్టాలని,పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వంపై టీఎస్పీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు.

నవతెలంగాణ
హైదరాబాద్
HMDA
శుక్రవారం | మార్చి 01, 2024 | www.navatelangana.com

మార్చి 5న శేషు లత త్యాగరాజ కీర్తనలు ఆలాపన

నవతెలంగాణ-కల్చరల్

ప్రముఖ మహిళా సంస్థ రాగ రాగిణి నిర్వహణలో శాస్త్రీయ సంగీత విదుషి డాక్టర్ శేషు లత చే వాగ్గేయ కారుడు త్యాగరాజ స్వామి పంచ రత్న కీర్తనలు గాన గోష్ఠి శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై ఉంటుందని సంస్థ కార్యదర్శి సుబ్బ లక్ష్మి అధ్యక్షురాలు రమణ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా దూరదర్శన్ విశ్రాంత సంచాలకుడు డాక్టర్ మధుసూదన రావు పాల్గొంటారని, సినీ కవి డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ అధ్యక్షత వహిస్తారని చెప్పారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన్ మూర్తి హాజరవుతారు. శేషు లత దేశంలో వెయ్యికి పైగా గాన గోష్ఠి లు చేసి భద్రచల రామ దాసు కీర్తనలు ప్రచారం చేశారు. అసంఖ్యాక శిష్య బృందానికి గురువుగా నిత్య సంగీత శ్రామికురాలు శేషు లత ఉన్నారు.

చంచల్‌గూడ శ్మశానవాటిక చెత్త కుప్పలో శిశువు..

నవతెలంగాణ-సంతోష్ నగర్



చంచల్‌గూడ శ్మశానవాటిక ఆవరణలోని చెత్తకుప్పలో అప్పుడే పుట్టిన మగ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు వదిలివెళ్లారు. గమనించిన స్థానికులు వెంటనే మాదన్నపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న కానిస్టేబుల్స్ శిశువును మలక్ పేట్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నిలోఫర్ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఇద్దరు మహిళలు శిశువును పడవేసి పారిపోయినట్లు స్థానికులు తెలిపారు.ఘటన పై మాదన్న పేట పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్నారు.

శ్రీశైలంకు ప్రతీ 20 నిమిషాలకో బస్సు

- మొత్తం 421 ప్రత్యేక బస్సు సర్వీసులు
- రేపటి నుంచి 11వరకు బస్సులు నడపనున్న టీఎస్ఆర్టీసీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు నడపనుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల నుంచి 421 ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు రంగారెడ్డి రీజినల్ మేనేజర్ ఏ.శ్రీధర్ తెలిపారు. ఈనెల 2 నుంచి 11వ తేదీ వరకు బస్సులు నడుపుతున్నట్టు ఆయన తెలిపారు. ఇందులో ఏసీ, సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయని చెప్పారు. ఈ బస్సులు, జేబీఎస్, ఎంజీబీఎస్‌తో పాటు నగరంలోని ఇతర ప్రదేశాల నుంచి రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడిపేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ప్రతి అరగంటకో ఏసీ బస్సు, ప్రతి 20 నిమిషాలకో సూపర్ లగ్జరీ, ఇతర బస్సులు నడపనున్నట్టు పేర్కొన్నారు. ఇందులో రాజధాని ఏసీ బస్సు సర్వీసులు బీహెచ్ఈఎల్, జేబీఎస్ స్టేషన్ నుంచి బయలుదేరి ఎంజీబీఎస్ ద్వారా శ్రీశైలం చేరుకుంటాయని చెప్పారు. వీటిలో ప్రస్తుతం ఏసీ బస్సుకి రూ.650, సూపరీ లగ్జరీకి రూ.530 చొప్పున టికెట్ ధరలున్నాయని, సిటీలోని ఇతర ప్రదేశాల నుంచి అయితే టికెట్ రేట్లలో స్వల్ప తేడాలున్నట్టు పేర్కొన్నారు. ఇక ఈనెల 5వ తేదీ నుంచి ఏసీ బస్సుల్లో రూ.750 చొప్పున టికెట్ ధరలు ఉంటాయని ఆయన తెలిపారు. ఇక ప్రయాణికుల సౌకర్యం ముందస్తు సీట్లు బుకింగ్ కోసం రిజర్వేషన్ అందుబాటులో ఉంచారు. కాగా ప్రయాణికులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్ఆర్టీసీఆన్‌లైన్.ఇన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చునని తెలిపారు.

ఎల్‌బీ నగర్ ఇన్‌స్పెక్టర్‌గా రామాంజనేయులు

- రాచకొండ కమిషనరేట్‌లో కొనసాగుతున్న బదిలీలు
- వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న పలువురికి బాధ్యతలు

నవతెలంగాణ-హాయత్ నగర్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పలు విభాగాల శాఖలకు చెందిన అధికారులను చేస్తున్న బదిలీల్లో భాగంగా రాచకొండ కమిషనరేట్ లో కూడా బదిలీలు కొనసాగుతున్నాయి. ఎల్బీ నగర్ ఇన్‌స్పెక్టర్‌గా రామాంజనేయులు నియామకం కాగా ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న అంజిరెడ్డి అబ్దుల్లాపూర్ మెట్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. అలాగే ఇబ్రాహీం పట్నం ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న సైది రెడ్డి సరూర్ నగర్ ఇన్‌స్పెక్టర్‌గా, పహాడీ షరీఫ్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న సత్యనారాయణ ఇబ్రాహీం పట్నం ఇన్‌స్పెక్టర్‌గా, జవహర్ నగర్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న సీతారాం చౌటుప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా, హైదరాబాద్ గ్రీన్ ఫార్మసిటీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న నాగరాజు జవహర్ నగర్ ఇన్‌స్పెక్టర్‌గా, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న రామాంజనేయులు ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్‌గా, యాదగిరిగుట్ట రూరల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న వేణుగోపాల్ రావు ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న కొండల్ రావు యాదగిరిగుట్ట రూరల్ ఇన్‌స్పెక్టర్‌గా, ఎల్‌బీనగర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న వీరస్వామి కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్‌గా, యాదాద్రి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న లింగయ్య భువనగిరి డీ పీ ఓ గా, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న రవి కుమార్ యాదాద్రి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా వెయిటింగ్ లిస్టులో ఉన్న అశోక్ రెడ్డి వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్‌గా, వెయిటింగ్ లో ఉన్న వెంకటేశ్వర్లు వనస్థలిపురం ట్రాఫిక్ 1 ఇన్‌స్పెక్టర్‌గా, వెయిటింగ్ లిస్ట్ లో ఉన్న జగదీష్ ఎల్‌బీనగర్ 1 ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా, వెయిటింగ్ లిస్ట్ లో ఉన్న రాజేష్ హైదరాబాద్ గ్రీన్ ఫార్మసిటీ ఇన్‌స్పెక్టర్‌గా, వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న శ్రీనివాస్ రెడ్డి నేరేడ్‌మేట్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా, వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న రమేష్ ఉప్పల్ మహిళ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌లుగా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

హైదరాబాద్‌లో నేటి నుంచి సీసీఎల్ మ్యాచ్ లు ప్రారంభం కానున్నాయి. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియంలో మూడు రోజుల పాటు మొత్తం ఆరు మ్యాచ్‌లు జరగనున్నాయి. తెలుగు వారియర్స్ జట్టు శుక్రవారం, శనివారం మ్యాచ్‌లు ఆడనుంది.
నవతెలంగాణ-సిటీబ్యూరో

కేపీహెచ్‌బీలో సదరన్ ట్రావెల్స్ నూతన బ్రాంచ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

కేపీహెచ్‌బీలో సదరన్ ట్రావెల్స్ నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. సదరన్ ట్రావెల్స్ హైదరాబాద్ ప్రజల సౌకర్యతార్థం అన్ని పర్యాటక అవసరాలకు అనుగుణంగా ఈ కొత్త బ్రాండ్‌ను ప్రారంభించడం జరిగిందని సదరన్ ట్రావెల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి వెంకట ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం కేపీహెచ్‌బీలో నూతన బ్రాంచ్ ప్రారంభించిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. దక్షిణ భారతదేశం నుండి వేలాది మంది ప్రయాణికులకు సదరన్ ట్రావెల్స్ ప్రయాణ భాగస్వామిగా ఉందన్నారు. యూరప్, దుబాయ్, సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియా ఇలా అనేక అంతర్జాతీయ ప్రయాణ అవసరాలను తీర్చుతోందని తెలిపారు. ప్రధాన కార్యాలయం న్యూ ఢిల్లీలోఉందని, 1970లో స్థాపించిన సదరన్ ట్రావెల్స్ 1500లకుపైగా బ్రాంచీలున్నాయన్నారు. ఇప్పటి వరకు నాలుగు మిలియన్లకుపైగా కస్టమర్లకు సేవలందించామని తెలిపారు. అందరి కస్టమర్లను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్యాకేజీలతో దేశవిదేశాలల్లో సేవలందిస్తున్నామని వివరించారు. కేపీహెచ్‌బీలో కొత్త శాఖను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కేపీహెచ్‌బీలో బ్రాంచ్‌లో డొమెస్టిక్, ఇంటర్నేషనల్ టూర్స్‌ను అందిస్తామని తెలిపారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన స్కూల్ ఎడ్యుకేషన్ నేతలు

నవతెలంగాణ-సిటీబ్యూరో



టీఎన్జీవో యూనియన్ హైదరాబాద్ జిల్లా స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ ఉపాధ్యక్షులు ఎం. రవికుమార్ కుమార్తె వివాహం గురువారం కర్మన్‌ఘాట్‌లోని చంద్రా గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు టీఎన్జీవోస్ జిల్లా సహాధ్యక్షుడు, యూనిట్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ డేవిడ్, జాయింట్ సెక్రటరీ ముక్తాధర్, పబ్లిక్ సెక్రటరీ ఎంవై రవితో పాటు వారి కార్యవర్గం హాజరై నూతన వధూవరులు రూపా శ్రీ, కార్తీక్‌లను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఫోరం ఆర్గనైజింగ్ సెక్రటరీ లలిత్, శివ, రమేష్, జి. రాజ్ కుమార్, విలియం, రాజేందర్, సూర్యప్రకాష్, రాణి, సోహేల్ అహ్మద్, ఫయాజ్, హేమావతి, దామోదర్, కలీం, శివజ్యోతి రెడ్డి, శివ, పెంటేష్, శివ ఆనంద్, సుబ్బారావు(రిటైర్డ్), ఇమ్రాన్ నూతన వధువరులను ఆశీర్వదించారు.

దేశవ్యాప్తంగా 12 కోట్ల గృహాలకు పైప్ ద్వారా వంట గ్యాస్ సరఫరా



- పీఎన్‌జీఆర్‌బీ సభ్యుడు అంజనీ కుమార్ తివారి

నవతెలంగాణ-సిటీబ్యూరో

పీఎన్‌జీఆర్‌బీ దేశ వ్యాప్తంగా 12కోట్ల మందికి పిఎన్జి కనెక్షన్లు అందించాలని లక్ష్యం పెట్టుకోగా,ఇందులో మేఘా గ్యాస్ 1.3కోట్ల కనెక్షన్లు అందించనుందని, 17000కు పైగా సిఎన్జి స్టేషన్లు ఏర్పాటు చేయనుండగా వీటిలో 2200కు పైగా సిఎన్జి స్టేషన్లు ఏర్పాటు చేయనుందని పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డ్ మెంబర్ అంజనీకుమార్ తివారి అన్నారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని బోడజనం పేట గ్రామంలో గృహ అవసరాలకు అనుగుణంగా మేఘా గ్యాస్ సరఫరా చేస్తున్న మొదటి పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్ ను, సౌత్ ఆసియన్ సిరామిక్ టైల్స్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీకి పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పీఎన్‌జీ కనెక్షన్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. వీటితో పాటు ఈ ప్రాంతంలో నేచురల్ గ్యాస్ సరఫరా చేయడానికి వీలుగా పోలేపల్లి పారిశ్రామిక ప్రాంతంలో మదర్ సీఎన్జి స్టేషన్ ను ప్రారంభించారు.దీని ద్వారా గృహ,పారిశ్రామిక,వాణిజ్య అవసరాలతో పాటు,వాహనాలకు కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ సరఫరా చేయనుంది మేఘా గ్యాస్.

ఈ సందర్భంగా పీఎన్‌జీఆర్‌బీ మెంబర్ అంజనీకుమార్ తివారి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పీఎన్‌జీఆర్‌బీ చేస్తున్న పీఎన్‌జీ డ్రైవ్ లో భాగంగా ఈరోజు గృహ,పారిశ్రామిక అవసరాలకు మేఘా గ్యాస్ ద్వారా పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్ ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.దేశంలోని సీజీడీ రంగంలో కీలకమైన పది రాష్ట్రాల్లోని 22 జియోగ్రాఫికల్ ఏరియాల్లో నేచురల్ గ్యాస్ సరఫరా చేస్తూ మేఘా గ్యాస్ అగ్రగామిగా ఉందన్నారు. పీఎన్‌జీఆర్‌బీ దేశ వ్యాప్తంగా 12కోట్ల మందికి పీఎన్జీ కనెక్షన్లు అందించాలని లక్ష్యం పెట్టుకోగా, ఇందులో మేఘా గ్యాస్ 1.3కోట్ల కనెక్షన్లు అందించనుందని, 17000కు పైగా సీఎన్జి స్టేషన్లు ఏర్పాటు చేయనుండగా వీటిలో 2200కు పైగా సీఎన్జి స్టేషన్లు ఏర్పాటు చేయనుందని అన్నారు. పట్టణప్రాంతాల కంటే ముందు గ్రామీణ ప్రాంతాల్లో పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్లు అందించేలా దృష్టిపెట్టామని, ఇందులో భాగంగా శరవేగంగా 120 కిలోమీటర్ల పైప్లైన్ నిర్మాణ పనులు పూర్తి చేసిన మేఘా గ్యాస్ ను అభినందించారు అంజనీకుమార్ తివారి.దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు ముఖ్యంగా గ్రామాలకు ఇంటింటికీ పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్లు అందించేందుకు 35వేల కిలోమీటర్ల పైప్లైన్ నిర్మిస్తున్నామని అన్నారాయన. ఈ కార్యక్రమంలో మేఘా గ్యాస్ డైరెక్టర్ సి ఈ ఓ పలింపాటి వెంకటేష్ మాట్లాడుతూ మేఘా గ్యాస్ మహబూబ్‌నగర్ జియోగ్రాఫికల్ ఏరియాలో కాలుష్యరహిత గ్రీన్ ఇంధనాన్ని సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోందని,అదేవిధంగా దేశ వ్యాప్తంగా నేచురల్ గ్యాస్ సేవలు విస్తరించే పనిలో భాగంగా ఇప్పటికే మధ్యప్రదేశ్ లోని ఛింద్వారాలో మొదటి ఎల్సిఎన్జి ప్లాంట్ ప్రారంభించగా, సాగర్,పంజాబ్‌లోని తరంతరన్, తమిళ నాడులోని తిరువణ్ణామలై ప్రాంతాలలో సైతం త్వరలోనే ఎల్సిఎన్జి ప్లాంట్లను ప్రారంభించనున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మేఘా గ్యాస్ ఛీఫ్ జనరల్ మేనేజర్ తిమ్మారెడ్డితో పాటు,మేఘా గ్యాస్ సిబ్బంది పాల్గొన్నారు.

'హెల్త్ డైరెక్టర్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి'

నవతెలంగాణ-బంజారాహిల్స్



అవినీతిపరులలో ఘనుడైన ప్రస్తుత హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఎంహెచ్‌ఓ జేవిఎల్ శిరీష అవినీతి అక్రమాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే త్వరలోనే హెల్త్ డైరెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ యూనియన్ జేఏసీ కమిటీ సభ్యులు హెచ్చరించారు.సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం రాష్ట్ర ఎస్టీ సంఘాల ఐక్యవేదిక కోఆర్డినేటర్ లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు రాజేష్ నాయక్, బీసీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎస్ ప్రసన్న, దళిత మాదిగ చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూసపాటి శ్రీనివాస్ మాదిగలు మాట్లాడారు. అక్రమార్కులను కాపాడే విధంగా రాజకీయాలు చేయవద్దని అతను భద్రాద్రి కొత్తగూడెం నుండి కాంగ్రెస్ పార్టీ ఎంపీ సీటుకు దరఖాస్తు చేసుకోవడం అతని అవినీతిని కప్పిపుచ్చుకోవడమేనని అనేకమందిని ఇబ్బందుల పాలు చేసి ఉద్యోగులకు శారీరక మానసిక హింసలకు గురి చేసిన గడల శ్రీనివాస్ సుమారు కేంద్ర ప్రభుత్వం అందించే నిధులు రూ. 20 కోట్ల నలభై లక్షల వరకు అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు. ఆర్ఎంపీ డాక్టర్ కొడుకుకు వందల వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలన్నారు. ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని సీబీఐ ఎంక్వయిరీ చేయించి అక్రమార్కులను కఠినంగా శిక్షించాలని వెంటనే అతన్ని హెల్త్ డైరెక్టర్ పోస్ట్ నుండి తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్ రాథోడ్, రాజేష్ గుగులోత్, ఆదివాసి గోండు విద్యార్థి సంఘం కన్వీనర్ ప్రకాష్ దొర,గుగులోథ్ కిషన్,బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మీడియా అకాడమీ చైర్మెన్‌కు అభినందనలు..



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

మీడియా అకాడమీ చైర్మెన్ కే. శ్రీనివాస్ రెడ్డిని ప్రముఖ సంఘ సేవకులు సంపత్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ప్రెస్ క్లబ్ లో ఘన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను ప్రత్యే కమైన మాలతో సత్కరించి కేకును కట్ చేయిం చారు. సంపత్ కుమార్ మాట్లాడుతూ మీడియా అకాడమీ చైర్మెన్‌గా శ్రీనివాస్ రెడ్డిని ప్రభుత్వం నియమించడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. ఎంతో అనుభవం గల శ్రీనివాస్ రెడ్డి లాంటి వారిని ప్రభుత్వం నియమించిందని తెలిపారు. జర్నలి స్టుల కష్టనష్టాలపై ఆయనకు ఎంతో అవగాహన ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యలపై శ్రీనివాస్ రెడ్డి న్యాయం చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున జర్నలిస్టులు, ఆయన అభిమానులు పాల్గొన్నారు.

'ప్రజలను సోమరిపోతులను చేస్తున్న ప్రభుత్వం'

- భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉచితల పేరుతో ప్రజలను సోమరి పోతులుగా తయారు చేస్తుందని, ఈ విధానాన్ని మానుకోవాలని భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు గురు వారం ఒక ప్రకటనలో సూచించారు నిరుద్యోగ యువత, ప్రజలకు స్కిల్ వర్క్‌పై ప్రాధాన్యత కల్పించాలని, చిన్న, పెద్ద తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. రైతులకు పంటలపై పూర్తి స్థాయిలో అవగాహ న కార్యక్రమాలు చేపట్టాలని, అధిక దిగుబడులు రావడానికి కృషి చేయాలని, సబ్సిడీ లు ఇవ్వాలని, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో వెనిజులా, శ్రీలంక దేశాలుగా మారిపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర క్రియాశీలకం

- ప్రతీ అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి
- విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- శిక్షణా తరగతులకు హాజరు కాని వారికి షోకాజ్ నోటీసు జారీ చేస్తాం
- హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా గురువారం జూబ్లీహిల్స్‌లోని సేవాలాల్ బంజారా భవన్‌లో ఎన్నికల సెక్టోరల్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా సెక్టోరల్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలు, పరిశీలించాల్సిన విషయాలపై అంశాల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి నిర్వర్తించవలసిన విధుల గురించి తెలియజేస్తూ రూపొందించిన హ్యాండ్ బుక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో నెలకొని ఉన్న పరిస్థితులను ముందుగానే గమనిస్తూ, ఎప్పటి కప్పుడు ఎన్నికలు ప్రశాంతంగా జరిపించేందుకు వల్నరబుల్ మ్యాపింగ్ తయారు చేయాలని, ఎన్నికల పరిశీలకులు వల్నరబుల్ మ్యాపింగ్ ప్రకారం క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారని సూచించారు. ఇదివరకు పని చేసాం కదా అనే భావనతో విధులను ఎంతమాత్రం తేలికగా తీసుకోవద్దన్నారు. ప్రతీ అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని జాగ్రత్తలను సూచించారు. ఎన్నికల కమిషన్ ఎప్పటి కప్పుడు నియమ నిబంధనలు మార్పు చేస్తుందని, ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సెక్టోరల్ అధికారులు శిక్షణ తరగతులకు హాజరు కాని వారిపై షోకాజ్ నోటీసు జారీ చేస్తామని అన్నారు. సెక్టోరల్ అధికారులు పారదర్శకంగా, నిబంధనల మేరకు విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించాలని, ప్రతీ పోలింగ్ స్టేషన్ పరిధిలో తాజా స్థితిగతులను పరిశీలించాలని, గత ఎన్నికల్లో చోటు చేసుకున్న సంఘటనలు, పూర్తి వివరాలు నివేదిక సమర్పించాలని సూచించారు. సెక్టోరల్ అధికారులకు ఎన్నికల సమయంలో ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అధికారాలు ఇస్తామన్నారు. ప్రధానంగా ఓటర్లను ఓటు హక్కు వినియోగించు కోకుండా నిలువరించే వారిని, అలాగే ఓటర్లను ప్రభావితం చేసే వారిపై నిఘా పెట్టి ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ అధికారులు, సెక్టోరల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

నియోజకవర్గంలో స్వచ్ఛమైన మంచినీరు అందిస్తాం

- ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రతి బస్తీలో స్వచ్ఛమైన మంచినీరు అందిస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. నియోజకవర్గంలోని భోలక్ పూర్ డివిజన్‌లో ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డు పక్కన రూ. మూడు కోట్ల ఆరు లక్షల వ్యయంతో మంచినీటి పైపులైన్ పనులను భోలక్ పూర్ కార్పొరేటర్ గౌసుద్దీన్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధిక నిధులతో మంచినీటి పైప్‌లైన్ పనులు ప్రారంభించామని తెలిపారు. ముషీరాబాద్ ప్రధాన రహదారిలో మంచినీటి పైప్‌లైన్ శిథిలా వ్యవస్థకు చేరడంతో డ్రయినేజీ నీరు కలిసి కలుషిత నీరు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. ఇకపై ఎటువంటి ఇబ్బందులు లేకుండా నూతన మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు ముఠా జైసింహ, స్థానిక డివిజన్ ప్రెసిడెంట్ వై శ్రీనివాస్, ముషీరాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి ఆకుల అరుణ్ కుమార్, మహ్మద్ అలీ, శంకర్ గౌడ్, శివ ముదిరాజ్, శ్రీధర్ చారి, ముచ్చ కుర్తి ప్రభాకర్, ఆర్ శ్రీనివాస్, మక్బూల్, జబ్బార్, దీన్ దయాల్ రెడ్డి, సదా ముదిరాజ్, నర్సింగ్ రావు, కే యం సాయి, శ్రీనివాస్, దస్తగిరి, వెంకటేష్, కష్ణ, గోరఖ్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

అందరికి సహాయపడడంలో 'వాసవి' ఎల్లప్పుడు ముందు వరుసలో..

- వాసవి పౌండేషన్ ట్రస్ట్ సభ్యులు అభిషేక్ చందా, సౌమ్య చందా
- బ్లడ్ డొనేషన్ క్యాంపెయిన్‌కు భారీ స్పందన



నవతెలంగాణ-సిటీబ్యూరో

రక్తదానం అనేది ఉత్తమ దానమని చెబుతారు. ఎందుకంటే రక్తదానం.. ఓ మనిషి జీవితాన్ని కాపాడుతుంది. ఆ స్ఫూర్తితో గురువారం వాసవి ఫౌండేషన్ వారు చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో బ్లడ్ డొనేషన్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ బ్లడ్ క్యాంపెయిన్‌లో పాల్గొనడానికి వాసవి గ్రూప్ సభ్యులు ఎంతో మంది ఆసక్తి చూపించారు. వాసవి ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు అభిషేక్ చందా, సౌమ్య చందా క్యాంపెయిన్‌కి విచ్చేసి రక్తదానం చేసిన వారిని అభినం దించారు. అనంతరం వారు మాట్లాడుతూ వాసవి ఫౌండేషన్ ఇలాంటి ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తూ.. అందరికి సహాయపడడంలో ముందు వరుసలో ఉంటుందని చెప్పారు. ఈ అద్భుత ప్రయత్నం వాసవి ఫౌండేషన్ నిరంతరమైన కృషికి చిహ్నం అని, వాసవి ఫౌండేషన్ సమాజంలో విశేష సేవలు అందించడానికి ఎల్లప్పుడు ముందుంటుందని వారు తెలిపారు.

భాషాపాక శ్రీనివాస్‌కు సన్మానం



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ స్టేట్ సిల్ట్ వెహికల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన బీఆర్ఎస్ నాయకులు భాషపాక శ్రీనివాస్‌ను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ గురువారం సన్మానించారు. తెలంగాణ స్టేట్ సిల్ట్ వెహికల్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు ముఠా జై సింహ, బీఆర్ఎస్ ముషీరాబాద్ ప్రెసిడెంట్ కొండా శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్,నర్సింగ్ రావు,శివ ముదిరాజ్, దీన్ దయాల్ రెడ్డి, నారా మురళీధర్, సత్యనారాయణ బాబు, అనిల్ కుమార్(టిల్లు), సదా ముదిరాజ్, భాస్కర్ నేత, యూ శ్రీధర్,సర్వర్, బలవంత్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో సమస్యల పరిష్కారానికి కృషి

- బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ధాత్రిక్ నాగేందర్ బాబ్జి



నవతెలంగాణ-అంబర్‌పేట

ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సహకారంతో కాచిగూడ డివిజన్ పరిధిలోని డ్రయినేజీ సమస్య, ఇతర సమస్యలు పరిష్కరిస్తున్నామని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ధాత్రిక్ నాగేందర్ బాబ్జి అన్నారు. గురువారం కాచిగూడ డిజన్ పరిధిలోని ప్రధాన రహదారిపై డ్రయినేజీ పొంగిపొర్లుతుండడంతో స్థానిక అధికారులతో కలిసి సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మేరు కుల సంఘం ఎన్నికలను త్వరితగతిన నిర్వహించాలి

- తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్ర మేరు కుల సంఘానికి జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ఎన్నికలు నిర్వహించి పేర్ల జాబితాను రాష్ట్ర మేరు సంఘం కార్యాలయానికి పంపాలని ఆ సంఘం అడహక్ కమిటీ కోరింది. గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం, ట్రస్ట్ చైర్మెన్ పి.నర్సింగరావు, ముఖ్య సలహాదారులు కె.భాస్కర్ రావు, అడహక్ కమిటి కన్వీనర్ అడపా వెంకటేశ్వర్ రావు, నాయకులు ఎస్.బి.సంఘమేశ్వర్, డి.నర్సింగ్ రావు, కె.వెంకటేశ్ తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటికే అనేక జిల్లాల్లో ఎన్నికలు జరిగాయని, ఇంకా కొన్ని మండల, జిల్లా కేంద్రాల్లో మాత్రం జరగవలసి ఉందని చెప్పారు. మార్చి 31వ తేదీలోగా ఎన్నికలు నిర్వహించుకోవాలని వారు సూచించారు. ఆ తర్వాత పేర్ల జాబితాను రాష్ట్ర కమిటీకి పంపించినా అంగీకరించబోమని హెచ్చరించారు. ఇప్పటి వరకు వివిధ జిల్లాల నుంచి 9 వేల మంది వారి పేర్ల జాబితాను పంపించారని తెలిపారు. మిగిలిన 3, 4 వేల మంది త్వరితగతిన పంపించాలని కోరారు. లేని పక్షంలో అడహక్ కమిటీ ఎలాంటి బాధ్యత వహించదన్నారు.



టైలర్స్ డేను పురస్కరించుకొని సేవ యూత్ అధ్యక్షులు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రముఖ హైకోర్టు న్యాయవాది జి ఎల్ నరసింహారావు హాజరై పలువురు టైలర్స్‌కు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

'డీఎస్సీ రద్దు చేసి టెట్ నోటిఫికేషన్ విడుదల చేయాలి'

- లేకపోతే మార్చి 4న రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది నిరుద్యోగులతో ఆందోళన కార్యక్రమాలు
- విద్యావిధానం రద్దుకు ఉద్యమించాలి
- రాజ్య సభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హెచ్చరిక
- సైఫాబాద్‌లోని రాష్ట్ర విద్యా శాఖ కమిషనరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేసి, టెట్ నోటిఫికేషన్ విడుదల చేసి 25 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని, లేకపోతే మార్చి 4వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున వేలాది మంది నిరుద్యోగులతో నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు.ఈ మేరకు గురువారం తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ నీల వెంకటేష్ ఆధ్వర్యంలో వందలాది మంది నిరుద్యోగులు సైఫాబాద్‌లోని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ ఒకేసారి వేయడానికి ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరం ఏమిటని ఆయన ప్రశ్నించారు.గతంలో వేసిన టెట్ పరీక్షలో 10 శాతం మంది మాత్రమే పాసయ్యారని, మిగతా 90 శాతం మంది ఫెయిల్ అయ్యారని విచారం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెచ్చుకుంటే ప్రజా ప్రభుత్వం పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తుందని విమర్శించారు. గత టెట్ సిలబస్ మారినందున టెట్ అభ్యర్థులు అర్హత సాధించలేకపోయారని, చాలా మంది టీచర్లు పదోన్నతి పొందలేకపోయారని, ఇప్పుడు టెట్ పరీక్ష రాసి పదోన్నతి, అర్హత పొందుతారని, డీఎస్సీ, టెట్ ఒకే సారి వేయాలని ఆయన డిమాండ్ చేశారు.పాఠశాలల్లో టీచర్లు లేకుండా తరగతులు ఎలా నిర్వహిస్తారని, విద్యార్థులకు చదువులు ఎవరూ చెపుతారని, విద్యా ప్రమాణాలు ఎలా మెరుగవుతాయని ఆయన ప్రశ్నించారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీసీ నాయకులు జిల్లపల్లి అంజి, సి.రాజేందర్, పలు జిల్లాల నుంచి నిరుద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి గౌరవ అధ్యక్షులు ఎర్రోజు శ్రీనివాస్



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ రాష్ట్ర సాధనలో అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి గౌరవ అధ్యక్షులు ఎర్రోజు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉద్యమ కారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎర్రోజు శ్రీనివాస్ మాట్లాడుతూ. ఉద్యమంలో వీరోచితంగా పోరాడిన ఉద్యమకారులను గుర్తించాలని వారికి 250 గజాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని, హెల్త్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని, ఉచితంగా రవాణా సదుపాయం కల్పించాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల సంక్షేమ సమితి అధ్యక్షులు రూబీ స్టీవెన్సన్, ప్రధాన కార్యదర్శి తెలంగాణ వెంకన్న, నాయకులు బండి రమేష్, జిల్లా నాగేశ్వరావు, కరుణా యశ్వాల్, ఉప్పు సుధాకర్, అర్జునావు, కోశాధికారి రామచందర్ గౌడ్, యుగేందరశర్మ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ మేమూ ధరిస్తున్నాం, మీరు ధరించండి



నవతెలంగాణ-సిటీబ్యూరో

హెల్మెట్ ధరించడంతో నిర్లక్ష్యం చేయవద్దని, ద్విచక్ర వాహనాలు నడిపించే ప్రతొక్కరు హెల్మెట్ ధరించాల ని ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడు, ఏసీపీ జీ.శంకర్‌రాజు తెలిపారు. బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం సికింద్రాబాద్ లో పీజీ కాలేజీ ఆడిటోరియంలో 'రోడ్డు ప్రమాదాలు నివారణ' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు హెల్మెట్ వస్తువు కాదు ప్రాణాన్ని కాపాడే ఆయుధమని వివరించారు. పోలీస్ సిబ్బంది సైతం హెల్మెట్ ధరిస్తారని, వాహన దారులు హెల్మెట్ ధించాలని కోరారు. అధికసంఖ్యలో యువత ఓవర్ స్పీడ్ , రాంగ్ రూట్ , సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నారని తెలి పారు. మోటార్ వాహనాల నిబంధనల మేరకు (రైడర్ పిలియన్ రైడర్) వాహనం నడిపించేవారితో పాటు వెనుకాల కూర్చున్న వారుకూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

వాహనం నడిపించేవారి ప్రాణా లు ఎంత ముఖ్యమో వెనుక కూర్చున్న వ్యక్తి ప్రాణాలు కూడా అంతే ముఖ్యమ న్నారు. 18 సంవత్సరములు నిండి న ప్రతి ఒక్కరు తప్పని సరిగా లైసెన్స్ తీసుకోవాలన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ఐసీఐసీఐ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, సొసైటీ రోడ్ సేఫ్టీ వారి సహకారంతో ట్రాఫిక్ సిబ్బందితోపాటు వారి పిల్లలకు 600 హెల్మెట్స్ ఉచితంగా అందజేశారు. కాలే జీ ప్రిన్సిపాల్ ప్రొ.జే. రవికుమార్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ మృదులాతోపాటు ఆరాధన్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌గా హేమంత కేశవ్ పాటిల్ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా (రెవెన్యూ) హేమంత కేశవ్ పాటిల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆయన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకేను అందజేశారు. నల్గొండ జిల్లా అదనపు కలెక్టర్‌గా (లోకల్ బాడీస్) పనిచేసిన ఆయన హైదరాబాద్‌కు బదిలీపై వచ్చారు.

ఆస్తిపన్ను వివాదాల పరిష్కారానికి ప్రత్యేక అవకాశం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆస్తిపన్ను చెల్లింపులు, వివాదాలకు సంబంధించి నగర వాసులకు ప్రత్యేక అవకాశాన్ని కల్పిస్తున్నట్టు జీహెచ్ఎంసీ వెల్లడించింది. ప్రాపర్టీ టాక్స్ పరిష్కారాలు(పీటీపీ) పేరుతో సర్కిల్ కార్యాలయాల్లో మార్చి 3 నుంచి 31 వరకు ప్రతి ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు.

ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే పీటీపీలో ఆస్తి పన్నుల మందిపు, చెల్లింపు, కోర్టు వివాదాలతోపాటు ఇతర పన్నులకు సంబంధించిన సమస్యలనూ పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

'ప్రభుత్వ కాంట్రాక్టు పనుల్లో వడ్డెరులకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలి'

- రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

వడ్డెర కులస్తులకు రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు పనుల్లో 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ వడ్డెర సంఘం, తెలంగాణ వడ్డెర కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు వేముల వెంకటేష్, అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.రమేష్ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధి బృందం వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం తరతరాలుగా వడ్డెర కులస్తులు చేసే పనులు బిల్డింగ్‌లకు పునాదులు తీయడం, రోడ్లు వేయడం, కెనాల్స్, బావులు తవ్వడం, పెద్ద, పెద్ద డ్యాములు కట్టడం, ప్రాజెక్టుల నిర్మాణంలో పాల్గొనడం వంటి పనులు చేస్తూ జీవనాధరం పొందుతున్నారని తెలిపారు.ఈ కాంట్రాక్టు పనుల్లో గత ప్రభుత్వాలు వడ్డెరులకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు కల్పించాయని, కావున బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో నంబర్.59ని విడుదల చేసి ఎస్సీ, ఎస్టీ, వడ్డెర, సగరలకు 15 శాతం నుంచి 24 శాతం వరకు రిజర్వేషన్లు కల్పించిందని, దీంతో వడ్డెరలకు కేవలం 3 శాతం రిజర్వేషన్లు మాత్రమే వర్తించాయని విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వడ్డెరులకు కాంట్రాక్టు పనులు లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు.వడ్డెరులకు న్యాయం చేయడానికి ప్రభుత్వ పనుల్లో 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వడ్డెరుల సమస్యలను సీఎం ఎ.రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి తగిన న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

విద్యా తాత్విక దృక్పథాలు ప్రభుత్వాలు విస్మరించాయి

- దేశంలో విద్యను చూసే కోణంలో లోపం ఉంది
- అప్రజాస్వామిక నూతన జాతీయ విద్యావిధానం రద్దుకు ఉద్యమించాలి
- ప్రొఫెసర్ కొండా నాగేశ్వరావు



నవతెలంగాణ-ముషీరాబాద్

విద్యాతాత్విక దృక్పథాలను ప్రభుత్వాలు విస్మరించాయని ప్రొఫెసర్ కొండా నాగేశ్వరావు అన్నారు. గురువారం పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు గడ్డం శ్యామ్ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలు – నూతన ప్రభుత్వం అంశంపై విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చైనా, రష్యా దేశాలు విద్యను మానవ వనరులను ఉత్పత్తి చేసే కేంద్రాలుగా చూస్తుంటే మనదేశంలోని ప్రభుత్వాలు విద్య తాత్విక దృక్పథాలు విస్మరించారని అన్నారు. దాంతో విద్యకు అనాది నుంచి పాలకవర్గ పార్టీలు సరిపడా నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తూ, విద్య కార్పొరేటీకరణను, ప్రయివేటీకరణను ప్రోత్సహించారని పేర్కొన్నారు. భౌతిక సమస్యలతో పాటు భావజాల వ్యాప్తి ఉద్యమాలు విస్తతంగా నిర్వహించాలని అప్పుడే పాలకవర్గ పార్టీలు విద్యపై దృష్టి పెట్టే విధంగా ఒత్తిడి చేయొచ్చని తెలిపారు. అప్రజాస్వామిక నూతన జాతీయ విద్యా విధానం రద్దుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ మాట్లాడుతూ. పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిద్దేశ్వర్ మాట్లాడుతూ. రాజకీయ పార్టీలు వారి ఓట్ల శాతంలో విద్యార్థులను లెక్కిస్తూ విద్యారంగాన్ని చిన్న చూపు చూస్తున్నారన్నారు. విద్యా కార్పొరేటికరణ మూలంగా పేద, మధ్యతరగతి విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఓయూ రీసెర్చ్ స్కాలర్ ఆజాద్, ఎస్ఎఫ్ఐ లెనిన్, ఎబిడిఎస్ఓ నితీష్, ఎస్ఎస్ఎఫ్ చార్వాకలు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం రాష్ట్రంలో అమలు చేయబోమని రేవంత్ సర్కార్ హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి సహకరించిన విద్యాశాఖ అధికారుల అవినీతిపై విచారణ జరిపించాలని కోరారు. విద్యార్థులందరికి ఉచిత బస్ పాస్‌లు ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్స్ సాధనకై ఐక్యంగా ఉద్యమిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి శ్రీను, విద్యా నగర్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గౌతం, ఆసిఫ్, ఓయూ నేత గణేష్,జిల్లా నాయకులు జి.గణేష్, పవన్, జేటంగి గణేష్, ప్రవలిక, షాబాన, మహేష్, చరణ్, గణేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



ఉమా మణి... క్లైమేట్ ఛాంపియన్. తన 49 ఏండ్ల వయసులో మొదటి సారి నీటి అడుగున డైవ్ చేసింది. అప్పటి నుండి సముద్ర పరిరక్షణ కోసం అవిశ్రాంతంగా పోరాడుతూనే ఉంది. ఇప్పుడు అతి పెద్ద సముద్రం ఆమె కాన్వాస్‌గా మారింది. నీటి అడుగున తన అనుభవాలను అందంగా చిత్రించింది. ఇటీవల అవార్డు గెలుచుకున్న డాక్యుమెంటరీ 'కోరల్ ఉమెన్'కి ఆమే ఓ ప్రధాన అంశంగా మారింది. ఇప్పుడు ఆమె ఓ పగడపు స్త్రీ. అంతరించిపోతున్న పగడపు దిబ్బలు, సముద్ర పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ఈ డాక్యుమెంటరీని పొందుపరిచారు. కళాకారురాలు, సర్టిఫైడ్ స్కూబా డైవర్ అయిన ఆమె ఇటీవల సోనీ బిబిసి ఎర్త్ ద్వారా ఎర్త్ ఛాంపియన్ ఆఫ్ ది మంత్‌గా ఎంపికైన సందర్భంగా ఆమె పరిచయం నేటి మానవిలో...

భారత కోరల్ ఉమెన్

ఉమా చిన్నతనంలో బొమ్మలు గీస్తుంటే 'వీటి వల్ల రంగులు, పేపర్లు వేస్ట్, బాగా చదువుకుని మంచి వ్యక్తిని పెండ్లి చేసుకుంటే చాలు' అని అమ్మమ్మ అనడంతో కళపై తనకున్న ఆసక్తిని పక్కనపెట్టేసింది. డాక్టర్‌ను పెండ్లి చేసుకొని భర్తతో కలిసి చెన్నై నుండి మాల్దీవులకు వెళ్లింది. అప్పటి నుండి కుటుంబానికే పరిమితమై రంగుల కాన్వాస్‌కు చాలా దూరమయ్యింది. తిరిగి 45 ఏండ్లు వచ్చిన తర్వాత తను కోల్పోయిన రంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టింది. అంతేకాదు సముద్రం, పగడపు దిబ్బల వైపుకు సైతం ఆమె మనసు మళ్లింది.

అతి తక్కువ మంది వెళ్లే ప్రదేశం

కోరల్ ఉమెన్‌గా గుర్తింపు పొందడానికి ఉమా ఎంతో శ్రమించాల్సి వచ్చింది. 40 ఏండ్లు దాటిన తర్వాత స్విమ్మింగ్, స్కూబా-డైవింగ్ చేయడానికి సిద్ధమయ్యింది. నీటి అడుగున పగడపు దిబ్బల గుండా ఈదడం మొదలు పెట్టింది. అప్పటి వరకు అతి తక్కువ మంది మహిళలు వెళ్ళిన ప్రదేశానికి వెళ్లేందుకు ధైర్యం చేసింది. 'నా కొడుకు కాలేజీలో చేరిన తర్వాత నేను పెయింటింగ్ ప్రారంభించాను. వాటిలో కొన్నింటిని మాల్దీవులకు ఫ్రెంచ్ నేర్చుకునేందుకు వచ్చిన అలయన్స్ ఫ్రాన్‌కైస్ డైరెక్టర్‌కి (మ్యూరియల్ ష్మిత్) చూపించాను. ష్మిత్ ఒక థీమ్‌పై 30 చిత్రాలు గీయాల్సిందిగా నన్ను అడిగారు. వాటితో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తానని నాకు వాగ్దానం చేశారు. అందుకే రోజా గులాబీలకు పెయింటింగ్ వేయడం మొదలుపెట్టాను. తులిప్స్‌కి వెళ్లి నా స్నేహితురాలి 50వ పుట్టినరోజున వాటిని బహుమతిగా ఇచ్చాను' అని ఉమ పంచుకున్నారు.

జనం పెద్దగా రాలేదు

అప్పటి వరకు తన చుట్టూ సముద్రం ఉన్నప్పటికీ ఆ నీటికి మాత్రం దూరంగా ఉంది. ఏప్రిల్ 2010లో ఆమె ఫ్రాన్స్‌కు చెందిన పరిశోధకుడైన డాక్టర్ పాస్కేల్ చబోనెట్ ద్వారా పగడపు దిబ్బలపై తీసిన ఒక డాక్యుమెంటరీని చూసింది. దాని తర్వాత ఉమా పగడాల ఉపయోగం, మహాసముద్రాల ప్రాముఖ్యత పై కొన్ని ముఖ్యమైన విషయాలు నేర్చుకుంది. త్వరలో ఆమె పగడపు దిబ్బలను చిత్రించాలని నిర్ణయించుకుంది. ఉమా తన మొదటి చిత్రాలను మాల్దీవుల్లోని మెరైన్ సెంటర్‌లో ప్రదర్శించింది. అయితే దాన్ని చూసేందుకు జనం పెద్దగా రాలేదు. కళలో ప్రాథమిక శిక్షణ లేని ఆమె ఏ మాత్రం నిరుత్సాహపడలేదు. పెయింటింగ్‌ను కొనసాగించారు. అధైర్యపడకుండా నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు సెలవులకు చెన్నై వెళ్ళి అక్కడే ఆర్ట్ కోర్సులో చేరింది.



కొత్తగా కావాలి


వివాంటా మాల్దీవుల్లో ఆమె ఎగ్జిబిషన్‌లో ఒక సందర్శకురాలి నుండి వచ్చిన కామెంట్ ఉమా దృష్టికోణాన్ని పూర్తిగా మార్చేసింది. 'నేను ఎన్నడూ చూడని చిత్రాన్ని చూడాలనుకుంటున్నాను అని ఒక మహిళ నన్ను అడిగారు. అయితే ఆమె చెప్పిన తీరు మొదట నాకు కోపం తెప్పించింది. కానీ అందులో చాలా నిజం ఉందని గ్రహించాను. అప్పటి వరకు నేను ఎప్పుడూ స్విమ్మింగ్ చేయలేదు, నీటి అడుగున వెళ్ళలేదు. పగడపు దిబ్బల గురించి నేను చిత్రించిన చిత్రాల నుండే ఆ అనుభవం వచ్చింది' అని ఉమ గుర్తుచేసుకుంది. సలహా కోసం తన స్నేహితుడు డాక్టర్ అమల్ అలీని ఆశ్రయించింది. అలీ ఆమెను మాల్దీవుల మొదటి మహిళా డైవర్ షహీనా అలీకి పరిచయం చేసాడు. డైవింగ్ చేయాలనుకునే ఉమకు ఇప్పుడు మొదటి సవాలు ఈత నేర్చుకోవడం.

కోరల్ వుమన్ మేకింగ్

అధైర్యపడకుండా ఉమ అనేక డాక్యుమెంటరీ చిత్రనిర్మాతలను కలిసింది. కానీ వారి నుండి ఎటువంటి స్పందన రాలేదు. ఆ తర్వాత ఆమె ఎన్‌డిటివి ఆఫీస్‌కి కాల్ చేసింది. అక్కడే ఆమెకు ఫిల్మ్ మేకర్ ప్రియా తువస్సేరి నంబర్ ఇచ్చారు. ఆమెను సంప్రదించి 'కోరల్ రీఫ్ గార్డెన్‌ల పెయింటింగ్ ఎగ్జిబిషన్‌లపై డాక్యుమెంటరీకి సహకరించగలరా' అని అడిగింది. కొంత కాలం వారి సంభాషణలు ఫోన్‌లో, స్కైప్‌లో కొనసాగాయి. 2017లో ఇద్దరూ కలుసుకున్నారు. 'కానీ ప్రియకు వేరే ఆలోచనలు ఉన్నాయి. నాపై ఓ డాక్యుమెంటరీ తీయాలనుకున్నారు. ఎందుకంటే నా వయసులో చాలా మంది మహిళలు ఇలాంటి పనులు పెద్దగా చేయరు. నాకు అవకాశం వచ్చింది దాన్ని ఉపయోగించు కున్నాను' అని ఉమా పంచుకుంది. ఉమా అంగీకరించడానికి కొంత సమయం పట్టింది. కోరల్ రీఫ్ గార్డెన్స్, కోరల్ వుమన్‌కి సంబంధించిన డాక్యుమెంటరీకి మధ్య గొడవ జరిగింది. కానీ చివరికి తువస్సేరి గెలిచింది. 2018లో తూర్పు తీరంలో రామేశ్వరం, రామనాథపురం, టుటికోరిన్‌లలో చిత్రీకరణ ప్రారంభించారు.

ఆమెను కదిలించింది

సముద్రంలోకి చాలా మురుగునీరు పంప్ చేయబడటం వల్ల ఆమె ఒక్క రోజుకే అనారోగ్యానికి గురయ్యింది. అయినా తన ప్రయాణం ఆపలేదు. ప్రతిరోజూ జరిగే ప్రతి డైవ్ తర్వాత ఉమ నోట్స్ తయారు చేసుకునేది. రంగులతో పాటు ఒక చిత్రాన్ని మనసులో ఉంచుకునేది. అయితే నీటి అడుగున జరుగుతున్న విధ్వంసం ఆమెను కదిలించింది. 'రసాయనాలు, పురుగుమందులు, ఎరువులు, ప్లాస్టిక్, మురుగుతో సముద్రం నిండి ఉంది. దీని ఫలితంగా పగడపు దిబ్బలు నశించిపోతున్నాయని ఆమె గుర్తించింది.



ప్రత్యక్షంగా అర్థం చేసుకుంది

2016లో జరిగిన మాల్దీవుల మెరైన్ సింపోజియంలో ఉమా తన పెయింటింగ్స్‌ను ప్రదర్శించింది. దాంతో ఆమె కెరీర్ ఓ మలుపు తిరిగింది. పగడపు దిబ్బల ప్రాముఖ్యత, సముద్ర పరిశోధనలోని వివిధ అంశాలు, కనుమరుగౌతున్న పగడపు దిబ్బల స్థితిని ప్రత్యక్షంగా అర్థం చేసుకుంది. తన కొడుకు బహుమతిగా ఇచ్చిన కెమెరాతో నీటి అడుగున షూట్ చేయాలని నిర్ణయించుకుంది. తన అనుభవాలతో డాక్యుమెంటరీ తీయాలని ఓ ప్రయత్నం చేసింది. 'సినిమా నిర్మాణం గురించి నాకు ఏమీ తెలియదు. ఇది ఒక మూకీ సినిమా. పాత చార్లీ చాప్లిన్ సినిమాలా ఉంది' అని ఆమె నవ్వుతూ చెప్పింది.


అవగాహన కీలకం

పగడపు దిబ్బలు నీటి అడుగున పర్యావరణ వ్యవస్థను అందిస్తాయి. శక్తివంతమైన అలల నుండి తీరాన్ని రక్షిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా పర్యాటకం, సాహస పరిశ్రమలకు ఇవి ఆదాయ వనరులు. పగడపు దిబ్బలు బఫర్‌గా పనిచేసి నీటి పీడనాన్ని తగ్గించినందునే 2004 సునామీ భారతదేశాన్ని ప్రభావితం చేసినంతగా మాల్దీవులను ప్రభావితం చేయలేదని ఆమె గుర్తుచేసింది. అంతరించి పోతున్న పగడాలను కాన్వాస్‌పై చిత్రించడం కూడా ఆమెకు ఇదే తొలిసారి. 2019లో సినిమా విడుదలైన తర్వాత తన అనుభవాల గురించి మాట్లాడటానికి ఆమె బృందంతో కలిసి అనేక ప్రాంతాలకు వెళుతుంది. ఇప్పుడు తమిళనాడులోని దిండిగల్‌లో ఉన్న ఉమ, సముద్ర సంరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావాల గురించి పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులతో పాటు కార్పొరేట్ సంస్థలతో కూడా మాట్లాడుతూ అవగాహన కల్పిస్తుంది.

రెండవ రోజు మానేసింది

2014లో ఉమా చెన్నైకి వచ్చి 15 రోజుల స్విమ్మింగ్ కోర్సులో చేరింది. మాల్దీవులకు తిరిగి వచ్చిన తర్వాత కొడుకు తన తల్లికి 25వ వివాహ వార్షికోత్సవ బహుమతిగా స్కూబా-డైవింగ్ కోర్సు కోసం సైన్ అప్ చేశాడు. 'డైవ్ మొదటి రోజు సరిగా చేయలేదు. రెండవ రోజు అసలు వెళ్ళలేదు. నా డైవ్ మాస్టర్ యామిన్ ఇలా మానుకోవడం సరైనది కాదని, ప్రయత్నించినా అప్పటికీ రాకపోతే మానుకోని చెప్పారు. మానసికంగా సిద్ధమై నెల రోజుల సమయం తీసుకున్నాను' ఆమె చెప్పింది. తన మొదటి డైవ్‌లో ఉమా నీటి అడుగున చూసిన దృశ్యాలను చూసి మురిసిపోయింది. పగడాలు, రంగు రంగుల చేపలు, సముద్రపు పాము, ఒక చిన్న సొరచేపను చూసింది. ఇక తన తదుపరి డైవ్‌ల నుండి సముద్రపు మాయా ప్రపంచాన్ని కాన్వాస్‌లోకి దింపింది. ఆమె కళ ఇప్పుడు విభిన్న వీక్షణలు, అంతర్దృష్టులతో సజీవంగా మారింది.





ఇక సోలార్ వెలుగులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

"పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన" పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గ సమావేశం జరిగింది. అనంతరం నేషనల్ మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రులు అనురాగ్ ఠాకూర్, అశ్వినీ వైష్ణవ్ కేంద్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. ఉచిత కరెంటు పథకానికి ఆమోదం దక్కిందని, ఈ స్కీమ్ కింద కోటి కుటుంబాలకు 300 యూనిట్ల కరెంటు ప్రతి నెలా ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. 2025 నాటికి అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలపై రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు వెబ్‌సైట్‌లో గృహ వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. "సోలార్ పవర్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేసేందుకు కావాల్సిన ఖర్చులో కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.78 వేలు ఇవ్వనున్నది. దేశవ్యాప్తంగా దాదాపు కోటి ఇండ్లకు ఈ పథకం అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఉచిత కరెంటు స్కీమ్ కింద కేంద్ర ప్రభుత్వం రూ.75,021 కోట్లు కేటాయించింది" అని తెలిపారు.

మూడు సెమీకండక్టర్స్ యూనిట్ల ఏర్పాటు

దేశంలో సెమీకండక్టర్స్ అండ్ డిస్‌ప్లే మాన్యుఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్స్ డెవలప్‌మెంట్ కింద మూడు సెమీకండక్టర్ యూనిట్ల స్థాపనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. మూడు యూనిట్ల నిర్మాణాన్ని వచ్చే 100 రోజుల్లో ప్రారంభించనున్నారు. దేశంలో సెమీకండక్టర్స్ అండ్ డిస్‌ప్లే మాన్యుఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్ అభివృద్ధి ప్రోగ్రామ్ కోసం డిసెంబర్ 21న మొత్తం రూ. 76,000 కోట్లను కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. 2023 జూన్‌లో గుజరాత్‌లోని సనంద్‌లో సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటు చేయడానికి మైక్రోన్ ప్రతిపాదనను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది.

ఖరీఫ్ సీజన్ ఎరువుల సబ్సిడీకి ఆమోదం

ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల సబ్సిడీకి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2024 (2024 ఏప్రిల్ 1 నుండి 2024 సెప్టెంబర్ 30 వరకు) ఫాస్ఫేటిక్, పొటాసిక్ (పికె) కోసం పోషకాల ఆధారిత సబ్సిడీ (ఎన్బీఎస్) రేట్లను నిర్ణయించడానికి కేంద్ర ఎరువుల శాఖ ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఎరువులు అండ్ ఎన్బీఎస్ పథకం కింద మూడు కొత్త ఎరువుల గ్రేడ్‌లను చేర్చే ప్రతిపాదనను ఆమోదించింది. ఖరీఫ్ సీజన్ 2024 కోసం తాత్కాలిక బడ్జెట్ సుమారు రూ.24,420 కోట్లు అవసరమని పేర్కొంది.

2023-24 నుండి 2027-28 వరకు ఐదేండ్ల కాలానికి రూ.150 కోట్లతో ఒకేసారి బడ్జెట్ మద్దతుతో దేశంలో ప్రధాన కార్యాలయంతో ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్ (ఐబీసీఎ) ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) చట్టం, 1957కి బెరీలియం, కాడ్మియం, కోబాల్ట్, గాలియం, ఇండియం, రెనియం, సెలీనియం, టాంటాలమ్, టెల్లూరియం, టైటానియం, టంగ్‌స్టన్, వనాడియం వంటి 12 కీలకమైన, వ్యూహాత్మక ఖనిజాలకు సంబంధించి రాయల్టీ రేటును పేర్కొనడానికి రెండో షెడ్యూల్ సవరణకు కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. నాగ్‌పూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వన్ హెల్త్ డైరెక్టర్‌గా సైంటిస్ట్ హెచ్ స్థాయిలో (పే లెవెల్ 15లో) ఒక పోస్టును పెట్టే ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సమీకృత వ్యాధి నియంత్రణ, మహమ్మారి సంసిద్ధత కోసం బహుళ మంత్రిత్వ, బహుళ విభాగ జాతీయ వన్ హెల్త్ మిషన్‌పై మానవులు, జంతువులు, మొక్కలు, పర్యావరణ రంగాలను ఏకతాటిపైకి తీసుకురావడమే లక్ష్యం అని పేర్కొంది. నెల వేతనం రూ.1,82,000 నుంచి రూ.2,24,100 వరకు ఉంటుంది. ఏడాదికి రూ.35.59 లక్షలు ఉంటుంది.

హిమాచల్‌లో ఆరుగురిపై వేటు

సిమ్లా : రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీకి క్రాస్ ఓటింగ్ వేసిన హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపడింది. ఎమ్మెల్యేలు రాజిందర్ రాణా, సుధీర్ శర్మ, ఇందర్ దత్ లఖన్‌పాల్, దేవిందర్ భుట్టో, రవి ఠాకూర్, చైతన్యశర్మలను అనర్హులుగా ప్రకటిస్తున్నట్లు అసెంబ్లీ స్పీకర్ కుల్దీప్ పటానియా గురువారం ప్రకటించారు. బుధవారం ఆ ఆరుగురు సభ్యులు సభకు హాజరయ్యారని, అసెంబ్లీలో ఆర్థిక బిల్లును ప్రవేశపెట్టినప్పుడు సభలో లేరని స్పీకర్ తెలిపారు. పార్టీ విప్‌ను ఉల్లంఘించినందున ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆరుగురు ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని నిలిపివేస్తున్నామని, ఇది తక్షణం అమలులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆరుగురు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేయడంతో రాష్ట్రం నుంచి ఉన్న ఒకే ఒక్క రాజ్యసభ స్థానానికి జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ సింఘ్వీ ఓటమి పాలవగా, బీజేపీకి చెందిన హర్ష్ మహాజన్ గెలుపొందిన సంగతి తెలిసిందే.

రైతులు ఆందోళన చేశారని.. పాస్‌పోర్ట్, వీసాలు రద్దు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ సరిహద్దుల్లో నిరసనలు చేపట్టిన రైతులపై హర్యానా పోలీసులు కుట్ర పూరిత, బెదిరింపు చర్యలకు సిద్ధమయ్యారు. రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధర, పలు డిమాండ్ల సాధనకు జరుగుతున్న ఆందోళనలో పాల్గొన్న పలువురు రైతులను గుర్తించి, వారి పాస్‌పోర్ట్‌లు, వీసాలను రద్దు చేయాలని హర్యానా ప్రభుత్వం నిర్ణయించింది. ఫిబ్రవరి 21న ఖానౌరీ సరిహద్దులో శుభకరణ్ సింగ్ మృతి పట్ల గుర్తు తెలియని వ్యక్తులపై వారం రోజుల అనిశ్చితి తరువాత ఎట్టకేలకు హత్య కేసు నమోదు చేయడంతో ఆయన మృతదేహానికి పోస్టుమార్టం చేయడానికి రైతులు, కుటుంబ సభ్యులు అంగీకరించారు. బుధవారం రాత్రి శుభకరణ్ సింగ్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం రాజింద్ర ఆస్పత్రి నుంచి ఖానౌరీ సరిహద్దుకు తీసుకెళ్లిన శుభకరణ్ సింగ్ భౌతిక కాయానికి రైతు నాయకులు నివాళులర్పించారు. ఆయన భౌతికకాయంపై తమ సంఘాల జెండాలను కప్పారు. అనంతరం గురువారం మధ్యాహ్నం బటిండాలోని ఆయన స్వగ్రామంలో అంత్యక్రియలు జరిగాయి. అంబులెన్స్ వెంట నడిచిన రైతులు 'అమర్ షహీద్ శుభకరణ్ సింగ్, జిందాబాద్' అంటూ నినాదాలు చేశారు. ఆయన మృతికి కారకులైన వారిని వెంటనే పట్టుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

జ్ఞాన్‌వాపిలో పూజకు అనుమతించిన రిటైర్డ్ జడ్జికి పదవి

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చైర్‌పర్సన్‌గా ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే విశ్వవిద్యాలయం) లోక్‌పాల్ (అంబుడ్స్‌మన్)గా నియమించినట్టు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. విశ్వేషా ఈ పదవిలో మూడేండ్ల పాటు ఉంటారు. యూనివర్సిటీ లోక్‌పాల్ విద్యార్థుల ఫిర్యాదులను పరిష్కరించే బాధ్యతను కలిగి ఉంది. విశ్వేషా మూడేండ్లపాటు లోక్‌పాల్‌గా నియమితులైనట్టు యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బ్రిజేంద్ర సింగ్ ధృవీకరించారు. సమాజంలోని రెండు మతాల మధ్య సున్నితమైన అంశంలో తీర్పునిచ్చిన వ్యక్తిని ఇప్పుడు అంబుడ్స్‌మన్‌గా నియమించటం పట్ల సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రంలోని మోడీ సర్కారు పరోక్షంగా న్యాయవ్యవస్థను సైతం ప్రభావితం చేస్తున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే కీలక కేసుల్లో 'ప్యాకేజీ తీర్పులు' వెలువడుతున్నాయనీ, పదవీ విరమణ అనంతరం సదరు న్యాయమూర్తులకు కీలక పదవులు వరిస్తున్నాయని సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేరళ లోకాయుక్త బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం



తిరువనంతపురం : కేరళ లోకాయుక్త (సవరణ) బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేయడంపై కేరళలోని అధికార ఎల్‌డీఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. కేరళ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై సంతకం చేయడానికి 'మొండిగా నిరాకరిస్తున్న' గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ వైఖరికి ఇది విరుద్ధంగా ఉందని స్పష్టం చేసింది. కేరళ న్యాయశాఖ మంత్రి పి.రాజీవ్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎం వి గోవిందన్ మాట్లాడుతూ ఈ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించడాన్ని ప్రభుత్వ విజయంగా అభివర్ణించారు. గవర్నర్ ఖాన్‌కు నిరాశగా వర్ణించారు. అసెంబ్లీ అమోదించిన బిల్లులపై సంతకం చేయకుండా గవర్నర్ ఖాన్ తన వద్దే నిలిపి ఉంచుకోవడాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును కేరళ ప్రభుత్వం ఆశ్రయించిన సంగతి తెలిసిందే. దీంతో ఏడు బిల్లులను రాష్ట్రపతి పరిశీలన కోసం ఖాన్ పంపారు. వీటిలో కేరళ లోకాయుక్త (సవరణ)బిల్లు కూడా ఒకటి. మరోవైపు, కేరళ లోకాయుక్త (సవరణ) బిల్లును మాత్రమే రాష్ట్రపతి ఆమోదించారని, మిగిలిన ఆరు బిల్లులు రాష్ట్రపతి వద్ద పరిశీలనలో ఉన్నాయని రాజ్‌భవన్ ఒక ప్రకటనలో తెలిపింది.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జర్నలిస్టుల సామాజిక భద్రత, సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్ కె. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. హైదరా బాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనను చైర్మెన్‌గా నియమించిన సీఎంను కలిశాననీ, రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యల గురించి ఆయనతో క్షుణ్ణంగా చర్చించానని అన్నారు. ఇండ్ల స్థలాల విషయంలో సీఎం సానుకూలంగా ఉన్నారని చెప్పారు. జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని సర్కారు ఆదేశాలు ఇచ్చింది. హైదరాబాద్ లోని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ సభ్యులు ఒక్కొక్కరు తమకు రావాల్సిన ఇండ్ల స్థలాల కోసం 17 ఏండ్ల క్రితం రెండున్నర లక్షల రూపాయలు కట్టారని గుర్తు చేశారు. వారికి ఇవ్వాల్సిన స్థలాలు ఇవ్వటానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే 60 మంది జర్నలిస్టులు ఇంటి స్థలాలు అందకుండానే చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఒకే చోట కాకుండా నగరానికి నాలుగు వైపుల గుర్తించి ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. హెల్త్ కార్డులు అన్ని ఆసుపత్రులలో పనిచేసే విధంగా ఆదేశాలు ఇచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. జర్నలిస్టులు కూడా కొంత సొమ్మును హెల్త్ కార్డు కోసం కట్టి మంచి చికిత్స అన్ని ఆసుపత్రులలో పొందే విధంగా ప్రయత్నిస్తామని చెప్పారు. అర్హత ఉన్న ప్రతివారికి అక్రెడిటేషన్ వస్తుందని హామీ ఇచ్చారు. సీఎం ముఖ్య పౌర సంబంధాల అధికారి అయోధ్య రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో జర్నలిస్టులకు ఇవ్వాల్సిన ఇండ్ల స్థలాల విషయంలో కాలయాపన జరిగిందన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని చెప్పారు. సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ సమాజంకోసం తపించే వ్యక్తి జర్నలిస్ట్ అని చెప్పారు. సమాజంలో ఉన్న లోటుపాట్లను వెలుగులోకి తెచ్చేవాడే నిజమైన జర్నలిస్టు అన్నారు. అలాంటి సమాజసేవకుడికి సదుపాయాలు కల్పించటానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, సీనియర్ సంపాదకులు రామచంద్ర మూర్తి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్, సియాసత్ ఉర్దూ దిన పత్రిక సంపాదకులు ఆమేర్ అలీ ఖాన్, అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ కార్యదర్శి కెఎన్ హరి తదితరులు పాల్గొన్నారు. యూనియన్ నాయకుడు విరాహత్ అలీ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

ముడుపుల కుంభకోణంపై జపాన్ ప్రధాని కిషిదా క్షమాపణలు

టోక్యో: పాలక ఎల్‌డిపి కొన్ని సంస్థల నుంచి రహస్యంగా ముడుపులు స్వీకరించినందుకు జపాన్ ప్రధాని కిషిదా పార్లమెంటరీ ప్యానెల్ ఎదుట క్షమాపణలు చెప్పారు. రాజకీయ పార్టీలకు నిధులపై నియంత్రణకు సంబంధించిన చట్టాలను సంస్కరించేందుకు తాను కృషి చేస్తానని అన్నారు. గురువారం పార్లమెంటరీ ఎథిక్స్ కమిటీ ముందు కిషిదా హాజరయ్యారు. ముడుపుల కుంభకోణంపై ఎథిక్స్ కమిటీ ముందు ఒక ప్రధాని హాజరై ఇలా క్షమాపణ చెప్పడం జపాన్ పార్లమెంటరీ చరిత్రలో ఇదే మొదటి సారి. ఈముడుపుల భాగోతం తరువాత ఎల్‌డిపి ప్రతిష్ట మరింత దిగజారినట్లు తాజాగా నిర్వహించిన ఒపీనియన్ పోల్స్ తెలియజేస్తున్నాయి.

పశ్చిమ దేశాల ఆటలు సాగవు : పుతిన్

మాస్కో: రష్యాను మరో ఉక్రెయిన్ లాగా మార్చాలని అమెరికా, దాని మిత్ర దేశాలు కుతంత్రాలు పన్నుతున్నాయని రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. మాస్కోలోని గోస్టినీ డ్వోర్‌లో ఫెడరల్ అసెంబ్లీలో వార్షిక ప్రసంగం చేస్తూ, పశ్చిమ దేశాల కుతంత్రాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఉక్రెయిన్‌తో పాటు అనేక ఇతర దేశాలను ధ్వంసం చేసినట్టే రష్యాను ధ్వంసం చేయాలని పశ్చిమదేశాలు చూస్తున్నాయి. అటువంటి ఆటలు ఇక్కడ సాగనివ్వబోమని ఆయన స్పష్టం చేశారు. అవి తమ వలసవాద అలవాట్లను మానుకోలేదు, ప్రపంచవ్యాప్తంగా జాతుల మధ్య ఘర్షణలను రేకెత్తించి తమ ప్రపంచ ఆధిపత్యానికి తిరుగులేకుండా చూసుకోవాలని చూస్తున్నాయి అని రష్యా నాయకుడు ఫెడరల్ అసెంబ్లీకి చెప్పారు, రష్యాను వారికి అణగిమణిగి ఉండే ప్రదేశంగా మార్చాలనుకుంటున్నారు. మన అంతర్గత వ్యవహారాల్లో ఎవరినీ జోక్యం చేసుకోవడానికి అనుమతించే ప్రశ్నే లేదు అని పుతిన్ ఉద్ఘాటించారు. రష్యాపై అమెరికా, దాని మిత్రదేశాలు ప్రచ్ఛన్న యుద్ధం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. ఇందులో ఉక్రెయిన్ వివాదం ఒక అంశం మాత్రమే.కొత్త బహుళ ధ్రువ ప్రపంచం ఉద్భవిస్తున్నదనే విషయాన్ని పశ్చిమ దేశాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఆర్థిక పరిమితుల నుండి సైనిక శక్తిని పూర్తిగా ఉపయోగించడం వరకు అన్ని విధాలుగా రష్యాతో సహా ఎదుగుతున్న శక్తులను తొక్కేయాలని పాశ్చాత్య దేశాలు చూస్తున్నాయి.

నిమిషం నిబంధన ప్రాణం తీసింది!

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభం కావడంతో తనకు కేటాయించిన పరీక్ష కేంద్రమైన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పరీక్ష రాసేందుకు ఇంటి నుంచి బయలుదేరాడు. అప్పటికే పరీక్షా సమయానికి మూడు నిమిషాలు ఆలస్యం కావడంతో నిమిషం నిబంధనతో లోపలికి అనుమతించరనే కారణంతో పరీక్షా కేంద్రానికి చేరుకుండానే తిరుగుముఖం పట్టాడు. పరీక్ష సమయానికి కేంద్రానికి చేరుకోలేక పోవడంతో మనస్తాపానికి గురైన శివకుమార్.. తన గ్రామ సమీపంలోని సాత్నాల ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పరీక్ష మిస్ అయినందుకు తనను క్షమించాలంటూ తండ్రికి అతను రాసిన సూసైడ్ నోట్ ప్రాజెక్టు ఒడ్డున లభించింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై పలు విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు స్పందించారు. నిమిషం నిబంధన తొలగించాలని డీఐఈఓ రవీందర్‌కు వినతిపత్రం అందించారు.



హాలీవుడ్‌కు 'దృశ్యం' : తొలి భారతీయ చిత్రంగా రికార్డు

తెలుగు, మలయాళ, హిందీ భాషల్లో ఘన విజయం సాధించిన చిత్రం 'దృశ్యం'. ఇప్పటికే పలు రికార్డులను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రం రీమేక్‌లలో మరో ఘనత సాధించింది. ఏకంగా హాలీవుడ్ నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని ఇంగ్లీష్, స్పానిష్‌లలో రీమేక్ చేయనున్నట్లుగా ప్రకటించింది. దీంతో హాలీవుడ్‌లో రీమేక్ కానున్న మొదటి భారతీయ చిత్రంగా 'దృశ్యం' నిలిచింది. ముందుగా ఈ సినిమాను మోహన్‌లాల్, మీనా ప్రధాన పాత్రల్లో దర్శకుడు జీతూ జోసెఫ్ తెరకెక్కించారు. తెలుగులో వెంకటేష్ హీరోగా శ్రీప్రియ పార్ట్ 1 తెరకెక్కించగా, పార్ట్ 2ను జీతూ జోసెఫ్ తీశారు. హిందీలో అజయ్‌దేవ్‌గణ్, శ్రియ ప్రధాన పాత్రల్లో నటించారు. వేర్వేరు దర్శకులు వాటిని రూపొందించారు. తమిళ్‌లో కమల్‌హాసన్, గౌతమి ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలోనే మలయాళంలో 'దృశ్యం'3 రానుంది.

నవచిత్రం

కొత్త కాన్సెప్ట్‌తో 'స్వాగ్' గ్లింప్స్



శ్రీవిష్ణు హీరోగా దర్శకుడు హసిత్ గోలి తెరకెక్కిస్తున్న కొత్త చిత్రం 'స్వాగ్'. తాజాగా ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ని చిత్రబృందం విడుదలచేసింది. ఈ గ్లింప్స్‌లో అడవిలో జంతువులు మాట్లాడుకున్నట్టు చూపించారు. సునీల్, గంగవ్వ.. వాయిస్‌లు వినిపించాయి. ఈ సినిమాని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది. వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు.

సెట్స్‌పైకి ధృవ్ కొత్త చిత్రం



తమిళ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ హీరోగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి సెల్వరాజ్ దర్శకత్వం వహించనున్నారు. స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలో సెట్‌పైకి వెళ్లనున్నట్లు సమాచారం. కబడ్డీ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా కోసం ధృవ్ ప్రత్యేక శిక్షణ పొందుతున్నాడు. ఈ సినిమాలో హీరోకు జోడిగా దర్శనా రాజేంద్రన్ నటించనున్నారు. ఈ చిత్ర షూటింగ్ మార్చి 15 నుంచి ప్రారంభం కానుంది. తూత్తుకుడిలో ప్రారంభించి 80 రోజులలో షూటింగ్‌ను పూర్తి చేసెయ్యాలని డైరెక్టర్ ప్లాన్ చేస్తున్నారు.

ఆ మాటలు వెనక్కి తీసుకుంటున్నా : నాగబాబు



సోషల్ మీడియా వేదికగా నటుడు నాగబాబు క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఓ నోట్‌ను విడుదల చేశారు. ఇటీవల జరిగిన 'ఆపరేషన్ వాలెంటైన్' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో తాను మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకుంటున్నట్లుగా నాగబాబు తెలిపారు. ఈమేరకు 'ఎక్స్' వేదికగా క్షమాపణలు చెబుతూ నోట్‌ను విడుదల చేశారు. 'పోలీస్ పాత్ర 6 అడుగుల 3 అంగుళాలు ఉండే వ్యక్తులు చేస్తే బాగుంటుంది. 5 అడుగుల 3 అంగుళాలు ఉండే వ్యక్తులు చేస్తే బాగుండదు' అని నాగబాబు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. 'ఎవరైనా నా మాటలకు నొచ్చుకుని ఉంటే క్షమించండి..అవి యాదృచ్ఛికంగా వచ్చినవే కానీ...కావాలని అన్న మాటలు కాదు. అందరూ అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా' అంటూ రాసుకొచ్చారు. ఎత్తుకు సంబంధించిన తన తండ్రి చేసిన వ్యాఖ్యలు ఎవ్వరినీ ఉద్దేశించినవి కావని హీరో వరుణ్‌తేజ్ కూడా పేర్కొన్నారు. తన హైట్‌ను దృష్టిలో పెట్టుకుని చిన్న పోలిక చేశారనీ, ఏ హీరోను కించపర్చే ఉద్దేశ్యం లేదన్నారు.

అమ్మాయే పుట్టాలి : రణ్‌వీర్‌సింగ్



బాలీవుడ్ జంట రణ్‌వీర్‌సింగ్, దీపికా దంపతులు త్వరలో తల్లిదండ్రులు కాబోతున్నారు. ఈ విషయాన్ని వారు మీడియా సమక్షంలో వెల్లడించారు. 'మేము త్వరలోనే తల్లిదండ్రులం కాబోతున్నాం. నాకు దీపిక లాంటి ఆడపిల్ల కావాలని ఆశపడుతున్నా. అది చాలు నా జీవితానికి. నేను రోజూ ఆమె చిన్ననాటి ఫొటోలు చూస్తుంటాను. అందులో ఆమె దేవతలా ఉంటుంది. నాకు పుట్టబోయే పాప పేరు 'శౌర్యవీర్‌సింగ్' పెడతామనుకున్నా' అంటూ వ్యాఖ్యానించారు. రణ్‌వీర్, దీపిక దంపతులకు విక్రాంత్ మస్సే, కృతి సనన్, ప్రియాంకా చోప్రా, ఆలియాభట్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంద్రగంటి దర్శకత్వంలో ప్రియదర్శి



ప్రియదర్శి హీరోగా మోహన్ కృష్ణ ఇంద్రగంటి ఓ సినిమా తెరకెక్కించనున్నారు. శ్రీ దేవి మూవీస్ బ్యానర్‌పై శివలెంక కృష్ణ ప్రసాద్ ఈ సినిమాను నిర్మించబోతున్నారు. రూపాకొడువాయూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల ప్రకటన వెలువడనుంది.



సినీ గాయకుడు వడ్డేపల్లి శ్రీనివాస్ కన్నుమూత



నవతెలంగాణ-ఓయూ

ప్రముఖ సినీ, నేపథ్య గాయకుడు, జానపద బ్రహ్మ వడ్డేపల్లి శ్రీనివాస్ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం సికింద్రాబాద్ చిలకలగూడలోని ఆయన నివాసంలో మృతి చెందారు. అనంతరం ఆయన అంత్యక్రియలు సీతాఫల్‌మండి శ్మశాన వాటికలో జరిగాయి. అంత్యక్రియలకు సంగీత దర్శకులు విష్ణు కిషోర్, జానపద కవి, గాయకులు నేర్నాల కిషోర్, గాయనీ గాయకులు స్వర్ణక్క, బోనాల ప్రకాష్, సంపత్, మల్లిక హాజరై సంతాపం తెలిపారు. వడ్డేపల్లికి భార్య, ఒక కూతురు ఉన్నారు.

వరంగల్ జిల్లాలో జన్మించిన వడ్డేపల్లి చిన్నప్పుడే హైదరాబాద్‌కు వచ్చి తెలంగాణలో మొట్టమొదటి జానపద కళాకారుడిగా పేరు తెచ్చుకున్నారు. సుద్దాల అశోక్ తేజ రాసిన 'గరం గరం పోరీ నా గజ్జెల సవ్వారీ' అనే పాటతో 'నమస్తే అన్న' చిత్రం ద్వారా సినీ నేపథ్య గాయకుడిగా పరిచయమయ్యారు. అనంతరం నాగార్జున నటించిన కింగ్ సినిమాలో 'గింత గింత పాలసుక్కకే' అనే పాట పాడి ఎంతో మంది హృదయాలను గెలుచుకున్నారు. పవన్‌కల్యాణ్ హీరోగా నటించిన గబ్బర్‌సింగ్ సినిమాలోని 'పిల్లా నువ్వులేని జీవితం' పాటతో వడ్డేపల్లి శ్రీనివాస్‌కు ఎంతో పేరు వచ్చింది.

ఈ పాటకు ఆయనకు ఫిలిం ఫేర్ అవార్డ్ కూడా వచ్చింది. దాదాపు 100కు పైగా సినీ గీతాలు, ప్రయివేట్‌గా ఎన్నో ఫోక్ సాంగ్స్ ఆయన ఆలపించారు. అలాగే ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం ప్రకటించారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారిణి మేఘనారెడ్డికి సీఎం అభినందన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ ఛాలెంజ్-2024 పోటీల్లో కాంస్యపతకం సాధించిన మేఘనారెడ్డిని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో అభినందించారు. దేశం గర్వించేలా మరిన్ని పతకాలు సాధించాలని ఆశీర్వదించారు. మేఘనా రెడ్డి స్వస్థలం మహబూబ్‌నగర్ జిల్లా. మేఘన తండ్రి రవీందర్ రెడ్డి డీఎస్పీగా పనిచేస్తున్నారు, తల్లి శ్యామలత ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. ప్రస్తుతం మేఘనా మెహదీపట్నంలోని సెయింట్ ఆన్స్ కళాశాలలో బీఏ డిగ్రీ చదువుతున్నది. ప్రస్తుతం ఆమె ఖేలో ఇండియా పథకం కింద బెంగళూరులోని ప్రకాష్ పదుకొనే బ్యాడ్మింటన్ అకాడమీలో బ్యాడ్మింటన్ శిక్షణ పొందుతున్నది.

ఆమె అండర్-13, అండర్-15 కేటగిరీలతో పాటు అన్ని వయసుల విభాగాల్లో భారతదేశంలో అగ్రస్థానంలో నిలిచింది. మేఘన ఇప్పటివరకి మొత్తం 32 దేశీయ, అంతర్జాతీయ పతకాలు పొందింది. గతంలో ఆమె ఉగాండా అంతర్జాతీయ సిరీస్-2023లో బంగారు పతకం, కంపాలా ఇంటర్నేషనల్-2023లో వెండి పతకం, బహ్రెయిన్ ఇంటర్నేషనల్ సిరీస్ 2023లో కాంస్య పతకం, ఇన్ఫోసిస్ సీనియర్ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్-2024లో కాంస్య పతకం, జాతీయ క్రీడలు- 2023 గోవాలో కాంస్య పతకాలు సాధించింది.

ఆటలు

బుమ్రా వస్తున్నాడు



- ధర్మశాల టెస్టుకు భారత పేస్ దళపతి
- గాయంతో కెఎల్ రాహుల్ దూరం

ముంబయి : భారత్, ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌లో చివరి మ్యాచ్‌కు ఆటగాళ్ల అందుబాటుపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కీలక సమాచారం అందించింది. పని భారంతో రాంచి టెస్టుకు విశ్రాంతి తీసుకున్న పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా.. మార్చి 7 నుంచి ఆరంభం కానున్న ధర్మశాల టెస్టుకు అందుబాటులో ఉండనున్నాడు. ఐదో టెస్టు ముంగిట జస్‌ప్రీత్ బుమ్రా భారత జట్టుతో చేరుతాడని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. ఇక హైదరాబాద్ టెస్టులో గాయపడిన కెఎల్ రాహుల్.. వరుసగా మరో టెస్టుకు దూరమయ్యాడు. చివరి మూడు టెస్టులకు ఎంపిక చేసిన జట్టులో కెఎల్ రాహుల్‌ను సెలక్షన్ కమిటీ ఎంపిక చేసినా.. ఫిటెనెస్ క్లియరెన్స్ లేకపోవటంతో రాహుల్ అందుబాటులో ఉండటం లేదు. గాయం, ఫిట్‌నెస్ కారణంగా ఐదో టెస్టుకు సైతం రాహుల్ దూరంగా ఉంటున్నాడని తెలిపింది. కెఎల్ రాహుల్ గాయంపై తదుపరి చర్యల్లో భాగంగా లండన్‌లోని వైద్య నిపుణులను సంప్రదించనున్నారు. ఇక వైజాగ్ టెస్టు నుంచి రోహిత్‌సేనతో కొనసాగుతున్న యువ స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్..రంజీ సెమీఫైనల్లో తమిళనాడు తరఫున ఆడేందుకు జట్టు నుంచి బయటకు రానున్నాడు. అవసరమైతే ఐదో టెస్టు ముంగిట వాషింగ్టన్ సుందర్‌ను వెనక్కి పిలిపిస్తామని బోర్డు తన ప్రకటనలో తెలిపింది. ఇక సీనియర్ పేసర్ మహ్మద్ షమికి లండన్‌లో శస్త్రచికిత్స విజయవంతమైందని, రిహాబిలిటేషన్ కోసం త్వరలోనే బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీకి చేరుకుంటాడని వెల్లడించింది.

హైదరాబాద్ పరాజయం

- కోల్‌కత థండర్‌బోల్ట్స్ మెరుపు విజయం
- ప్రైమ్ వాలీబాల్ లీగ్ 2024



చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్ 2024 సీజన్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ పరాజయాల పరంపర కొనసాగుతుంది. గ్రూప్ దశలో బ్లాక్‌హాక్స్ ఆడిన ఐదు మ్యాచుల్లో నాలుగో పరాజయం చవిచూసింది. గురువారం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కత థండర్‌బోల్ట్స్ చేతిలో 8-15, 8-15, 15-11, 18-20తో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ ఓటమి చెందింది. హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ కీలక ఆటగాళ్లు హేమంత్, జోసెఫ్, లాల్ సుజన్ అంచనాలను అందుకోలేదు. కోల్‌కత థండర్‌బోల్ట్స్ ఆటగాళ్లు వినిత్, అమిత్, కుకూర్‌లు ఆకట్టుకునే ప్రదర్శన చేశారు. హైదరాబాద్ బ్లాక్‌హాక్స్‌కు ఇది వరుసగా మూడో ఓటమి కావటం గమనార్హం. తొలి రెండు సెట్లలో ఆరంభంలో ఆధిక్యం సాధించినా హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ ఆఖరు వరకు ఆ జోరు చూపించలేదు. కానీ చావోరేవో తేల్చుకోవాల్సిన మూడో సెట్‌లో గట్టిగా పుంజుకుంది. 15-11తో మూడో సెట్‌ను గెల్చుకుని మ్యాచ్ రేసులోకి వచ్చింది. కీలక నాల్గో సెట్‌లో సైతం హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ ఆఖరు వరకూ పోరాడింది. 13-13 నుంచి ప్రతి పాయింట్ ఆధిక్యం మారుతూ సాగిన సెట్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ ఆఖర్లో బోల్తా కొట్టింది. 20-18తో నాల్గో సెట్‌తో పాటు మ్యాచ్‌నూ కోల్‌కత థండర్‌బోల్ట్స్ సొంతం చేసుకుంది.



టైటిల్ కొట్టేదెవరో?

- పుణెరి పల్టాన్‌తో హర్యానా స్టీలర్స్ ఢీ
- ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్ ఫైనల్ నేడు

నవతెలంగాణ-హైదరాబాద్ : ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్ టైటిల్ పోరుకు రంగం సిద్ధమైంది. రెండు సార్లు ఫైనలిస్ట్ పుణెరి పల్టాన్‌తో తొలిసారి ఫైనలిస్ట్ హర్యానా స్టీలర్స్ ఢీకొట్టనుంది. వరుసగా రెండో సీజన్లో పుణెరి పల్టాన్‌కు అంతిమ సమరానికి సిద్ధమైనా.. తొలి టైటిల్ కోసం తహతహ లాడుతోంది. తొలిసారి ఫైనల్స్‌కు చేరుకున్న హర్యానా స్టీలర్స్ సైతం ఇప్పుడే టైటిల్ కొట్టాలని పట్టుదల ప్రదర్శిస్తోంది. కెప్టెన్ అస్లాం ఇమామ్‌దార్ నాయకత్వం పుణెరి పల్టాన్‌కు, జైదీప్ సింగ్ సారథ్యం హర్యానా స్టీలర్స్‌కు అదనపు బలాలు. గ్రూప్ దశలో అగ్రస్థానం, సెమీఫైనల్లో మూడు సార్లు చాంపియన్ పట్నా పైరేట్స్‌పై పంజా విసిరి పుణెరి పల్టాన్ ఫైనల్‌కు చేరుకోగా.. గ్రూప్ దశలో టాప్-6లో నిలిచి ప్లే ఆఫ్స్ నుంచి వచ్చి సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్‌ను చిత్తు చేసి హర్యానా స్టీలర్స్ ఫైనల్‌కు చేరుకుంది. టైటిల్ వేటలో పుణెరి పల్టాన్, హర్యానా స్టీలర్స్ భిన్న తరహాలో తుది పోరుకు చేరుకున్నాయి. కానీ ఒక అంశంలో ఇరు జట్ల విజయ సూత్రం ఒకటే. ప్రత్యర్థి జట్టు కూతలో పల్టాన్, స్టీలర్స్‌తో సమవుజ్జీలుగా నిలిచాయి. కానీ ట్యాకిల్స్‌లో ఈ రెండు జట్లు తిరుగులేని ఆధిపత్యం చెలాయించాయి. ఇప్పుడు ఫైనల్లో ఇరు జట్లు తాడోపేడో తేల్చుకోనుండగా రెయిడింగ్, డిఫెన్స్ ఆసక్తికర సమీకరణంగా మారాయి. గ్రూప్ దశ ముఖాముఖి మ్యాచుల్లో ఓ మ్యాచ్‌లో పుణెరి పల్టాన్ పైచేయి సాధించగా, ఓ మ్యాచ్‌లో హర్యానా స్టీలర్స్ గెలుపొందింది. సీజన్లో ముచ్చటగా మూడోసారి ఢీకొంటున్న హర్యానా స్టీలర్స్, పుణెరి పల్టాన్ నేడు టైటిల్ విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నాయి. ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్ ఫైనల్ నేడు రాత్రి 8 గంటలకు ఆరంభం కానుంది.

మనోళ్లు బంగారం!

ఐపీఎల్‌లో భారత క్రికెటర్లపై గంగూలీ



న్యూఢిల్లీ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో భారత క్రికెటర్లు బంగారంతో సమానమని ఢిల్లీ క్యాపిటల్స్ క్రికెట్ డైరెక్టర్ సౌరవ్ గంగూలీ అన్నాడు. వికెట్ కీపర్ రిషబ్ పంత్ రాకతో ఢిల్లీ క్యాపిటల్స్ శిబిరంలో నూతన ఉత్సాహం రానుందని ఆయన అన్నాడు. 'రిషబ్ పంత్ రాక ఢిల్లీ క్యాపిటల్స్ కొండంత బలం. ఎందుకంటే ఐపీఎల్‌లో భారత క్రికెటర్లు బంగారం. పంత్ ఏడాదికిపైగా క్రికెట్ ఆడకపోయినా వేగంగా ఊపందుకుంటాడని అనుకుంటున్నా. పునరాగమనం కోసం పంత్ ఎంతగానో శ్రమిస్తున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్, భారత్‌కు రీ ఎంట్రీ ఇవ్వాలని ఎదురుచూస్తున్నాడు. ఈ సీజన్‌లో రిషబ్ పంత్ జోరు చూపిస్తాడని అనుకుంటున్నాను. మహిళల ప్రీమియర్ లీగ్ ఆరంభం సందర్భంగా బెంగళూర్‌లో పంత్‌ను కలిశాను. ఐపీఎల్ సహా భారత క్రికెట్ పునరాగమనంతో ఆసక్తితో ఉన్నాడు. ఇది ఢిల్లీ క్యాపిటల్స్, భారత క్రికెట్‌కు శుభ పరిణామం' అని సౌరవ్ గంగూలీ అన్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌కు రిషబ్ పంత్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, ఆ జట్టు ఈ సీజన్‌లో తొలి రెండు సొంత గడ్డ మ్యాచులను వైజాగ్‌లో ఆడనున్న సంగతి తెలిసిందే.

కేంద్రీకరణ విధానాలు వద్దు

- స్వయంప్రతిపత్తి కావాలి : కేరళలో సహకార ఉద్యోగుల నిరసన
- మోడీ సర్కారు తీరుపై కేసీఈయూ ఆగ్రహం



తిరువనంతపురం : కేరళలో సహకార ఉద్యోగులు నిరసనకు దిగారు. మోడీ సర్కారు తీసుకొస్తున్న కేంద్రీకరణ విధానాలు వద్దనీ, తమకు స్వయంప్రత్తి కావాలని వారు డిమాండ్ చేశారు. వివిధ రంగాలకు చెందిన సామాజిక ఆర్థిక అంశాల్లో కీలక పాత్ర పోషిస్తున్న సహకార సంఘాలను కబ్జా చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్దకు పాదయాత్ర చేపట్టారు. సహకార సంఘాలపై కేంద్రం చర్యలకు వ్యతిరేకంగా కొల్లాంలో జరిగిన నిరసన కార్యక్రమాన్ని కేరళ కోఆపరేటివ్ ఎంప్లాయిస్ యూనియన్(కేసీఈయూ) ప్రధాన కార్యదర్శి ఎస్.కె రామచంద్రన్ ప్రారంభించారు.

కేరళలోని సహకార సంఘాల ఉద్యోగులు ఈ రంగంపై కేంద్ర ప్రభుత్వం నుంచి నిరంతర దాడులకు వ్యతిరేకంగా యుద్ధ మార్గంలో ఉన్నారు. ఫిబ్రవరి 27న కేసీఈయూ కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు మార్చ్‌లు నిర్వహించింది. ఈ రంగాన్ని కేంద్రం బారి నుంచి కాపాడటానికి నిరసనలు చేపట్టింది. సహకార సంఘాల కోసం కొత్త మంత్రిత్వ శాఖను సృష్టించటం ద్వారా రాష్ట్ర అంశంలోకి చొరబడడం ద్వారా మోడీ సర్కారు సమాఖ్య, ప్రజాస్వామ్య, రాజ్యాంగ ఆదేశాలను ఉల్లంఘించిందని కేసీఈయూ ఆరోపించింది. ప్రభుత్వం లేదా రిజిస్ట్రార్ నియంత్రణ లేకుండా కేవలం ఆడిట్ సిస్టమ్ ద్వారా మార్గనిర్దేశం చేయబడే మల్టీ-స్టేట్ కోఆపరేటివ్ సొసైటీల (ఎంఎస్‌సీఎస్) ప్రమోషన్‌ను ఉద్యోగులతో సహా భాగస్వాములు వ్యతిరేకిస్తున్నారు.కేరళలో సహకార సంఘాలు సుదీర్ఘ చరిత్రను కలిగి ఉన్నాయి. 16,256 సంఘాలు సహకార రిజిస్ట్రార్ నియంత్రణలో, 6,911 సంఘాలు వివిధ శాఖల నియంత్రణలో ఉన్నాయి. సొసైటీలు ప్రధానంగా పాడి రైతులు, మత్స్య పరిశ్రమ, బీడీ కార్మికులు, కొబ్బరి, చేనేత, ఇతర రంగాలకు మద్దతును అందించటంతో పాటు వ్యవసాయానికి సంబంధించిన క్రెడిట్‌లను కవర్ చేస్తాయి.సీఐటీయూకి అనుబంధంగా ఉన్న కేసీఈయూ ప్రధాన కార్యదర్శి ఎస్.కె రామచంద్రన్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలో రాష్ట్రాల అంశాల కింద జాబితా చేయబడిన సహకార సంఘాలపై నియంత్రణను లాక్కోవడానికి కేంద్రం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు.

మోడీ సర్కారు చేసిన సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటు పూర్తిగా రాజ్యాంగ, సమాఖ్య సూత్రాలకు విరుద్ధమని చెప్పారు.

పెండింగ్ వేతనాల కోసంనేడు 104 ఉద్యోగుల ధర్నా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఐదు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద 104 ఉద్యోగులు ధర్నా నిర్వహించనున్నారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టిన నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లోని యూనియన్ కార్యాలయంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదా నాయక్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న 104 ఉద్యోగులకు ఐదు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని, ఇతర అన్ని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గడప గడపకు ఉచిత వైద్యం పేరుతో గత 15 సంవత్సరాలుగా పని చేస్తున్న ఉద్యోగులకు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు గడవక అప్పుల పాలై ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి, రెగ్యులర్ చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ, సర్వీస్ వెయిటేజ్ కల్పించాలని డిమాండ్ చేశారు. బదిలీలకు అవకాశం కల్పించాలనీ, ఇతర అన్ని సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ధర్నాకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పి. శ్రీనివాస్, సీహెచ్. అనిల్ కుమార్, ఎం.రాజా గౌడ్ ,కే. మధుసూదన్. బి.బుచ్చిరాజు, జి.సాయి బాబా, రాజ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి సాగర్ నుంచి 3 టీఎంసీలు

కేఆర్ఎంబీ అనుమతి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఆంధ్రప్రదేశ్‌కు మూడు టీఎంసీల నీటిని విడుదల చేయనున్నారు. ఈమేరకు కృష్ణానదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) అనుమతినిచ్చింది. సాగర్ కుడి కాల్వ హెడ్‌రెగ్యులేటర్ ద్వారా శుక్రవారం ఉదయం 11 గంటలకు నీరు విడుదల చేయాలని నిర్ణయించింది. కేఆర్ఎంబీ అధికారుల సమక్షంలో నటి విడుదల జరుగుతుందని ఉత్తర్వుల్లో బోర్డు పేర్కొన్నది.

ఈ మేరకు గురువారం కేఆర్ఎంబీ రెండు తెలుగు రాష్ట్రాలకు సమాచారం ఇచ్చినట్టు కేఆర్ఎంబీ సభ్యకార్యదర్శి అజయ్‌కుమార్ గుప్తా ఇటీవల ఆదేశాలు జారీచేశారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

సీఎం రేవంత్‌రెడ్డికి పీఆర్టీయూటీఎస్ కృతజ్ఞతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ నియామకాల భర్తీ ప్రక్రియను ప్రారంభిస్తూ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పీఆర్టీయూటీఎస్ కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీర్ఘకాలికంగా పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉందని తెలిపారు. అందువల్ల విద్యాప్రమాణాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ విద్యారంగాన్ని బలోపేతం చేస్తుందని వివరించారు. టెట్ పరీక్షను మినహాయింపు కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి ఉపాధ్యాయ పదోన్నతుల ప్రక్రియను కూడా పూర్తి చేస్తే ఈ సమస్య సంపూర్ణంగా పరిష్కరించబడుతుందని గుర్తు చేశారు. పదోన్నతుల విషయంలోనూ సీఎం చొరవ చూపాలని కోరారు.

గురుకులాల్లో హిందీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డికి ఆర్‌యూపీపీటీఎస్ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గురుకులాల్లో హిందీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతున్నదని ఆర్‌యూపీపీటీఎస్ తెలిపింది. వారికి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఎస్ నర్సిములు గురువారం లేఖ రాశారు. రాష్ట్రంలో హిందీ ప్రచారాన్ని దక్షిణభారత్ హిందీ ప్రచార్‌సభ ద్వారా ఎన్నో ఏండ్లుగా అందిస్తున్నారని తెలిపారు. ఆ సంస్థకు యూజీసీ అనుమతి ఉందని పేర్కొన్నారు. అయితే టీజీటీకి ఎంపికైన అభ్యర్థులకు సంబంధించి దక్షిణ భారత్ హిందీ ప్రచార్ సభ ఇచ్చిన ధ్రువపత్రాలు చెల్లుబాటు కావంటూ వారిని తిరస్కరించడం విచారకరమని తెలిపారు. ఆ ధ్రువపత్రాలతోనే అందరినీ పరీక్షలు రాయడానికి అవకాశం కల్పించారనీ, 1:2 నిష్పత్తిలో అభ్యర్థుల జాబితాను విడుదల చేశారని పేర్కొన్నారు. ధ్రువపత్రాల పరిశీలనలో అవి చెల్లుబాటు కావంటూ 25 జీవోను సాకుగా చూపడం పట్ల అభ్యర్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఆ సంస్థకు యూజీసీ గుర్తింపు ఉన్నా స్థానిక అధికారులు గుర్తించకపోవడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. టీఆర్టీలో అవే అర్హతలతో అభ్యర్థులు ఎంపికయ్యారని గుర్తు చేశారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించి వారికి తగు న్యాయం చేయాలని కోరారు.

ఎన్ఎంఎంఎస్ తుది కీ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పథకం (ఎన్ఎంఎంఎస్ఎస్) పరీక్ష గతేడాది డిసెంబర్ 10న నిర్వహించామనీ అందుకు సంబంధించిన తుది కీని విడుదల చేశామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఎ కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. https//bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ప్రాథమిక కీపై విద్యార్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరించామని తెలిపారు. తుది కీపై ఎలాంటి అభ్యంతరాలను స్వీకరించబోమని వివరించారు.

సీబీఐ విచారణకు హాజరుకాని అఖిలేశ్ యాదవ్

లక్నో : సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షులు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ గురువారం సీబీఐ విచారణకు హాజరుకాలేదు. మైనర్ ఖనిజాల అక్రమ మైనింగ్ కేసులో గురువారం విచారణకు హాజరుకావాలని అఖిలేష్‌కు బుధవారం సీబీఐ సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాల కారణంగా గురువారం విచారణకు హాజరుకాలేనని, విచారణకు అన్ని విధాల సహకరిస్తానని తన న్యాయవాది ద్వారా సీబీఐకి అఖిలేశ్ యాదవ్ సమాచారం ఇచ్చారు.

ఉద్యోగ విరమణ ఖాళీలనూ డీఎస్సీలో కలపాలి

డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే పది నెలల్లో ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ ఖాళీలను కూడా మెగా డీఎస్సీలో కాలపాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే 11,062 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్‌ను జారీ చేసిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడేండ్లుగా వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయలేదని పేర్కొన్నారు. దీంతో అభ్యర్థులు నిరాశలో ఉన్నారని తెలిపారు. కొత్త ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. డిసెంబర్ వరకు ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ పొందడం వల్ల మరో నాలుగు వేల పోస్టులను ఈ నోటిఫికేషన్‌లో జత చేసే అంశాన్ని ప్రభుత్వం ఆలోచన చేయాలని సూచించారు. అన్ని జిల్లాల్లో ఎక్కువ పోస్టులను భర్తీ చేసే విధంగా చూడాలని కోరారు. కొన్ని జిల్లాల్లో ఎస్జీటీ పోస్టులు పూర్తి స్థాయిలో ఖాళీల్లో చూపలేదని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కూడా పెంచాలని సూచించారు. గ్రూప్-1 తర్వాతే డీఎస్సీ రాతపరీక్షలను నిర్వహించాలని కోరారు. ఆన్‌లైన్ విధానంలో కాకుండా ఆఫ్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.

తలా, తోక లేకుండా మంత్రుల ఆరోపణలు

మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర మంత్రులు తలా, తోక లేకుండా బీఆర్ఎస్ సర్కారు హయాంలో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని చెబుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్ ఏమైనా విచారాణాధికారా? అని ప్రశ్నించారు. అధికారంలో ఉండి రైతులను ఆదుకోవాల్సిన వారు పోటీ యాత్రలు చేస్తున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య మాట్లాడుతూ పేద విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు కేసీఆర్ ప్రభుత్వం విదేశీ ఉపకారవేతనాలు ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారికి నిధులు ఇవ్వడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు దేవీ ప్రసాద్ మాట్లాడుతూ అధికారమదంతో వ్యవహరిస్తే ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

యాత్రల్లో కాదు... పనిలో పోటీ పడండి

-మాజీ మంత్రి వి .శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ సర్కారుతో పనిలో పోటీ పడాలనీ, యాత్రల్లో కాదని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ హితవు పలికారు. గురువారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వలసల జిల్లాగా మారిందని గుర్తుచేశారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాకే ప్రాజెక్టులకు నీళ్లొచ్చాయనీ, సాగు విస్తీర్ణం పెరిగిందనీ, వలసలు తిరగబడ్డాయని తెలిపారు. పాలమూరు ప్రాజెక్టుల వద్ద రేవంత్ సమీక్ష పెడితే తాము వచ్చేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. కృష్ణా ప్రాజెక్టులు కేఆర్ఎంబీ పరిధిలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకే మేడిగడ్డ వెళ్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వంలో ఉండి కాంగ్రెస్ నేతలు చిన్నపిల్లల తీరుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జడ్చర్లలో 200 తండాలకు కేసీఆర్ నీళ్లిచ్చారని తెలిపారు. ఎంపీ మన్నే శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన హామీల అమలుపై దష్టి సారించాలని డిమాండ్ చేశారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు చేసుకోండి

షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకానికి ఎస్సీ కులాలకు చెందిన అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అదనపు సంచాలకులు డి ఉమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల మూడు నుంచి 31 వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని పేర్కొన్నారు.'ఈ పాస్' వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థినీ, విద్యార్థులకు సూచించారు.

పరీక్షల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- అవాంఛనీయ సంఘటనలను నిరోధించాలి
- కాలేజీలు, పరీక్షా కేంద్రాల వద్ద టోల్ ఫ్రీ నెంబర్లుండాలి
- ఇంటర్ బోర్డు అధికారులకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలను సమర్థవంతంగా, ప్రశాంతంగా నిర్వహించాలని ఇంటర్ బోర్డు అధికారులను విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ఆదేశించారు. ఈ పరీక్షల నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గురువారం ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా, పరీక్షల నియంత్రణ అధికారి జయప్రదబాయి, డీఐఈవోలు, నోడల్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్షలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ జిల్లాల స్థాయిలో అవాంఛనీయ సంఘటనలను నిరోధించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టెలీమానస్ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నెంబర్ 14416 లేదా 1800-914416 నెంబర్లకు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. పరీక్షా కేంద్రాలు, కాలేజీల వద్ద ఆ నెంబర్లను అందుబాటులో ఉంచాలని కోరారు. ఆదిలాబాద్‌లో ఓ విద్యార్థి ఆత్మహత్యకు సంబంధించిన వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉన్న ఫిర్యాదుల కంట్రోల్ రూం హెల్ప్‌లైన్ నెంబర్ 040-24655027తోపాటు జిల్లా కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని సూచించారు. పరీక్షలను కాలేజీల ప్రిన్సిపాళ్లు అప్రమత్తంగా నిర్వహించాలని కోరారు.

విద్యార్థులు, అధ్యాపకులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెండోరోజు 13,085 మంది గైర్హాజరు

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గురువారం నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గురువారం సెకండ్ లాంగ్వేజ్ పరీక్షను నిర్వహించామని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 4,55,536 మంది దరఖాస్తు చేయగా, 4,42,451 (97.13 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. రెండోరోజు 13,085 (2.87 శాతం) మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఖమ్మంలో ఒకరిపై మాల్‌ప్రాక్టీస్ కేసును నమోదు చేశామని తెలిపారు. ఇంటర్ సెకండియర్ సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు సెట్ ఏ ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేశామని వివరించారు. జోగులాంబ గద్వాల, కామారెడ్డి, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఇంటర్ బోర్డు నుంచి పరిశీలకులు వెళ్లి పరీక్షను పరిశీలించారని తెలిపారు. ఈ పరీక్ష ప్రశాంతంగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జరిగిందని పేర్కొన్నారు.

కృష్ణా జలాలపై హక్కులను వదులుకున్నారు

- రాష్ట్రానికి తీరని అన్యాయం చేశావు
- మాజీ సీఎం కేసీఆర్‌కు చల్లా వంశీచంద్‌రెడ్డి లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కృష్ణా జలాలపై తెలంగాణ హక్కులను వదులుకుని తెలంగాణ రాష్ట్రానికి శాశ్వత అన్యాయం చేశారని ఏఐసీసీ కార్యదర్శి, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి గుర్తు చేశారు. ఈమేరకు గురువారం మాజీ సీఎం కేసీఆర్ చేసిన అన్యాయంపై ఆయన ఆధారాలతో సహా బహిరంగ లేఖ రాశారు. చేతగానితనంతో రాష్ట్రం హక్కులు వదులుకుని తెలంగాణకు తీరని ద్రోహం చేసిన చరిత్ర మీదని పేర్కొన్నారు. తెలంగాణ వాటాగా న్యాయంగా రావాల్సింది 575 టీఎంసీనే...కేసీఆర్ 299 టీఎంసీలకే కేంద్రం వద్ద అంగీకరించారని తెలిపారు. న్యాయమైన వాటాను వదులుకుని కృష్ణా పరివాహక ప్రాంతంలో కొత్త ప్రాజెక్టు కట్టకుండా, పెండింగ్ ప్రాజెక్టుల పనులు పూర్తి చేయకుండా తెలంగాణను బీడు చేసిన చరిత్ర కేసీఆర్‌దేనని విమర్శించారు. కమిషన్ల కోసం కాళేశ్వరం పేరుతో నకిలీ కట్టడాలు చూపించి కేసీఆర్ వేల కోట్లు లూటీ చేశారని ఆరోపించారు. మేడిగడ్డ సందర్శన పేరుతో బీఆర్ఎస్ చేసే సర్కస్ ఫీట్లను తెలంగాణ అసహ్యించుకుంటోందని తెలిపారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో ప్రాజెక్టులు కట్టి ఉంటే, రాష్ట్రానికి న్యాయమైన వాటా తెలంగాణకు దక్కే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. ఎస్ఎల్బీసీ, ఆర్డీఎస్ విస్తరణ, మహబూబ్‌నగర్‌లోని 10 టీఎంసీల ఎత్తిపోతల పథకాలు, పాలమూరు ఎత్తిపోతల పథకం, బీమాను ఎందుకు నిర్లక్ష్యం చేశారో కేసీఆర్ తెలంగాణకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.సంగం బండ రిజర్వాయర్‌లో బండ పగలగొడితే 20వేల ఎకరాలకు నీరు అందుతుందని మొత్తుకున్నా కేసీఆర్ పట్టించుకోలేదని తెలిపారు. సంగం బండ బాధితులకు న్యాయం చేస్తూ, ఆగమేఘాల మీద నిధుల విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

పారిశ్రామికవేత్తలు సంపద సృష్టికర్తలు

- పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం
- రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన విధానాలతో ఉంది :సింగపూర్ కౌన్సిల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ బృందంతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పారిశ్రామికవేత్తలు సంపద సృష్టికర్తలనీ, రాష్ట్రంలో సింగపూర్ నుంచి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం ఆయన కౌన్సిల్ జనరల్ ఆఫ్ రిపబ్లిక్ ఆఫ్ సింగపూర్ ఎడ్గర్ పాంగ్ బృందంతో సచివాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులను ఆహ్వానించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారు ఆస్వాదించే భౌగోళిక, స్నేహపూర్వక వాతావరణం ఉంటుందని చెప్పారు. మౌలిక సదుపాయాలు అద్భుతంగా ఉన్నాయని ఆ బృందానికి వివరించారు. పెట్టుబడులకు సలహాలు సూచనలు ఇవ్వండి... ఆహ్వానించే విషయం లో రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన విధానాలు న్నాయన్నారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నిర్మాణంతో హైదరాబాద్‌లో పెట్టుబడుల భూమ్ ఏర్పడిందన్నారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలని కలిపేలా తాజాగా రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) నిర్మాణం జరుగుతున్నదన్నారు. రాష్ట్రంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి క్లస్టర్ జోన్ల వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఫార్మా టెక్స్‌టైల్, ఐటీ క్లస్టర్లు ఏర్పాటు చేసి అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నామన్నారు. హైదరాబాద్ పట్టణంలోని పురాతన మూసీ నదిని పునర్-జీవింప చేసే చర్యలు ప్రారంభించామని చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్ బోర్డు ద్వారా మంచినీటితో మూసీని నింపి.. థేమ్స్ నదిలా మారుస్తామన్నారు. ఆ నది పరివాహక ప్రాంతం అంతటిని కమర్షియల్, చిల్డ్రన్ పార్క్, మాళ్ల నిర్మాణం చేసి ఆర్థిక కార్యకలాపాలు వేగవంతం చేసే ఆలోచనలో ఉన్నామన్నారు. ఇటీవల జపాన్‌కు చెందిన జైకా సంస్థ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నట్టు సింగపూర్ బృందానికి తెలియజేశారు. వ్యవసాయ ఆధారిత రంగంలో తెలంగాణ బలోపేతంగా ఉందన్న విషయాన్ని వారికి తెలిపారు. మీరు పెట్టుబడులు పెట్టేందుకు అవసరమైన భూమి, ఇతర వనరులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. రాష్ట్ర జీఎస్డీపీ బాగా పెరిగిందనే విషయాన్ని వారికి వివరించారు. ఐటీ, ఫార్మా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో ఉందన్నారు. సింగపూర్‌కు చెందిన కొన్ని కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నాయని ఎడ్గర్ పాంగ్ భట్టి విక్రమార్కకు వివరించారు. అర్బన్ ప్లానింగ్ విషయంలో తమకు మంచి పట్టుందని తెలిపారు. సింగపూర్‌కు చెందిన అతిపెద్ద డీబీఎస్ బ్యాంక్ హైదరాబాదులో ఉన్నట్టు తెలిపారు. ఐటీ పార్కులో సింగపూర్ ఆఫీసులు ఉన్న విషయాన్ని వివరించారు. హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదనీ, రెండు రోజులకు ఒకసారి సింగపూర్ ఎయిర్ లైన్స్ ప్రయాణికులతో హైదరాబాద్ రాకపోకలు సాగిస్తోందన్నారు. ఎయిర్ ఇండియా సైతం పెద్ద సంఖ్యలో సింగపూర్‌కు ఎయిర్ లైన్ సేవలు అందిస్తున్నదని తెలిపారు. హైదరాబాద్ బయోటెక్ హబ్‌గా స్థిరపడుతుందని పాంగ్ వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రత్యేకంగా సహకారం తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేత డ్రామా..



- తనపై తానే హత్య ప్రయత్నం
- అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

నవతెలంగాణ-ఉప్పల్

ఓ బీజేపీ నేత సమాజంలో పలుకుబడి కోసం తన మీద తానే హత్య ప్రయత్నం చేసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. అయితే చివరికి అసలు విషయం బయటపడటంతో అడ్డంగా బుక్కయ్యాడు. సంబంధిత కేసు వివరాలను మల్కాజిగిరి డీసీపీ పద్మజ ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్‌లో నివాసం ఉంటున్న భాస్కర్ గౌడ్.. సినీ నిర్మాతగా, బీజేపీ హిందీ ప్రచార కమిటీగా సుపరిచుతులు. కాగా, గన్‌మెన్లు వెంట ఉంటే సమాజం తనను గౌరవిస్తుందని.. తనకు ప్రాణహాని ఉన్నట్టు నమ్మిస్తే పోలీసులే తనకు గన్‌మెన్లను ఇస్తారని ప్లాన్ వేశాడు. ఈ మేరకు తన మీదే ఓ మర్డర్ ప్లాన్ చేయించుకున్నాడు. ఫిబ్రవరి 24వ తేదీన ఉప్పల్ భగాయత్‌లో ఈ మర్డర్ ప్లాన్ జరిగింది. అందుకోసం రూ.2,50,000 ఒప్పందం కూడా చేసుకున్నాడు. అనుకున్నట్టుగానే 24న ఉదయ్ భాస్కర్ గౌడ్.. తన శరీరంపై కత్తి పోట్లతో ఆస్పత్రికి చేరారు. అనంతరం తనపై హత్యా ప్రయత్నం జరిగిందని ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో అతను ఫిర్యాదు చేశాడు. దాంతో పోలీసులు దర్యాప్తు చేపట్టగా అసలు విషయం బయటపడింది. హత్య ప్లాన్‌కు సహకరించిన భాస్కర్ గౌడ్‌తో పాటు మరో ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. వీరివద్ద నుంచి ఇన్నోవా వాహనం, రెండు ద్విచక్ర వాహనాలు, రూ. 2 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఇంకో ఇద్దరు పరారీలో ఉన్నారు. భాస్కర్ గౌడ్‌పై జంట నగరాల్లోని పోలీస్ స్టేషన్‌లలో ఇప్పటికే ఏడు కేసులు ఉన్నాయని డీసీపీ పద్మజ తెలిపారు.

ఖరాష్ట్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో.. హజ్ యాత్రకు.. డ్రా

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నాంపల్లిలోని హజ్ హౌస్‌లో ఖాదీం-ఉల్-హజ్ కోసం 22 మంది ఖదీమ్‌లకు డ్రా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ హాజరయ్యారు. ఎగ్జిక్యూటివ్ అధికారి షేక్ లియాఖత్ హుస్సేన్ మాట్లాడుతూ.. కేంద్ర హజ్ కమిటీ సూచనల మేరకు 300 మంది యాత్రికులకు ఖాదీమ్ ఉల్ హజ్‌ను నియమించినట్టు తెలిపారు. 144 దరఖాస్తుల్లో 26 ఖాదీమ్-ఉల్-హజ్ రాష్ట్ర హజ్ కమిటీ ఎంపిక చేయగా, 22 మందిని ఖాదీమ్-ఉల్-హజ్ లాటరీ ద్వారా ఎంపిక చేశారు. నలుగురు యాత్రికులు రాష్ట్ర హజ్ కమిటీ, వక్ఫ్ బోర్డు ఉద్యోగుల నుంచి నేరుగా ఎంపికవుతారు. కేంద్ర హజ్ కమిటీ రాష్ట్ర హజ్ కమిటీ, వక్ఫ్ బోర్డులకు 15 శాతం కేటాయించినందున.. ఏడుగురు ఉద్యోగులు ఈ కోటా కింద దరఖాస్తులు సమర్పించారని, అయితే వారు డ్రా చేసుకోలేదని సమాచారం. ముస్తాక్ అహ్మద్ పవిత్ర ఖురాన్ పఠనంతో డ్రా జరిగింది. కార్యదర్శులు ఇర్ఫాన్ షరాఫ్ కార్యక్రమాన్ని నిర్వహించగా జర్నలిస్టులు డ్రా నిర్వహించారు.

ఎంఎస్ఎంఈలు ..మన ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకలు..

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలు భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకలాంటివని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని నానక్ రామ్ గూడాలో ఓ ప్రయివేటు హోటల్లో 'అవుట్ లుక్ బిజినెస్ స్పాట్ లైట్' సమర్పించిన ఇండో గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డులు 2024 పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 2030 నాటికి దేశంలో 600 మిలియన్ ఉద్యోగాలు అవసరమనే అంచనాలు ఉన్నాయని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌లో ప్రతి ఉద్యోగాల్లో ఏడు ఉద్యోగాలు ఎంఎస్ఎంఈల నుంచే లభిస్తున్నాయన్నారు. ప్రపంచ వ్యాపారంలో ఆ పరిశ్రమలు 90శాతం వాటాను కలిగి ఉన్నాయని తెలిపారు. ఈ పరిశ్రమలు ఉపాధి, జీడీపీ పెరుగుదలకు గణనీయంగా తోడ్పడుతున్నాయన్నారు.

శ్రామిక, పేద మహిళలు, యువత, బలహీన వర్గాలకు ఈ తరహా పరిశ్రమలు చేయూతనందిస్తున్నాయని కితాబునిచ్చారు. అవి రాష్ట్రంలో బయోసైన్స్, సోలార్ పవర్ వంటి వాటిని ఉపయోగించి వినూత్న ఉత్పత్తులు మార్కెట్‌లోకి తీసుకొస్తున్నాయని వివరించారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పునర్ నిర్మించడంలో ఆ పరిశ్రమలు ముందంజలో ఉన్నాయని చెప్పారు. ఎంఎస్ఎంఈ రంగంలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన సుమారు 20 మందికి ఈ సందర్భంగా అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మేడిగడ్డకు బీఆర్ఎస్ బృందం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై తమ వాదనలు ప్రజలకు వినిపించేందుకు నేడు మేడిగడ్డను బీఆర్ఎస్ బృందం సందర్శించనుంది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన వివరాలను వెల్లడించారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, ఇంజినీర్లు, మీడియా ప్రతినిధులు, ఇతర సాంకేతిక నిపుణులతో కూడిన బృందం ఈ పర్యటనలో పాల్గొంటుందని పేర్కొన్నారు.

ఉదయం ఎనిమిది గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌నుంచి రెండు బస్సుల్లో బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భూపాల్ పల్లికి చేరుకుంటుందని తెలిపారు. భోజనం అనంతరం మేడిగడ్డను సందర్శించి అక్కడే మీడియా సమావేశంతో పాటు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహిస్తామని వెల్లడించారు. అన్నారం బ్యారేజిని సైతం సందర్శించి కాళేశ్వరం ప్రాజెక్ట్ ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తామని కేటీఆర్ వివరించారు.

పీఎం పర్యటన ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రంలో ఈ నెల నాలుగు, ఐదు తేదీల్లో పర్యటించనున్న నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సీఎస్ శాంతికుమారి సమీక్ష నిర్వహించారు. ప్రధాన మంత్రి పర్యటనకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 4న ఆదిలాబాద్‌లో, 5న సంగారెడ్డిలో పీఎం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడంతోపాటు రెండు చోట్ల బహిరంగ సభల్లో కూడా ప్రసంగిస్తారని ఆమె తెలిపారు. అందుకు అనుగుణంగా బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు సూచించారు. విమానాశ్రయం, హెలిప్యాడ్‌లతో పాటు అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైన వైద్య సదుపాయాలు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రధానమంత్రి కాన్వాయ్ పర్యటించే మార్గాలలో రోడ్లు పరిశీలించాలనీ, ఏమైనా మరమ్మత్తులుంటే యుద్ధప్రాతిపధికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధాని పర్యటించే అన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. సమీక్షలో డీజీపీ రవిగుప్తా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి, పొలిటికల్ సెక్రటరీ రఘునందన్ రావు, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జోంగ్తు, గవర్నర్ సెక్రటరీ సురేంద్ర మోహన్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, సీఎండీ టీఎస్‌పీడీసీఎల్ ముషారఫ్, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆదిలాబాద్, సంగారెడ్డి కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

దమ్ముంటే మల్కాజిగిరిలో పోటీ చేసి నాపై గెలువు చూద్దాం

మాజీ మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పీసీసీ అధ్యక్ష పదవికి, సీఎం పదవికి రాజీనామా చేసి మల్కాజిగిరి ఎంపీగా పోటీ చేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి మాజీ మంత్రి కేటీఆర్ చేసిన సవాల్‌పై ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ స్పందించారు. దమ్ముంటే మల్కాజిగిరిలో నాపై పోటీ గెలువాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. ఈమేరకు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరే స్థాయి కేటీఆర్‌కు లేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా సరే ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతున్న కాంగ్రెస్ పార్టీ తరుపున ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి వస్తా.. రా... చూసుకుందాం అని సవాల్ విసిరారు. ఎవరివైపు న్యాయం ఉంటే వారిని గెలిపించాలని కోరుదామన్నారు.సంస్కారం గురించి కేటీఆర్ మాట్లాడుతుంటే నవ్వు వస్తున్నదన్నారు. గతంలో మీ తండ్రి కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు మాట్లాడిన మాటలు సమాజం మొత్తం చూసిందన్నారు. శాసనసభలో అధికార పక్షాన్ని ప్రతిపక్ష నాయకులు ప్రశ్నిస్తే ఎంత ఎగతాళిగా మాట్లాడారో ప్రజలు గమనించారని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాజకీయ సన్యాసం చేస్తానన్న కేసీఆర్, ఇప్పుడు ఆ విషయం విస్మరించారని గుర్తు చేశారు. పీసీసీ అధ్యక్షుడి స్థానంలో రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ సవాల్‌ను స్వీకరించి 64 స్థానాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే ఆరు గ్యారంటీల అమలు ప్రక్రియను ప్రారంభించారని తెలిపారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు కేటీఆర్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు.

ఎన్‌బీటీసీ నిర్దేశిత ఛార్జీలు మాత్రమే వసూలు చేయాలి

- ధరల పట్టికను ప్రదర్శించాలి
- లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవు
- రక్తనిధి కేంద్రాలకు డ్రగ్ కంట్రోల్ అథారిటీ వార్నింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రక్తనిధి కేంద్రాలు (బ్లడ్ బ్యాంకులు) వివిధ రకాల సేవలకు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నట్టు తరచూ ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల కాలంలో డ్రగ్ కంట్రోల్ అథారిటీ చేస్తున్న దాడుల్లో నిర్దేశించిన ధరల కన్నా ఎక్కువ వసూలు చేస్తూ పట్టుబడుతున్న ఘటనలు వెలుగు చూశాయి. మరోవైపు నిర్దేశించిన ధరలపై ప్రజలకు అవగాహన లేకపోవడాన్ని కూడా బ్లడ్ బ్యాంకులు దోపిడీకి అనుకూలంగా మలుచుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి డైరెక్టర్ జనరల్ వి.బి.కమలాసన్ రెడ్డి బ్లడ్ బ్యాంకులను హెచ్చరిస్తూ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నేషనల్ బ్లడ్ ట్రాన్స్ ఫ్యూషన్ కౌన్సిల్ (ఎన్ బీటీసీ) వివిధ రకాల సేవలకు ప్రభుత్వ, ప్రభుత్వేతర బ్లడ్ బ్యాంకులకు వేరు వేరుగా ప్రాసెసింగ్ ఛార్జీలను నిర్ణయించింది. ఉదాహరణకు ప్రభుత్వ బ్లడ్ బ్యాంకుల్లో రక్త సరఫరాకు ప్రాసెసింగ్ ఛార్జెస్ కింద రూ.1,100గా నిర్ణయిస్తే, ప్రభుత్వేతర రక్తనిధి కేంద్రాల్లో దాని ధరను రూ.1,550గా నిర్ణయించారు. అదే రకంగా మిగిలిన సేవల విషయంలో కూడా ధరలను ఖరారు చేశారు.

వీరికి ఉచితం

తరచూ రక్తమార్పిడి అవసరమైన తలసేమియా, హిమోఫిలియా, సికిల్ సెల్ ఎనిమియా తదితర రోగులకు రక్తనిధి కేంద్రాలు ఉచితంగా బ్లడ్, బ్లడ్ కాంపొనెంట్స్ ను ఉచితంగా ఇవ్వాల్సి ఉంటుంది. వీరి నుంచి ఎలాంటి ఛార్జీ వసూలు చేయడానికి వీల్లేదు.

డిస్ ప్లే తప్పనిసరి

ఆయా బ్లడ్ బ్యాంకులు ప్రాసెసింగ్ ఛార్జీల వివరాలతో కూడిన పట్టికను డిస్‌ప్లేలో పెట్టాలి. బ్లడ్, బ్లడ్ కాంపొనెంట్స్ కొనుగోలుదారులకు ఆ పట్టిక స్పష్టంగా కనిపించేలా ఉండాలని ఔషధ నియంత్రణ మండలి స్పష్టం చేసింది.

చర్యలు తప్పవు

నిర్దేశించిన ఛార్జీల కన్నా అధికంగా వసూలు చేసినా, ధరల పట్టికను డిస్‌ప్లేలో పెట్టకపోయినా చట్టపరమైన చర్యలు తప్పవని డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ కమలాసన్ రెడ్డి హెచ్చరించారు. ఛార్జీలు అధికంగా వసూలు చేస్తున్న బ్లడ్ బ్యాంకులపై ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్ 1800-599-6969లో ఫిర్యాదు చేయవచ్చని ఆయన సూచించారు. పని దినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ నెంబర్ పని చేస్తుంది.

నిరుద్యోగ యువత కలలు సాకారం చేస్తున్నాం

- 178 మంది వీఆర్వో కుటుంబాలకు కారుణ్య నియామకాలు : రెవెన్యూ శాఖ మంత్రి పొంగు లేటి శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ నిరుద్యోగ యువత కన్న కలలు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో సాకారం అవుతున్నాయని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగు లేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విధి నిర్వహణలో, అనారోగ్య, ఇతరత్రా కారణాలతో మరణించిన 178 మంది వీఆర్వోలకు సంబంధించి వారి కుటుంబాలకు కారుణ్య నియమాకాలు వర్తింపజేస్తూ జీవో జారీ చేశామని ప్రకటించారు. మూడు నెలల్లోపే 23వేల ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. 11,062 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేశామని పేర్కొన్నారు. వీఆర్వోల సమస్యలను పరిష్కరించాలనే సదుద్దేశంతోనే సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు చర్చించి సానుకూల నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించి ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలు కోసం రెవెన్యూ శాఖను పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వీఆర్వో కారుణ్య నియామకాల పట్ల టీవీఆర్‌వోడబ్ల్యూఏ హర్షం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వీఆర్వోల కారుణ్య నియామకాలు చేపట్టడం పట్ల తెలంగాణ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేందర్‌రావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తొమ్మిదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు 90 రోజుల్లో కాగ్రెస్ ప్రభుత్వం పరిష్కారం చూపిందని పేర్కొన్నారు. 178 మంది పూర్వ వీఆర్వోల కుటుంబాలకు అర్హతల మేరకు కారుణ్య నియామకాలు ఇచ్చి సర్కార్ తన మాట నిలుపుకుందని గుర్తు చేశారు. మానవతా దృక్పదంతో గొప్ప నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.